Shreshta Samaajam
Gamanam... Gamyam
(Telugu)

శ్రేష్ఠ సమాజం
గమనం... గమ్యం

రచన
షేక్ హమీదుల్లా షరీఫ్

విషయ సూచిక

ఆధ్యాత్మికం

1)	దైవత్వం- విశ్వాసం	09
2)	ఆత్మ పరిశుద్ధత	16
3)	'నమాజ్' అంటే ఏమిటీ?	26
4)	.... దేవుడున్నాడండీ!	29
5)	రోజా-పవిత్ర జీవనానికి గీటురాయి	34
6)	విశ్వ మానవ సౌభ్రాతృత్వం	42
7)	అమెరికా రష్యాల కాకిగోల	51

సామాజికం

1)	మదీనా వీధుల్లో మద్యం ప్రవహించింది	59
2)	మద్యపానం	62
3)	"మాకు వ్యభిచారం చేసే హక్కు కావాలి"	67
4)	ముస్లిం సమాజ లక్షణాలు	72
5)	స్త్రీకి ఉన్నతమైన స్థానాన్ని ప్రసాదించే మతం	76
6)	కమ్యూనిస్టులు, దొంగ దేశభక్తుల దుష్ప్రచారం నుండి దేశాన్ని కాపాడండి !	89

మా మాట

దైవ కారుణ్యార్హులు షేక్ హమీదుల్లా షరీఫ్, ఇస్లామీయ ఉద్యమం తెలుగు నాట ఉదయింపజేసిన ముద్దు బిడ్డడు. ఉద్యమంలో మనసా వాచా కర్మణా అంకితమవడానికి తన సర్వస్వాన్నీ త్యాగం చెయ్యడానికి సిద్ధమయిన దక్షిణాది సుపుత్రుడు. ఉద్యమాన్ని అర్థం చేసుకున్న తరువాత ఇక ముందుకేగడమే గాని వెనుతిరగగలిగే దారులన్నీ మూసివేసుకున్న ధీశాలి. ఉద్యమ సిద్ధాంతాలను సర్వవిధాలా రంగరించి వడపోసుకుని ఆకళింపు చేసుకున్న జిజ్ఞాసువు. వక్త, రచయిత; శిక్షకుడు. తెలుగు నాట ఉద్యమ సందేశం పయనించిన ప్రతి పల్లెకు, ప్రతి గ్రామానికి షరీఫ్ గారు సయితం తప్పక పయనించి ఉంటారంటే అతిశయోక్తి కాదు. ఉద్యమ సందేశాన్ని, ఇస్లామీ సందేశాన్ని వాడవాడన, ఊరూరా చేరవేయడానికి శ్రమ అనుకోకుండా అడిగిన ప్రతి వ్యక్తికి, పిలిచిన ప్రతి చోటికి కాదన కుండా బయలుదేరి వెళ్ళారు, ధర్మ సందేశాన్ని అందజేశారు. ఈ విధంగా షేక్ హమీదుల్లా షరీఫ్ అంటే ఎరుగనివారు, ఆంధ్ర, తెలంగాణాలలో ఇస్లామీయ ఉద్యమం గురించి ఏమాత్రం ఎరుక ఉన్న వారయినా లేరంటే కూడా అతిశయోక్తి కాదు.

షరీఫ్ గారు వ్యావహారిక భాషలో చేసే ప్రసంగాలు, మస్జిదుల్లో చేసినా, బహిరంగ సభల్లో చేసినా, రేడియోలో చేసినా టీవీ ఛానెల్స్‌లో చేసినా వినేవారిని కట్టిపడేసే ప్రసంగాలు. ఆయన ఉచ్చారణ పట్ల 'ది హిందూ' ఇంగ్లీషు దినపత్రిక రేడియో సమీక్షకుడు శ్లాఘించకుండా ఉండలేకపోయాడు. రేడియోలో గాని, టీవీలోగాని ఆయన పాల్గొన్న కార్యక్రమాల లెక్కే లేదు. ఆయన చేసిన ఇటువంటి ప్రసంగ పాఠాలు

దొరికినట్లయితే ప్రచురించడం వల్ల కొత్తగా ప్రసంగాలు చేస్తున్న వారికి ఎంతో మేలు కలిగే అవకాశముంది.

ఇస్లామీయ ఉద్యమ పత్రికగా 'గీటురాయి' మొదలయినప్పుడు షేక్ హమీదుల్లా షరీఫ్ గారు అందులో రాజకీయ, సామాజిక, నైతిక సమీక్షలు తనదయిన శైలిలో చేసేవారు. ఆ సమీక్షలు ఆ రోజుల్లో బాగా ప్రజాదరణ పొందాయి. అవి చాలామటుకు తాత్కాలిక సమస్యలకు సంబంధించినవే అయినప్పటికీ కొన్ని కాలాతీతమయినవీ ఉన్నాయి. అటువంటి వాటిని కొన్నింటిని ఎన్నుకుని ఈ పుస్తక రూపమిచ్చాము. ఈ వ్యాసాలు ఆయా సమయాల్లో సమయానుకూలంగా చేసిన సమీక్షలే అయినప్పటికీ వీటిలో కొన్ని శాశ్వత విలువల్ని చర్చించడమూ జరిగింది. అందువల్ల వీటి ప్రాముఖ్యత ఏమాత్రం తగ్గదు. పాఠకులు ఈ విషయాన్ని, వీటి ప్రత్యేకతను గుర్తించగలరని ఆశిస్తున్నాము.

'గీటురాయి'లో గత ముప్ఫయ్యేళ్ళుగా ఎన్నో విలువయిన వ్యాసాలు వచ్చాయి. తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ యాజమాన్యం, ఇటువంటి వ్యాసాలను సంకలనం చేసి ప్రచురించాలని నిర్ణయించింది. ఆ వ్యాసాలు గీటురాయిలో ప్రచురించబడినప్పుడు పాఠకుల మన్ననలు పొందాయి. కాని నేటి తరం పాఠకులకు అప్పటి విలువయిన రచనల ద్వారా ప్రయోజనం పొందే అవకాశం కలగాలంటే ఆ వ్యాసాల పునః ప్రచురణ ఒక్కటే మార్గం. ఆ ఉద్దేశ్యంతోటే ఈ ప్రచురణలను చేపట్టాము. పాఠకులు గమనించి ఆదరిస్తారని ఆశిస్తున్నాము.

హైదరాబాద్
7-2-2017

ఎస్.ఎమ్. మలిక్
(ఎడిటర్, గీటురాయి)

ఆధ్యాత్మికం

అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో...

దైవత్వం- విశ్వాసం

మనం ఉంటున్న ఈ ప్రపంచం ఒక నియమానికి, ఒక పద్ధతికి కట్టుబడి నడుస్తోందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ ఇట్టే గ్రహించగలుగుతారు. ఇందులో ఉన్న వాటన్నింటిలోనూ ఒక పటిష్టమైన క్రమబద్ధత, శాసనబద్ధత ఉంది. అప్రతిహతంగా, అత్యంత వైభవోపేతంగా, అత్యుత్తమమయిన రీతిలో సాగిపోతున్న మహోజ్వలమైన ఈ విశ్వవ్యవస్థలో ప్రతి వస్తువుకూ, ప్రతి ప్రాణికీ ఒక స్థానం, ఒక స్థలం అంటూ నిర్ణయమై ఉంది. సూర్యుడు, చంద్రుడు నక్షత్రాలు- ఒకటేమిటి అంతరిక్షంలో ఉన్నదంతా- ప్రచండమైన ఒక నియమావళికి లోబడి ఉన్నాయి; ఉల్లంఘించటానికి వీలు కాని చట్టాన్ని పాటిస్తున్నాయి; తమ నిర్ణీత మార్గాన్ని వదిలి ఇసుమంతైనా తప్పుకోలేవు. భూమి తన చుట్టు తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ పరిభ్రమించటంలో నిర్ణీత వేగాన్ని, మార్గాన్ని ఎంతో శ్రద్ధగా అనుసరిస్తోంది. ఈ అనుసరణలో రవ్వంత వ్యత్యాసమైనా ఉండదు. నీరు, గాలి, వెలుగు, వేడిమి- అన్నీ ఒక బలమైన నిబంధనకు లోబడి ఉన్నాయి. జీవరాసులు, వృక్షరాసులు, ఖనిజ రాసులూ- భ్రమరిస్తూ గంతులు వేసే అత్యంత సూక్ష్మమైన విద్యుత్కణం మొదలుకొని బ్రహ్మాండమైన పాలవెల్లి వంటివన్నీ - వాటికై నియమించిన నియమాన్నే ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా పాటిస్తూ ఉన్నాయి. వీటి పుట్టుక, పెరుగుదల, మనుగడ, అంతం- అన్నీ ఒక నియమానుసారంగానే సంభవిస్తున్నాయి.

స్వయంగా మానవులలోనూ ఈ ప్రకృతి సిద్ధాంతాలు ప్రస్ఫుటంగా గోచరిస్తాయి. మనిషి పుట్టడం, ఎదగటం, బ్రతకటం- అంతా జీవ శాస్త్ర సిద్ధాంతాలకనుగుణంగా ఒక క్రమంలో జరుగుతున్నాయి. ఆ నియమాల ప్రకారమే మనిషి గాలి, నీరు, వెలుగు, వేడిమి గ్రహిస్తాడు. ఇతని హృదయ స్పందనం, రక్తప్రసారం, ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఈ నియమాలకే లోబడి ఉన్నాయి. ఇతని శరీరంలోని సూక్ష్మకణాలు మొదలుకొని నరాలు, గుండె, మెదడు, కాళ్ళు చేతులు, కళ్ళు, చెవులు మొదలైన అవయవాలన్నీ వాటి నిర్దిష్ట నియమాన్నే పాటిస్తాయి. అంటే మన శరీరం ఒక నియమ నిబద్ధమైన జగత్తు. ఇందులోని ప్రతి పదార్థం దానికై నిర్ణయించబడిన విధానాన్నే అనుసరిస్తూ ఉంటుంది.

భువిలో అల్పాతి అల్పమైన ధూళిరేణువు మొదలుగా నభాంతరాల్లో భ్రమరించే అసంఖ్యాకమైన మహోన్నత గ్రహాలను, నక్షత్రాలను తన బంధాల్లో బిగించుకున్న ప్రచండ శక్తిమంతమైన సర్వవ్యాప్తమైన ఈ నియమం- సృష్టికర్త విశ్వప్రభువైన దేవుని నియమం. అంతు కానరాని ఈ విశ్వం, విశ్వంలోని సర్వమూ ఈ దైవ నియమాన్నే అనుసరిస్తున్నాయి; ఆయన ఆజ్ఞల్నే పాలిస్తున్నాయి. అంతేకాదు, దేవుని ఉనికిని గుర్తించటానికీ, దైవాన్ని విశ్వసించటానికీ నిరాకరించే మనిషి సయితం ఈ ప్రకృతి సిద్ధాంతానికే కట్టబడి ఉన్నాడు. ఇతను పిండరూపం దాల్చినప్పటి నుంచి, పుట్టి పెరిగి, గిట్టి మట్టిపాలయ్యేంతవరకు అంతా దైవ శాసనాలకు లోబడే జరుగుతుంది. కనుక ఇతని అవయవాలన్నీ, ఇతని ఒంటి మీద ప్రతి రోమమూ అవలంబించే ధర్మం దైవధర్మమే, దైవ నియమావళియే.

ఇస్లామ్ ధర్మశాస్త్రం ప్రకారం ఈ అనంత విశ్వాన్ని పరిపాలించే, దైవత్వాన్ని చెలాయించే దేవుడు ఒక్కడు, అనంతుడు, ఆది మధ్యాంత రహితుడు, అజరుడు, అమరుడు, సర్వవ్యాపి, ఆయనకు ఎవరి

ఆశ్రయమూ అక్కరలేదు. నిరపేక్షాపరుడు, అపారశక్తి సంపన్నుడు, సర్వోపజ్ఞాని, సర్వాంతరజ్ఞాని, సర్వాధిపతి, సర్వాధికారి. ఆయన ఆజ్ఞల్ని ఉల్లంఘించే ధైర్యం ఎవరికీ లేదు. అనన్య సామాన్యమైన శక్తి ప్రతాపాలు గల స్వామి సృష్టి సర్వానికీ జీవనోపాధిని ప్రసాదించే దాత; కొరత, లేమి, దోషం లాంటి అవగుణాలు లేని అపర నిర్మల తేజస్వి. దైవత్వపు ఈ గుణా లన్నీ ఒకే ఆస్తిత్వంలో ఇమిడి ఉన్నాయి. రెండు అస్తిత్వాలు ఈ గుణాలను సమానంగా కలిగి ఉండటం అసంభవం. దేవుని దైవత్వం అవిభాజ్య మైనది, అఖండమైనది, బ్రహ్మాండమైనది, ఇతరులకు పంచశక్యము కానిది. ఇతరులలో ఇమడ సాధ్యం కానిది; ఇతరులకు అబ్బనిది; శోభించనిది. ఇస్లామ్ ధర్మ మూలగ్రంథమైన దివ్యఖుర్ఆన్ గ్రంథం దేవుణ్ణి, ఆయన గుణ విశేషాలను ఇలా అభివర్ణిస్తుంది.

అల్లాహ్‌యే భూమ్యాకాశాల సామ్రాజ్యానికి ప్రభువు, అధిపతి. ఆకాశాలలోనూ, భూమిలోనూ గుప్తంగా ఉన్న సమస్త విషయాలు ఆయ నకు మాత్రమే తెలుసు. సకల వ్యవహారాలు నిర్ణయ నిమిత్తం ఆయన వైపునకే తీసుకుపోబడతాయి. ఆయన అత్యంత వివేకవంతుడు, అన్నీ తెలిపినవాడు. ఆయనే రాత్రిని పగలులోకి, పగలును రాత్రిలోకి ప్రవేశింప జేస్తాడు. హృదయాలలో దాగివున్న రహస్యాలను సయితం ఆయన ఎరుగును.

అల్లాహ్ అనుగ్రహం వల్లనే ఈ సృష్టి స్థిరంగా ఉంది. ఆయనే దాన్ని నడుపుతున్నాడు. దానిలోని ప్రతి ప్రాణికీ, ప్రతి వస్తువు మనుగడకు కావల సిన ఆహారాన్ని, శక్తినీ ఆయనే ప్రసాదిస్తున్నాడు. సార్వభౌమాధికారపు గుణ విశేషాలన్నీ ఆయనలోనే ఉన్నాయి. వాటి విషయంలో ఎవ్వరూ రవ్వంతైనా ఆయనకు భాగస్వాములు కారు.

సృష్టి మొత్తాన్నీ, దానిలోని ప్రతి వస్తువునూ ఆయన ఒకే చూపులో

చూడగలడు. సృష్టి మొత్తాన్నీ, అందులోని ప్రతి వస్తువునూ ఆయన ప్రత్యక్షంగా ఎరుగును. దాని వర్తమానాన్ని మాత్రమే కాదు, భూత భవిష్యత్తులను కూడా. అందరినీ ఒకే చూపులో ఒకేసారి చూసే శక్తి, సమగ్రమైన ఈ అగోచర జ్ఞానం ఆయనకు తప్ప మరెవ్వరికీ లేదు. ఆయన ఎల్లప్పుడూ ఉన్నాడు. ఎల్లప్పుడూ ఉంటాడు. ఆయన తప్ప అంతా నశించేదే, అశాశ్వతమైనదే. ఆయన తన సొంత శక్తి వల్లనే సజీవంగా ఉన్నాడు, సజీవంగా మిగిలివుంటాడు.

భూమిలోనూ, ఆకాశాలలోనూ ఉన్న ప్రతి వస్తువూ అల్లాహ్ పవిత్రతను కొనియాడుతోంది. ఆయనే శక్తిమంతుడు, వివేకవంతుడూను. భూమ్యాకాశాల సామ్రాజ్యానికి ప్రభువు ఆయనే. ఆయనే జీవితాన్ని ప్రసాదిస్తున్నాడు, మరణాన్ని కలిగిస్తున్నాడు, ప్రతి దానిపై అధికారం కలిగి వున్నాడు. ఆయనే ఆరంభమూ, ఆయనే అంతమూ, ఆయనే బాహ్యమూ, ఆయనే గూఢమూ. ఆయనకు ప్రతి వస్తువును గురించి తెలుసు. ఆయనే ఆకాశాలనూ, భూమినీ ఆరు దినాలలో సృష్టించాడు. తరువాత అధికార పీఠాన్ని అధిష్టించాడు.

భూమి లోపలకు పోయేదీ, అందులోనుండి వెలుపలకు వచ్చేదీ, ఆకాశం నుండి కిందికి దిగేదీ, దాని లోపలకు ఎక్కేదీ, అంతా ఆయన జ్ఞాన పరిధిలో ఉన్నది. మీరు ఎక్కడ ఉన్నా ఆయన మీతో ఉన్నాడు, మీరు ఏ పని చేస్తూ ఉన్నా, దానిని ఆయన చూస్తున్నాడు. ఏమీ లేనప్పుడూ, ఆయనున్నాడు, ఏమీ ఉండనప్పుడూ ఆయన ఉంటాడు. గోచరించే వారం దరికంటే ఆయన మరింత స్పష్టంగా గోచరిస్తాడు.

ఎందుకంటే ప్రపంచంలో గోచరించేవన్నీ ఆయన గుణవిశేషాలే. ఆయన కార్యకలాపాలే. ఆయన వెలుగే. ఆయన నిగూఢంగా ఉన్న వారిలో

మరింత నిగూఢుడు. ఎందుకంటే, ఇంద్రియాల ద్వారా ఆయనను గ్రహించటం సుదూర విషయం బుద్ధీ ఆలోచన, ఊహల ద్వారా కూడా ఆయనకు సంబంధించిన ఉనికినీ, యదార్థాన్నీ తెలుసుకోలేము. మరొక విధంగా చెప్పాలంటే, ఆయన సర్వమూ తెలిసిన జ్ఞాని మాత్రమే కాదు, సూక్ష్మ విషయాలను సైతం బాగా ఎరిగినవాడు. భూమి లోపలకు చొచ్చుకునిపోయే ఒక్కొక్క గింజ, భూమి నుండి పైకి వచ్చే ఒక్కొక్క మొగ్గ, ఒక్కొక్క ఆకు, ఆకాశం నుండి పడే ఒక్కొక్క చినుకు, సముద్రాల నుండి సరస్సుల నుండి ఆవిరి రూపంలో ఆకాశాన్ని చేరే ఒక్కొక్క నీటి కణం, ఇవన్నీ ఆయన దృష్టిలో ఉన్నాయి. భూమిలో ఏ గింజ ఎక్కడ పడిందో ఆయనకు తెలుసు. కనుకనే ఆయన ఆ గింజను మొలకెత్తింపజేస్తాడు, తరువాత దానిని పెంచి పెద్దదిగా చేస్తాడు. ఎక్కడెక్కడ నుండి ఎంతెంత ఆవిరి లేచిందో, ఎక్కడెక్కడకు చేరిందో ఆయనకు తెలుసు. కనుకనే ఆయన ఆ ఆవిరినంతనూ పోగుచేసి మేఘాలుగా రూపొందిస్తాడు. భూమిలోని విభిన్న ప్రాంతాలలో ఎంతెంత వర్షపాతం కావాలో, ఒక లెక్క ప్రకారం కురిపిస్తాడు. ఆయన ఎవరికీ పుట్టలేదు, ఆయనకు ఎవరూ పుట్టలేదు. ఆయన తప్ప ప్రపంచంలో ఉన్నదంతా ఆయన సృష్టియే. ఆయనతోపాటు ఆరాధనలో ఇతరులను కలపటం మహాపాపం. ఆయనే ప్రార్థనలు వింటాడు, వరాలు ప్రసాదిస్తాడు. ఆయన్ని ప్రార్థించకపోవటం అనవసరమైన గర్వం.

అల్లాహ్‌ను విశ్వసించిన వ్యక్తి సంకుచిత మనస్కుడు కాజాలడు. అతను విశ్వసించే దైవం భూమ్యాకాశాలకు కర్త, తూర్పు పడమరలకు స్వామి, మొత్తం విశ్వానికి పాలకుడు, పోషకుడు. కనుక ఈ లోకంలో అతనికి పరాయి వస్తువు ఏదీ కానరాదు. విశ్వంలో ఉన్నదంతా తన మాదిరిగానే ఒకే ప్రభువుకు చెందిన సొత్తు, ఒకే పాలకుని అధీనంలో

ఉన్న విత్తం. అందువల్ల ఈ వ్యక్తి ప్రేమాభిమానాలు, సేవలు ఎలాంటి పరిమితులకు లోనయి వుండవు. ఇతని దృష్టి దేవుని రాజ్యంలా అవధుల్లేనిది.

ఈ విశ్వాసం మనిషిలో భారీఎత్తున ఆత్మాభిమానాన్ని, ఆత్మ గౌరవాన్నీ జనింపజేస్తుంది. అతను, శక్తులన్నింటికీ అధికారి దేవుడు ఒక్కడే అనీ, లాభనష్టాలు కలిగించేవాడు, మానవుల జీవన్మరణాలపై అధీనం, అధికారం, ప్రభావం కలవాడు ఆయన తప్ప మరెవ్వరూ లేరనీ తెలుసు కుంటాడు. ఈ జ్ఞానం, ఈ విశ్వాసం అతన్ని దైవానికి తప్ప మరే ఇతర శక్తికీ భయపడని వాడుగా, అన్ని శక్తుల పట్ల నిరపేక్షాపరునిగా చేసి వేస్తాయి. సృష్టిలోని శక్తుల ముందు అతను తలవంచడు, చెయ్యి చాచి ఎవ్వరినీ అర్థించడు.

ఈ విశ్వాసం, ఆత్మాభిమానంతోపాటు మనిషిలో సౌమ్యం, వినయ వినమ్రతలను జనింపజేస్తుంది. అతను ఎన్నటికీ గర్విష్టి, అహంకారి కాజా లడు. తన శక్తిసామర్థ్యాల వల్ల, సిరిసంపదల వల్ల అతని ఆంతర్యంలో దురహంకారం చోటు చేసుకోజాలదు. ఎందుకంటే, అతనికి తెలుసు, తన వద్ద ఉన్నదంతా దైవప్రసాదమే అని, దేవునికి అనుగ్రహించే శక్తితోపాటు, తిరిగి తీసుకునే శక్తి కూడా ఉందని కూడా అతనికి తెలుసు. తన వద్ద ఉన్నది ఏదీ తనది కాదు, చివరికి బొందిలో ఉన్న ప్రాణం కూడా.

ఈ విశ్వాసం ఉన్న వ్యక్తికి తన ఆత్మప్రక్షాళనం జరిగి, తాను సత్కా ర్యాలు చెయ్యటం తప్ప తన మోక్షం సాఫల్యాలకు మరో మార్గం లేదని బాగా తెలుసు. ఎందుకంటే తాను విశ్వసించే దైవానికి ఎవరితోనూ ఎలాంటి అవసరమూ లేదు, మరెవరితోనూ ఎలాంటి ప్రత్యేకానుబంధమూ లేదు. ఆయన నిరపేక్షాపరుడు, నిష్పాక్షికంగా న్యాయం చేసే స్వామి.

ఆయన దైవత్వంలో ఎవరికీ ఎలాంటి జోక్యం కలుగజేసుకునే అధికారం లేదు.

ఈ విశ్వాసం ఉన్న వ్యక్తి ఎట్టి పరిస్థితులలోనూ నిరాశావాదిగా, భగ్న హృదయుడుగా రూపొందడు. భూమ్యాకాశాల నిధులన్నింటికీ స్వామి అయిన అల్లాహ్‌ను అతను విశ్వసిస్తున్నాడు. ఆయన కరుణానుగ్రహాలు అపారమైనవి, అపరిమితమైనవి. ఆయన శక్తిసామర్థ్యాలు అనంతమైనవి. తన ప్రభువు పట్ల ఈ భావన, ఈ విశ్వాసం అతని ఆంతర్యానికి అసాధారణ తృప్తినిస్తుంది. అతని అంతరాళం ప్రశాంతతకు మారుపేరై ఆశావాదం అతని విధానమవుతుంది. అతను ప్రపంచంలో ప్రతి చోటా తృణీకరించ బడినా, ఆధారాల ద్వారాలన్నీ మూయబడినా, వనరులు, సాధనాలు అన్నీ ఒక్కొక్కటే దోచుకోబడినా, ఏకైక దేవుని అండ, నీడలు మాత్రం అతన్ని విడనాడవు. ఈ ఆధారాన్ని పట్టుకునే అతను సరికొత్త సంకల్పాలతో, ఆశలతో, నిరంతరం ప్రయత్నాలు కొనసాగిస్తూ పురోగమిస్తాడు. (గీటురాయి 18-2-2000)

(ఆలిండియా రేడియో విజయవాడ సౌజన్యంతో)

ఆత్మ పరిశుద్ధత

ఈనాడు మానవుడు సైన్సు, సాంకేతిక రంగాలలో అద్భుతమైన ప్రగతిని సాధించాడు. సుఖవంతమైన జీవితం కోసం అవసరమైన అత్యాధునిక సాధన సంపత్తిని కూడా సమకూర్చుకున్నాడు. అయినప్పటికీ అతను శాంతికీ, సంతృప్తికీ నోచుకోలేకపోతున్నాడు. దీనికి కారణం అతను తన సృష్టికర్త, విశ్వప్రభువు అయిన దేవుణ్ణి, ఆయన హితోపదేశాలను వదిలేసి, ప్రాపంచిక వ్యామోహంతో భౌతిక విషయాల వెంటపడటమే. ఈ భౌతికారాధన, దానినుండి పుట్టుకొచ్చే స్వార్థప్రియత్వం మనిషిలోని మానవత్వాన్ని మంటగలపుతున్నాయి. తత్ఫలితంగా ప్రజల మధ్య పరస్పర విశ్వాస సానుభూతులు, మైత్రీ మమకారాలు క్షీణించిపోయాయి. సమాజంలోని అన్ని రంగాలలో ఎక్కడ చూసినా అశాంతి అలజడులే తాండవ నృత్యం చేస్తున్నాయి.

మనిషి మట్టిలో నుండి పుట్టాడు. మట్టిలో నుండి పుట్టే ఆహారాన్నే తింటున్నాడు. అతను కట్టుకునే బట్టలు కూడా మట్టిలోనుంచి ఉద్భవించినవే. ఆహారం తినకపోతే మనిషి శారీరకంగా, భౌతికంగా చచ్చిపోతాడు. అదే విధంగా మనిషికి ఆత్మ కూడా ఉంది. దానికి ఆకలి కూడా ఉంది. కనుక ఆత్మకు ఆధ్యాత్మిక ఆహారం కావాలి. లేకపోతే అది చచ్చి

పోతుంది. మనిషి ఆత్మను గురించి, మనసును గురించి పట్టించుకోవడం లేదు; భౌతిక విషయాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాడు; రేయింబ వళ్ళు వాటి కోసమే శ్రమిస్తున్నాడు.

మనిషి తన మనసు చెప్పినట్లు వింటున్నాడు; అది కోరే గొంతెమ్మ కోరికలకు ఊడిగం చేస్తున్నాడు. మనిషి దేవుడు చెప్పినట్లు వినటం లేదు; అసలు దేవుణ్ణి మరిచిపోయాడు. మనోవాంఛలకు దాసుడైన మనిషి కరుడుగట్టిన స్వార్థపరుడయ్యాడు. తన స్వార్థం కోసం ఎంతటి అఘా యిత్యానికైనా పాల్పడుతున్నాడు. పూర్వకాలంలో ప్రజలు అడవి మృగాలను చూసి భయపడేవారు. ఈనాడు మనిషి తనవంటి మనుషుల్ని చూసి భయపడుతున్నాడు. జంతువుకు కోపమొస్తే నోటితో కరుస్తుంది, కాళ్ళతో తంతుంది. అంతేకాని మనిషికి కోపం వస్తే నోటితో తిడతాడు, కరుస్తాడు, కాళ్ళతో తంతాడు, కర్రతో కొడతాడు, కత్తితో పొడుస్తాడు. తుపాకీ పేలుస్తాడు, బాంబులు వేస్తాడు. అసలు మనిషి మనసు మారాలి. దానిని పరిశుద్ధపరచాలి. అది కళ్ళెం లేని గుర్రం, తోకలేని గాలిపటం, తాడులేని బొంగరం. దానిని అదుపు చేయాలి. అధీనంలో ఉంచుకోవాలి. అప్పుడే మనిషి రాగద్వేషాలకు అతీతంగా మెలగగలుగుతాడు.

పక్షుల్ని చూడండి! అవి దైవ నిబంధనలకు అనుగుణంగా గాలిలో ఎలా ప్రశాంతంగా ఎగురుతున్నాయో! చేపలను గమనించండి. అవి దైవ నియమానుసారం నీటిలో ఎలా హాయిగా సంచరిస్తున్నాయో!! దైవ శాసనా లకు విరుద్ధంగా పక్షులు నీటిలోను, చేపలు నీటి వెలుపలా నివసించ టానికి ఏమాత్రం ప్రయత్నించినా అవి శాంతికి దూరమవు తాయి; వాటి ఉనికికి ప్రమాదం ఏర్పడుతుంది. ఈ అల్ప ప్రాణులేకాక, ఆకాశంలోని

అసంఖ్యాకమైన గ్రహాలు, నక్షత్రాలు కూడా దైవ నియ మావళిని శిరసా వహిస్తూ తమ తమ నిర్ణీత కక్ష్యలలో తిరుగుతున్నాయి. ఈ విధంగా యావత్తు విశ్వ వ్యవస్థ, అందులోని సకల చరాచర సృష్టి రాసులు దేవుడు నిర్దేశించిన నియమావళికి కట్టుబడి పనిచేస్తూ ప్రశాంతంగా తమ మనుగడను సాగిస్తున్నాయి. ఈ పటిష్టమైన నియమావళి పేరే ఇస్లామ్.

ఇస్లామ్ అంటే శాంతి, ఇస్లామ్ అంటే సమర్పణ, ఇస్లామ్ అంటే విధేయత అని అర్థం. మనిషి తన సృష్టికర్త, స్వామి అయిన దేవునికి తనను తాను పూర్తిగా సమర్పించుకుని, ఆయనకు విధేయుడై, జీవితంలోని సమస్త రంగాలలోనూ ఆయన ఆదేశాలను పాటించినట్లయితే అతనికి పూర్తి మనశ్శాంతి లభిస్తుంది.

ప్రతి మనిషీ శాంతిని కోరుకుంటున్నాడు; దాని కోసం పరితపిస్తు న్నాడు. దివి నుండి భువిపైకి దేవుడు దిగి వచ్చి, "నరుడా నీకేమి కావాలో అడుగు" అని అడిగితే, మనిషి ఐశ్వర్యాన్నీ, అధికారాన్నీ కోరడు. 'శాంతి శాంతి' కావాలి అంటాడు. ఈ సమస్య రాజూ పేదల సమస్య పండితులూ పామరుల సమస్య అయిపోయింది. శాంతి ఎక్కడా లేదు– మసీదుల్లో లేదు, మందిరాల్లో లేదు, చర్చీలలో లేదు. వ్యక్తిలో లేదు, కుటుంబంలో లేదు, మొత్తం సమాజంలోనే లేదు. అన్నిచోట్లా సంక్షోభం, అశాంతి, అలజడి, అసంతృప్తి రాజ్యం చేస్తున్నాయి. వృద్ధులైన తల్లిదండ్రులకు తమ సొంత గృహాలలోనే గౌరవం లేకుండాపోయింది. అనాదరణకు గురవు తున్నారు; పాపం వారు తమ సంతానానికే భయపడుతున్నారు. కనుకనే ఓల్డ్ ఏజ్ హోమ్‌ల సంఖ్య పెరిగిపోతోంది. కొడుకులే తమ ముసలి తల్లిదండ్రుల్ని వాటిలో చేరుస్తున్నారు, నెలకింత అని వాటిని నడిపేవారికి

ముట్టచెబుతున్నారు. మానవత్వపు పతనానికి, కుటుంబ జీవిత సౌభాగ్య నాశనానికి ఇది పరాకాష్ఠ. విడాకులెక్కువయ్యాయి. భర్తకు భార్య మీద, భార్యకు భర్త మీద నమ్మకం లేకుండాపోయింది. ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. పిల్లలు, యువతీ యువకులు నేరస్తులవుతున్నారు. మనిషి శాంతి కోసం Humour Clubs లో, Entertainment Clubs లో సభ్యత్వం తీసుకుంటున్నాడు. మద్యపానానికి దాసుడవుతున్నాడు. టీ.వీలో సీరియల్స్ చూస్తున్నాడు. శాంతి కోసం ఏది తోస్తే అది చేస్తున్నాడు. అయినా శాంతి అందటం లేదు.

వ్యక్తికి శాంతి లేకుండా చేసే నియమాలు ప్రపంచంలో ఎన్నో ఉన్నాయి. వాటిలో అతి ముఖ్యమైనవి– అహంభావం, అధికార వ్యామోహం, ఐశ్వర్య మదం, అసూయా ద్వేషాలు, దురాశ, నిరాశా నిస్పృహలు. మనిషి వీటిపై అదుపును సాధించాలి. దానికోసం అతను మనోవాంఛల్ని గుడ్డిగా అనుసరించటం మానివెయ్యాలి. తనను పుట్టించిన దేవుడి ఇష్టాఇష్టాలను దృష్టిలో పెట్టుకోవాలి. ఆయన ఆజ్ఞలకు, ఉపదేశా లకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఆయనకు విధేయత చూపాలి. ఇస్లామ్ ధర్మం మనిషిని ప్రతిరోజు ఐదుసార్లు దేవుణ్ణి ప్రార్థించమని ఆజ్ఞాపిస్తుంది; ఆయన పవిత్ర నామాన్ని ఎల్లప్పుడూ జపించమని బోధిస్తుంది. ఎక్కడున్నా, ఏమి చేస్తున్నా దేవుణ్ణి జ్ఞాపకం ఉంచుకోమని చెబుతుంది. దీనివల్ల దేవుడు ఉన్నాడనే విషయం, చూస్తున్నాడనే విషయం, దేవుణ్ని తప్పించుకోవటం కష్టతరమనే విషయం నిత్యనూతనంగా ఉంటుంది. అప్పుడు మనిషి అల్లాహ్‌కు భయపడతాడు; పాపకార్యాలకు ఒడిగట్టడు. దివ్యఖుర్ఆన్ గ్రంథంలో, 'నిస్సందేహంగా నమాజు (అంటే దైవప్రార్థన) మనిషిని సిగ్గు

మాలిన పనుల నుండి, చెడు కార్యాల నుండి ఆపుతుంది' అని చెప్ప బడింది. ఈ విధంగా మనిషి తన కామ, క్రోధ, మోహ, మద మాత్సర్యా లపై అదుపు సాధించగలుగుతాడు.

ఇంకా ఇస్లామ్ ధర్మం మనిషిని సంవత్సరంలో ఒక నెలరోజుల పాటు ఉపవాసం ఉండమని ఆదేశిస్తుంది. ఉపవాసాన్ని అరబీ భాషలో 'సౌమ్' అంటారు. 'సౌమ్' అంటే ఆగిపోవటం, దూరంగా ఉండటం, త్యజించటం అని అర్థం. అంటే తినటం, త్రాగటం, భార్య వద్దకు పోవటం అనే బలమైన కోరికలకు ఒక నిర్ణీత కాలం వరకు దూరంగా ఉండటం, వాటిని త్యజించటం అన్నమాట. ఉదయం 4 గంటలకు భోజనం చేస్తే మళ్ళీ సాయంత్రం సూర్యాస్తమయం వరకు పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టుకోకూడదు. ఎడతెగకుండా ఈ ఉపవాస వ్రతాన్ని నెలరోజులపాటు పాటించాలి. దివ్యఖుర్ఆన్ ఉపవాస వ్రతాన్ని సహనం, ఓర్మి అని అభివర్ణించింది. మనిషి తన మనసును అదుపులో ఉంచుకుంటాడు, దాని కోరికలకు లొంగడు. నిగ్రహించుకుంటాడు. అతనికి మనో స్థయిర్యం, మనో స్థిమితం కలుగుతాయి. ఉపవాసం ముఖ్యోద్దేశం మనిషిని భయ భక్తులు కలవాడుగా మలచటం, అతని హృదయాన్ని పరిశుద్ధతతో నింపటం, భయభక్తులు అంటే మనిషి మనసు పాపకార్యాల పట్ల తడబాటు ప్రదర్శిస్తూ, మంచి కార్యాల వైపునకు అత్యధికంగా మొగ్గే స్థితి. సంపన్ను లకూ, కడుపు నిండిన వారికీ ఆకలిదప్పుల బాధ అంటే ఏమిటో తెలిపేది ఉపవాస వ్రతమే. ఉపవాసం ఉన్నప్పుడే వారు తమ నిరుపేద సోదరుల ఆకలి బాధను గ్రహించగలుగుతారు, వారికి అన్నం పెట్టి వారి ఆకలి బాధను నివారించటం ఎంత పుణ్యకార్యమో వారు అర్థం చేసుకుంటారు.

ఇంకా ఉపవాసం మనిషిలో ప్రేమ, త్యాగం, దయ, సానుభూతి వంటి అమృత భావాలను కలుగజేస్తుంది. తద్వారా అతనికి మానసిక, ఆధ్యాత్మిక శాంతి లభిస్తుంది.

ఉపవాసం మన ఉద్రేకాలను, ఆవేశాలను కొంతకాలం వరకు చల్లబరుస్తుంది. మన భావాలలో, ఆలోచనలలో, నిర్ణయాలలో సమ తూకం, ప్రశాంతత కనిపిస్తాయి. మనం సకాలంలో లేస్తాము. సకాలంలో పనులు చేస్తాము, బాధ్యతా భావం పెరుగుతుంది. దైవ చింతన, మంచీ చెడుల విచక్షణ, పశ్చాత్తాప భావం, పరలోక చింతన వంటి అమూల్యమైన సుగుణాలు మనకు అలవడుతాయి. ఉపవాసం అంటే కేవలం బాహ్యా సంబంధమైన ఆకలిదప్పులు మాత్రమే కాదు. వాస్తవానికి అది హృదయం, ఆత్మల ఆకలిదప్పుల పేరు.

ఇంకా ఇస్లామ్ ధర్మం 'జకాతు' దానాన్ని కూడా విధించింది. జకాత్ అంటే పరిశుభ్రం చేయటం, వృద్ధి చేయటం, దానం, దైవమార్గంలో ఖర్చు అని అర్థం. జకాతు సంపన్నులకు విధిగా నిర్ణయించిన దైవాదేశం. జకాతు సంపదను శుభ్రం చేసి, సమృద్ధి పరుస్తుంది. జకాత్ చెల్లించటం వలన మనిషిలోని స్వార్థ చింతన, పిసినారితనం వంటి దుర్గుణాలు దూరమవు తాయి. సంవత్సరంలో ఒకసారి తన వద్ద ఉన్న నగదు డబ్బుపై, వెండి, బంగారు ఆభరణాలు, వ్యాపారంలో ఉన్న సరుకు విలువపై నూటికి రెండున్నర శాతం చొప్పున లెక్క కట్టి పేదలకు పంచిపెట్టాలి. అలా చెయ్యక పోవటం పెద్ద పాపం అవుతుంది. మహాప్రవక్త ముహమ్మద్(స) తమ పవిత్రమైన ఒక సూక్తిలో ఇలా సెలవిచ్చారు: 'అల్లాహ్ ఎవరికయితే ధనాన్ని ప్రసాదించాడో, వారు తమ ధనంలోనుంచి జకాత్ చెల్లించకపోతే, ఆ

ధనం తీర్పుదినం నాడు విష సర్పం రూపాన్ని ధరిస్తుంది. దాని పడగ మీద రెండు నల్లటి చుక్కలుంటాయి. ఆ సర్పం వారి కంఠాలకు భారమైన హారంలా చుట్టుకుంటుంది. 'నేను నీ ధనాన్ని, నీవు కూడబెట్టిన నిధిని' అంటూ ఆ సర్పం వారి దవడల్ని గట్టిగా కరుచుకుంటుంది.

ఆత్మ ప్రక్షాళనం కోసం ఇస్లామ్ ధర్మం హజ్‌ను అంటే మక్కా యాత్రను ఒక ముస్లిమ్‌పై విధిస్తుంది. ఈ విధిని జీవితం మొత్తంలో ఒక్కసారి నిర్వర్తించటం, అదీ పవిత్ర మక్కా నగరం వెళ్ళే స్తోమత గల వాళ్ళు మాత్రమే నిర్వర్తించటం విధి. హజ్ యాత్ర దైవారాధనలన్నింటిలో గొప్పదైన ఆరాధన. దైవభక్తి, దేవుని పట్ల ప్రేమ మనిషి ఆంతర్యంలో ఉన్నప్పుడే అతను తన నిత్య కార్యకలాపాలన్నీ వదిలివేసి, భార్యాపిల్లలకు, బంధుమిత్రులకు దూరంగా పెద్ద ప్రయాణానికి సిద్ధమవుతాడు, ప్రయాణాలను భరిస్తాడు. ఈ ప్రయాణం మామూలు ప్రయాణాల్లాంటిది కాదు. ప్రయాణం చేసే వ్యక్తి దీక్ష అంతా దేవునిపైనే కేంద్రీకృతమై ఉంటుంది. హృదయంలో దైవ గృహమైన కాబాను సందర్శించబోతున్నందుకు ఉత్సాహం, ఉల్లాసం, ఉద్వేగం ఉప్పొంగుతూ ఉంటాయి. కాబా గృహం సమీపించిన కొద్దీ భక్తి భావతరంగాలు ఉవ్వెత్తున లేస్తుంటాయి. అపరాధాలు, అపచారాలు, అవిధేయతల పట్ల గుండెల్లో జుగుప్స, అసహ్యం జనిస్తాయి. గతంలో చేసిన తప్పుల పట్ల లజ్జ కలుగుతుంది. మనసు ఎంతో కృంగిపోతుంది. భావి జీవితంలో దైవ విధేయుడై జీవించే సద్బుద్ధిని ప్రసాదించమని దేవుణ్ణి వేడుకుంటాడు. ఇక్కడి ఆరాధనలో, పవిత్ర దైవ నామ సంస్మరణలో అపూర్వమైన తియ్యదనాన్ని ఆస్వాదిస్తాడు. దైవ సాన్నిధ్యంలో సాష్టాంగ ప్రణామం చేసినప్పుడు మళ్ళీ తలెత్తాలన్నా మనసు

ఒప్పుకోదు. ఈ దైవ గృహంలో దివ్యఖుర్‌ఆన్ పారాయణం చేస్తే అనిర్వచనీయమైన ఆనందానుభూతి కలుగుతుంది. ఆ ఆధ్యాత్మిక వాతావరణంలో ఉపవాస వ్రతాన్ని పాటిస్తే అనుభవంలోకి వచ్చే మాధుర్యమే వేరు.

కనుక ప్రాపంచిక జీవితంలో ప్రతినిత్యం, ప్రతి విషయంలో దైవభీతితో, దైవ ప్రసన్నత పొందే సంకల్పంతో వ్యవహరించటం, దైవాజ్ఞల్ని పాలించటం, దేవుని అవిధేయత ద్వారా సంప్రాప్తించే లాభాలను త్రోసిపుచ్చటం, ఆయన విధేయత కారణంగా సంభవించే లేదా సంభవించగల నష్టాలను సంతోషంగా స్వీకరించటం– ఈ వైఖరినే దైవోపాసన, దైవారాధన అంటారు. ఇలాంటి జీవితంలోని ప్రతి విషయం చివరికి భోజన పానీయాలు, మనిషి యొక్క తిరగటం, నిద్రపోవటం, జాగరణ చెయ్యటం, మాట్లాడటం, వ్యాపారం, ఉద్యోగం, ప్రభుత్వం అన్నీ ఆరాధనలే.

దివ్యఖుర్‌ఆన్ గ్రంథంలో ఆత్మ పరిశుద్ధతను గురించి ఎన్నో విషయాలు చెప్పటం జరిగింది. ఉదాహరణకు 91వ అధ్యాయంలోని 9, 10 వాక్యాలలో– 'ఖద్ అఫ్‌లహ మన్ జక్కాహ వ ఖద్ ఖాబ మన్ దస్సాహ' నిశ్చయంగా తన ఆత్మను పరిశుద్ధపరచుకున్న వ్యక్తి సఫలుడయ్యాడు. దానిని అణగద్రొక్కినవాడు విఫలుడయ్యాడు అని చెప్పబడింది. ఇక్కడ తజ్కియా అనే పదం అరబ్బీ మూలంలో వాడబడింది. 'తజ్కియా' అంటే పరిశుద్ధపరచటం, పెంచటం, ప్రక్షాళన చెయ్యటం అని అర్థం. ఇక్కడ దీని భావం ఏమిటంటే, తన ఆత్మను పాప కార్యాల నుండి పరిశుద్ధపరచుకుని దానిని లేవనెత్తి దైవభక్తి ఔన్నత్యాలకు తీసుకుపోయి, అందులో మంచిని పెంపొందించుకునే వ్యక్తి సాఫల్యం పొందుతాడు. 'జక్కాహ' అనే పదానికి

వ్యతిరేకంగా 'దస్సాహ' అనే పదం మూలంలో వాడబడింది. అంటే అణిచి వేయటం, దాచి వెయ్యటం, దారి తప్పించటం అని అర్థం. భావం ఏమి టంటే, తన ఆత్మలోని సదాచార ప్రవృత్తుల్ని ప్రేరేపించి పెంచటానికి బదులుగా వాటిని అణిచివేసినవాడు, ఆత్మను దారి తప్పించి చెడు మార్గాల వైపునకు తీసుకుపోయినవాడు అసఫలడవుతాడు.

మరొకచోట ఖురాన్ గ్రంథంలో 87వ అధ్యాయంలో 14 నుంచి 19 వరకు గల వాక్యాలలో ఇలా చెప్పటం జరిగింది- 'పరిశుద్ధతను పాటించి, తన ప్రభువు నామాన్ని స్మరించి, ఆ తరువాత నమాజు చేసినవాడు తప్పకుండా సాఫల్యం పొందుతాడు. కాని మీరు ఐహిక జీవితానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. వాస్తవానికి పరలోక జీవితమే మేలైనది, శాశ్వతమైనదీను. ఈ విషయమే పూర్వం వచ్చిన గ్రంథాలలోనూ చెప్పబడింది. అంటే ఇబ్రాహీమ్, మూసాలపై అవతరించిన గ్రంథాలలో'.

ఇక్కడ పరిశుద్ధత అంటే తిరస్కార వైఖరిని విడనాడి విశ్వాస వైఖరిని అవలంబించటం; దుర్వర్తనను వదిలి సద్వర్తనను అలవర్చు కోవటం; దుష్కర్మలను వదిలి సత్కర్మలు ఆచరించటం అని భావం. సాఫల్యం అంటే ప్రాపంచిక సుఖ సంపదలు కావు; ప్రాపంచిక సఫలత ప్రాప్తం అయినా కాకపోయినా, నిజమైన పారలౌకిక సాఫల్యం పొందటం అని అర్థం. సంస్మరణ అంటే హృదయంలోనూ, నోటితోనూ పవిత్ర దైవ నామాన్ని స్మరించటం, జపించటం అని అర్థం. ఇది కూడా ఆత్మ ప్రక్షాళనం కొరకు దోహదపడుతుంది.

ఆత్మ పరిశుద్ధతకు పనికొచ్చే కొన్ని విషయాలు- రహస్యంగా దానధర్మాలు, ఇతర పుణ్యకార్యాలు చెయ్యటం. దీని కారణంగా మనిషిలో

దైవ సంతోషం కోసం పనిచేసే అలవాటు కలుగుతుంది; సంకల్పశుద్ధి సంప్రాపిస్తుంది. అత్యధికంగా సంపదను సత్కార్యాల కోసం ఖర్చుపెట్టడం. దీనివలన సంపద సమృద్ధి చెందుతుంది, పరిశుద్ధమవుతుంది. సత్యాన్ని, నిజాన్ని దాచకూడదు. సత్యం పలకాలి; నిజం చెప్పాలి. అబద్ధం చెప్ప కూడదు. అదనపు నమాజులు అంటే ఎక్స్ట్రా ప్రార్థనలు చెయ్యటం. మహాప్రవక్త(స) గారి ఒక సూక్తిలో దేవుడు ఇలా సెలవిచ్చాడు: 'అదనపు నమాజుల ద్వారా నా భక్తుడు నాకు సన్నిహితమవుతాడు. క్రమక్రమంగా అతను నాకు ఎంత దగ్గరవుతాడంటే, నేను అతని చేతులైపోతాను, వాటితో అతను పట్టుకుంటాడు. అతని చెవులైపోతాను, వాటి ద్వారా అతను వింటాడు, అతని కళ్ళు అయిపోతాను, వాటితో అతను చూస్తాడు; అతని కాళ్ళు అయిపోతాను. వాటితో అతను నడుస్తాడు. ('గీటురాయి' 3-12-1999)

(ఆలిండియా రేడియో, విజయవాడ వారి సౌజన్యంతో....)

'నమాజ్' అంటే ఏమిటీ?

ఎందరో దైవప్రవక్తలు ఈ భూమిపై ప్రభవించారు. దైవాన్ని, దైవగ్రంథాన్ని, దైవప్రవక్తల్ని ప్రజలు నమ్మటం లేదు. కాబట్టి వారు వచ్చింది కేవలం ప్రజలు అసత్యాలను నమ్మేటట్లు చేయడానికి కాదు. మానవుడు తన నిజమైన ప్రభువును, యజమానిని గుర్తించేటట్లు చేయడం, స్వర్గ నరకాలు, తుది దినం మానవుడు చేసిన మంచీ చెడుల ప్రతిఫలం, దైవదూతలు ఇత్యాది విషయాలను మానవులకు తెలుపడం, ఈ విషయా లను గుర్తించి స్వీకరించిన ప్రజల జీవితాల్ని దైవం చూపిన మార్గాను సారం చక్కదిద్దటం– ఇదీ వారి జీవిత లక్ష్యం. చివరి దైవప్రవక్త తెలిపిన మాటలపై నాకు విశ్వాసం ఉందని ఎవరన్నా అంటే, వారు ఖుర్ఆన్‌ను దైవగ్రంథంగా గుర్తించారని, వారికి అంత్య దినంపై పరిపూర్ణ విశ్వాసం ఉందని అర్థం. ఈ ప్రకటన, ఈ ప్రమాణం చేసిన వ్యక్తి దీని తరువాత తాను ఏ ఏ పనుల్ని చేయాలో, వాటిని చేయటానికి హృదయపూర్వకంగా ఉపక్రమించకపోతే, తన ఈ జ్ఞానం తన జీవితానికి ఏ విధంగానూ ఉపయోగపడదు. ఉదాహరణకు జ్వరంతో బాధపడుతున్న ఒక మనిషికి క్వినైన్ మాత్రలు తింటే తన జ్వరం పోతుందని తెలుసు. ఆ మందులపై అతనికి అచంచల విశ్వాసముంది. కాని అవి చేదుగా ఉండటం వల్ల వాటిని అతడు సేవించడు. కేవలం మందుపై ఉన్న ప్రగాఢ నమ్మకం తన జ్వరం పోవడానికి యే విధంగానూ సహాయకారి కాదు. కాని అవి చేదుగా

ఉన్నప్పటికీ దాన్ని వాడి, దానిపై తనకున్న నమ్మకాన్ని క్రియారూపంలో పెట్టినప్పుడే సత్ఫలితాలు పొందగలడు. ఇంకా, బాగా ఆలోచించినట్లయితే విషయం విపులంగా అర్థమవుతుంది. ఏ విషయం మీదైనా మీకు మనసులో సంపూర్ణ విశ్వాసం ఉంటే, దాని ప్రభావం తప్పకుండా మీ జీవితంపై పడుతుంది. ఉదాహరణకు నిప్పును తీసుకోండి. నిప్పులో చేయి పెడితే కాలుతుందని మనకు తెలుసు. కనుక మనం తెలిసీ నిప్పులో చెయ్యి పెట్టం. దేవుడున్నాడని మీరు హృదయపూర్వకంగా విశ్వసిస్తారు. మానవు లకు మంచి మార్గం చూపటానికి ఆయన ప్రవక్తల్ని పంపాడని కూడా మీకు తెలుసు. ముహమ్మద్(స) నిజమైన దైవప్రవక్త. ఆయన చెప్పిన ప్రతి మాట నమ్మదగ్గది అని నమ్ముతారు. మీ ప్రభువు తాను తన ప్రవక్తల ద్వారా పంపిన ఉపదేశాలకనుగుణంగా జీవితాన్ని గడిపారా లేదా అని ఒక రోజున మిమ్మల్ని ప్రశ్నిస్తాడని కూడా మీకు తెలుసు. మీరు ఈ ప్రపంచం లో చేసిన పనుల ప్రకారం మీ ప్రభువు మీకు ప్రతిఫలం ఇస్తాడని కూడా మీకు జ్ఞానం ఉంది. ఇన్ని విషయాలు తెలుసుండి కూడా దైవాదేశాలకు, దైవోపదేశాలకు వ్యతిరేకంగా మీరు యే విధంగా జీవించగలుగుతారో చెప్పండి. మీ ఈ జ్ఞానం మీ జీవితంలో ప్రస్ఫుటం కాకపోతే దాని అర్థమేమంటే పై విషయాలపై మీకు పరిపూర్ణ విశ్వాసం లేకుండా అయినా ఉండాలి. లేక మీరు ఎంతో అసమర్థులవడం చేత ఒక విషయాన్ని సరయినదని విశ్వసించినా మీరు చేసే ప్రతి పని దానికి వ్యతిరేకంగానే ఉంటుంది. ఇలాంటి వ్యక్తి వాస్తవంగా నమ్మదగ్గ వాడు కాదు. యే విషయంలోనూ ఇతన్ని మనం నమ్మలేము. ఇస్లాంలో ఇలాంటి వారికి స్థానం లేదు.

ఒక మనిషి ఇస్లాంను విశ్వసించిన తరువాత విధిగా చెయ్యవలసిన పని నమాజ్. 'ఇస్లాం ధర్మానికి నమాజ్ స్తంభం లాంటిది. దాన్ని నిలిపిన

వ్యక్తి ఇస్లాం ధర్మాన్ని స్థాపించాడు. నమాజ్‌ను విసర్జించిన వ్యక్తి తన ధర్మాన్ని కూలదోసాడు' అని దైవప్రవక్త ముహమ్మద్(స) అన్నారు. 'నమాజ్ పిలుపు (అజాన్) విని, నమాజ్‌కు రాని వాని ఇంటికి నిప్పు పెట్టాలని నా మనసు కోరుతుంది' అని కూడా దైవప్రవక్త అన్నారు. ముస్లింకు– కాఫిర్‌కు మధ్య ఉన్న భేదాన్ని వివరిస్తూ దైవప్రవక్త, ముస్లిం నమాజ్ చేస్తాడు, కాఫిర్ చేయడు అని చెప్పారు.

ఆ కాలంలో నమాజ్ చేయటానికి మసీదుకు రాని వానిని ముస్లింగా పరిగణించేవారు కారు. దీనివల్ల మనకు తెలిసేదేమంటే, నమాజ్ చేయనివాడు ఇస్లాం దృష్టిలో ముస్లింగా ఎంచబడటానికి అర్హుడు కాడు. ఇస్లాం కేవలం ఒక సిద్ధాంతం మాత్రమే కాదు. విశ్వాసం, విశ్వసించిన దానిని తు.చ తప్పకుండా ఆచరించడం– ఈ రెంటి సమన్వయమే ఇస్లాం. దైవాజ్ఞల్ని శిరసావహించి వాటికనుగుణంగా తన జీవితాన్ని గడపటానికి ఇష్టపడని వ్యక్తి ఇస్లాం దృష్టిలో నిష్ప్రయోజకుడు. అలాంటి వారికి నమాజ్ లాంటి సులభమైన పని పెద్ద భారంగా కన్పిస్తుంది. వారి వల్ల ఇస్లాంకు ఉపయోగం కలుగుతుందని ఆశించటానికి ఏమాత్రం వీలు లేదు.

దైవదాస్యం, దైవాజ్ఞా పాలన చేసి తరించటానికి సిద్ధం కాని వారికే నమాజు బరువుగా కనిపిస్తుంది. దైవధిక్కారులకు, దైవవిధేయులకు మధ్య అనంతమైన వ్యత్యాసం ఉంటుంది. వీరి జీవితాలు ఒకేవిధంగా ఉండవు. ఇదే భేదం నమాజ్ చేసే మనిషికి, చేయని మనిషికి ఉంటుంది.

('గీటురాయి'వారపత్రిక : 29-6-1979)

.... దేవుడున్నాడండీ!

కమ్యూనిజం ప్రాచుర్యానికి, దాని వ్యాప్తికి, అది ఒక సిద్ధాంతంగా అంతర్జాతీయ ఖ్యాతినార్జించటానికి సాహిత్యం అత్యద్భుతంగా దోహదం చేసింది. భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీకున్న సాహిత్యం ఏ పార్టీకీ లేదు అంటే అందులో అతిశయోక్తి లేదు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు భాషలో ఉన్నంత సాహిత్యం ఏ ఇతర ప్రాంతీయ భాషలోనూ లేదేమో. తెలుగు కమ్యూనిస్టు సాహిత్యంలో ప్రత్యేకంగా గేయ సాహిత్యంలో శ్రీశ్రీ గారికి మకుటాయమానమైన స్థానం ఉంది. ఆయన తన ప్రత్యేకమైన శైలి ద్వారా అసంఖ్యాకమైన విద్యావంతుల్ని అద్వితీయంగా ప్రభావితం చేశారు. వీరు మహా కవిగా కూడా వినుతికెక్కారు. ఈ మహా కవి గారు గత వారం విశాఖపట్నంలో ఒక నాస్తిక వేదికపైకెక్కి గాండ్రించారు, గర్జించారు. వారు గాండ్రించింది, గర్జించింది కన్పించే దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా కాదు, కన్పించని దైవానికి వ్యతిరేకంగా వారు తమ ప్రసంగంలో ఏమని వాక్రుచ్చారంటే, 'దేవుడు లేడు. ఇందుకు గుళ్ళు, చర్చీలు, మసీదుల వద్ద కనిపించే కుంటివాళ్ళు, గుడ్డివాళ్ళు, కుష్టు రోగులే ప్రత్యక్ష సాక్ష్యం. దారిద్ర్యం, దైవత్వం నానాటికి రెండు వైపులా ఉన్న బొమ్మా బొరుసు లాంటివి' మహా కవిగారి ఈ వాదన ఈ తరానికి చాలా విచిత్రంగా

ఉంది. ఎందుకంటే దేవుడు లేడనటానికి గుళ్ళు, మసీదుల దగ్గర కన్పించే కుంటివాళ్ళు, కుష్టు వాళ్ళు ప్రత్యక్ష సాక్ష్యమెలా అవుతారో అర్థం కాదు. ఆ దేవుడే ఉన్నట్లయితే కుంటివాళ్ళు గుడ్డివాళ్ళు ఉండరని భావమా? లేక పుణ్యం చెయ్యటం రాని, దానధర్మాలు చెయ్యటం నేర్చుకోని నాస్తికులు వాళ్ళను చీత్కరించటం వల్ల వారు దైవభక్తి పరాయణులైన మానవులు వెళ్ళే మందిరాలకు పోతున్నారని అర్థమా? రోగుల్ని, అంగ వైకల్యం కలిగిన వారిని ఎవరూ ఆదుకోకపోతే వారి గతి ఏంకాను? కొందరన్నట్లు మరి కొందరు ఆచరించినట్లు వాళ్ళను కాల్చి పారేయాలా? శ్రీశ్రీ అనే వ్యక్తే గనక లేకపోతే మహా ప్రస్థానం అనే గ్రంథం ఉనికిలోకి వచ్చి ఉండేదా? అదే విధంగా దైవమనేవాడే గనక లేకపోతే ఈ సృష్టి ఎలా ఉనికిలోకి రాగలిగేది? మహత్తరమైన, మహాద్భుతమైన మనోజ్ఞమైన ఈ విశ్వం ఎవడూ లేకుండా ఉనికిలోకి రావటం, రేయనక పగలనక అప్రతిహతంగా అది ముందుకు సాగిపోవటం సాధ్యమా?

అనంతమైన ఈ వినీలాకాశం, సువిశాలమైన భూ మండలం మహా పర్వతాలు, సప్త సముద్రాలు ప్రవహించే నదులు సూర్యచంద్రులు, రేయింబవళ్ళు, పంట పొలాలు, గాలి, నీరు, వెలుగు, మానవులు, జంతువులు– ఇంత పెద్ద సృష్టి ఎవరూ లేకుండా ఏ ఉద్దేశ్యమూ లేకుండా ఉనికిలోకి రావటం అంటే నమ్మశక్యం కాని విషయం. సృష్టిలో ఒక క్రమం, ఒక పద్ధతి, ఒక లక్ష్యం, ఒక అర్థం కొట్టవచ్చినట్లు కన్పిస్తాయి. దీన్ని గురించి మహా కవిగారు ఆలోచించాలి.

తన సంతానాన్ని నవమాసాలు మోసే తల్లి, ధారాపాతంగా కురిసే వర్షం, పాలు త్రాగే లేగ దూడ, కుటుంబ సంరక్షణార్థం కష్టపడి పనిచేసే

తండ్రి, ముసలి తనంలో తల్లిదండ్రుల్ని విధేయుడై సేవించే కుమారుడు భార్యాభర్తల అన్యోన్యతా, అన్నాతమ్ముళ్ళ అవ్యాజానురాగం, ఇతరుల సొమ్మును ఆశించకుండా అన్యాక్రాంతంగా కబళించకుండా బాధ్యతా యుతంగా జీవించే పౌరుడు, అనాధల్ని, వితంతువుల్ని, వికలాంగుల్ని ఆప్యాయతతో చూసే సాంఘిక సేవకుడు, న్యాయమూర్తి, ప్రజా రంజకంగా పాలించే పాలకుడు– ఈ విషయాలను ఆలోచించినా శ్రీశ్రీ గారికి దైవం ఉన్నాడనే ఉండాలనే విషయం జ్ఞాపకం వస్తుందేమో!

దారిద్ర్యం, దైవత్వం ఒకే నాణానికి రెండు వైపులా ఉండే బొమ్మా బొరుసుట. కవి గారి పిడివాదానికి కుతర్కానికి ఇది పరాకాష్ట. దైవాన్ని నమ్మితే ఆయన్ని ఆరాధిస్తే మనిషి దరిద్రుడవుతాడన్న మాట. నిజమైన దైవదాస్యం చేసేవాళ్ళు, దుర్మార్గానికి దూరంగా ఉండేవాళ్ళు అధిక సంఖ్యలో ఉన్న దేశాల్లో సంపదకు కోదువే లేదు. అటువంటి దేశాలు బడుగు దేశాలకు భారీ ఎత్తున సహాయం కూడా చేస్తున్నయ్.

చైనాలోని ఎక్కువ మంది ప్రజలు ధార్మిక స్వభావం కలవారనే విషయం బహుశా కవి గారికి తెలియదేమో. మొన్నీ మధ్యన పత్రికల్లో వచ్చిన వార్తలు ఈ విషయాన్ని ధ్రువపరుస్తున్నాయి. కేవలం తిండికే, సంపాదనకే ప్రాధాన్యం ఇచ్చే ప్రజలు స్వార్థపరులవుతారు. దైవమున్నాడని నమ్మేవాళ్ళు కష్టపడి చెమట ధారపోసి సంపాదిస్తారు. నేను నాస్తికుణ్ణి అని సగర్వంగా చెప్పుకునే శ్రీశ్రీ గారు పౌరాణిక సినిమాలకు డైలాగులు, పాటలు వ్రాసి డబ్బును ఎందుకు గడిస్తున్నట్లు? వారి దృష్టిలో సంపాదనే ముఖ్యమా? సంపాదనకు అవలంబించే మార్గం అంత ముఖ్యం కాదా? పాపం కవిగారు భావుకులు, ఊహాలోకాల్లో విహరిస్తూ ఉంటారు. అదీగాక

వారు పైకొచ్చింది గేయాలు వ్రాసేగా. కమ్యూనిజం అనేది ఆర్థిక సమస్య పరిష్కారం చెయ్యటానికి ప్రయత్నం చేసే ఒక సిద్ధాంతం అనే విషయం, అది ఒక సమగ్రమైన జీవన వ్యవస్థ కాదనే విషయం శ్రీశ్రీ గారిక్కూడా తెలుసు.

తరువాత శ్రీశ్రీ గారు గాంధీజీపై పడ్డారు. 'ఆయన దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారనే వాదన వట్టి బూటకమని, దేశంలో పాతుకుని ఉన్న భక్తికి, మూఢ నమ్మకాలకు, దారిద్ర్యానికి ఆయన చిహ్నం' అని కవి గారు పలగ్గానే సభికులు హర్షద్వానాలు చేశారట. విమర్శ సమంజసంగా, సహేతుకంగా ఉంటే మనిషి హృదయానికి హత్తుకుపోతుంది. శ్రీశ్రీ గారి వంటి విద్యావంతుల్లో కూడా ఈ విషయం లేకపోవటం విచారకరం. స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ వహించిన పాత్ర ఎటువంటిదో చరిత్రే సాక్ష్యం, అది పండితులకు పామరులకు సమానంగా తెలిసిన విషయం. దేశంలో ఉన్న దారిద్ర్యానికి గాంధీజీ చిహ్నం అనటం అన్యాయం. స్వాతంత్ర్యానికి ముందు దేశం బ్రిటీషు వాళ్ళ చేతుల్లో ఉంది. స్వాతంత్ర్యం తరువాత గాంధీజీ పాపం ఎంతో కాలం బ్రతుకలేదు కనుక దేశ దారిద్ర్యానికి వారిని దుయ్యబట్టం భావ్యం కాదు. దేశాన్ని అవిచ్ఛిన్నంగా 30 సంవత్సరాలు పాలించిన కాంగ్రెస్ పార్టీ వాళ్ళు దీనికి బాధ్యులు. బహుశా శ్రీశ్రీ గారు దేశ చరిత్రను తిరగ వ్రాస్తారేమో!

చివరలో మహా కవిగారు 'ప్రస్తుత పాలకులలో మార్పు వస్తుందనే నమ్మకం నాకు లేదు' అని నిరాశా నిస్పృహలకు లోనయ్యారు. నిరాశవాది ఏ పనీ చెయ్యలేడనే విషయం అందరికీ తెలుసు. శ్రీశ్రీ గారు తమ సిద్ధాంతం ప్రకారం దేశాన్ని, సమాజాన్ని మార్చటానికి ప్రయత్నంచెయ్యాలి.

అత్యవసర పరిస్థితి (Emergency) కాలంలో మాజీ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీని కీర్తించటం తర్వాత ఆమెను దుయ్యబట్టడం ఒక్క మహా కవిగారికే తెలుసు.

శ్రీశ్రీ గారికి ఇస్లాం గురించి తెలియదు. దాన్ని అధ్యయనం చేసి అర్థం చేసుకోవడానికి వారు ప్రయత్నం చెయ్యలేదు. ఇస్లాం కేవలం ఒక మతం మాత్రమే కాదు, అది ఒక సమగ్రమైన ఆచరణ, యోగ్యమైన జీవిత విధానం కూడా. అది ఒక్క ముస్లిం సమాజానికే పరిమితం కాదు. దాని ప్రకారం కుల, వర్గ, వర్ణ వంశభేదాలు లేవు. అందులో నైతిక, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ న్యాయ సంబంధమైన విషయాలతో పాటు మానవ జీవితానికి సంబంధించిన సమస్త విషయాలు ఉన్నాయి. కనుకనే అది ఒక సమగ్రమైన బ్యాలన్స్‌డ్ జీవన వ్యవస్థ. ఒకే దైవం, ఒకే సందేశం, ఒకే మానవుడు, ఇదే ఇస్లాం. మహా కవి లాంటి వాళ్ళు చాలా మంది వున్నారు. విజ్ఞులైన వారు ప్రస్తుత మానవ సమస్యల్ని పరిష్కరించ టానికి ఇస్లాం తన వద్ద ఎటువంటి కార్యక్రమాన్ని కలిగివున్నదో అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చెయ్యాలి. బహుశా ఇస్లాం వారిని శ్రేష్టమైన, అత్యుత్తమమైన జీవిత విధానంగా ఆకట్టుకోవచ్చు.

('గీటురాయి' వారపత్రిక 11-5-1979)

రోజా-పవిత్ర జీవనానికి గీటురాయి

'రోజా' అంటే ఉపవాస వ్రతం. ఇస్లామీ ఆరాధన యొక్క మూడో స్తంభం. దాన్నే అరబీ భాషలో 'సౌమ్' అంటారు. 'సౌమ్' అంటే 'ఆగిపోవటం', 'ఊరుకోవటం' అని శబ్దార్థం. కొంతమంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతల ప్రకారం దీన్ని ఖుర్ఆన్‌లో 'సహనం' లేక 'ఓరిమి' అని అనటం జరిగింది. దాని భావం, మనసును అదుపులో ఉంచడం, స్థిరత్వం, స్థిమితం అని వస్తుంది. ఈ అర్థాల వల్ల ఇస్లాం పరిభాషలో రోజా అంటే ఏమిటో మనకు విశదమవుతుంది. వాస్తవానికి అసలు రోజా అంటే మనసు కోరే గొంతెమ్మ కోరికలు, పాశవిక కోరికల నుండి తమను తాము నిగ్రహించుకోవటం, దురాశ, తుచ్ఛవాంఛల కారణంగా మనిషి జారిపొయ్యే, దారి తప్పే సూచనలున్న సమయాల్లో నిగ్రహాన్ని, స్థయిర్యాన్ని ప్రదర్శించటం, మనోవాంఛల్ని మానవ సహజమైన కోరికల్ని, ఉద్రేకాలను, తినటం, త్రాగటం, స్త్రీ పురుషుల లైంగిక సంబంధాలు రెచ్చగొడతాయి. ఈ మూడింటి నుండి ఒక నిర్ణీత కాలం వరకు దూరంగా ఉండటం లేక ఆగిపోవటం అనేదే షరీయత్ (ధర్మశాస్త్రం) ప్రకారం రోజా అయితే ఈ బాహ్య సంబంధమైన కోరికలతోపాటు అంతరంగంలోని కోరికలు, చెడుల నుండి హృదయాన్ని, నోరును సురక్షితంగా ఉంచటం కూడా విద్వాంసుల దృష్టిలో రోజాలో చేరివుంది.

మహాప్రవక్త (స) బోధించిన ఏ దైవోపదేశమైనా, అది కేవలం ఒక ఆజ్ఞ మాత్రమే కాదు, అందులో ఎంతో విజ్ఞత, ఎంతో వివేకం ఉట్టిపడుతూ ఉంటుంది. దానివల్ల ఎన్నో ప్రయోజనాలు– ఆధ్యాత్మిక, నైతిక, సామాజిక, ఐహికమైనవి– కలుగుతయ్. అదేవిధంగా రోజా వల్ల ఎనలేని ప్రయోజనాలు కలుగుతాయి. రోజా ఉద్దేశ్యాలు, రోజా ప్రయోజనాలు అతి క్లుప్తమైన మూడు ఖురానీ వాక్యాల్లో తెలుపబడ్డాయి.

1. దైవం మీకు ఏ హితోపదేశాన్నైతే ప్రసాదించాడో, దానికిగాను మీరు ఆయన పెద్దరికాన్ని, ఔన్నత్యాన్ని కొనియాడేందుకు, ప్రకటించేందుకు *(అల్ బఖర– 185)*

2) ఈ హితోపదేశం మీకు దొరికిన కారణంగా, మీరు దైవానికి కృతజ్ఞతలు తెలిపేందుకు *(అల్ బఖర– 185)*

3. మీరు భయభక్తులు కలవారుగా అయ్యేందుకు *(అల్ బఖర– 183)*

షరీయత్ (ధర్మశాస్త్రం)ను తెచ్చిన ప్రవక్తలంతా షరీయత్ అవతరణకు పూర్వం ఒక నిర్ణీత కాలం వరకు నిష్ఠాగరిష్ఠ జీవితాన్ని గడిపారు. శక్తిమేరకు 'తినటం, త్రాగటం' వంటి మానవ సహజమైన అవసరాలను విసర్జించారు. వారు ఈ విధంగా తమ ఆత్మను సంస్కరించుకుని, దాన్ని అల్లాహ్ భయభక్తులతో నింపారు. చివరకు వారిపై దైవసందేశం అవతరించింది. హజ్రత్ మూసా (అస్సలాం) ఇటువంటి జీవితాన్నే నలభై రోజులు గడిపారు. తరువాతనే ఆయనపై తౌరాత్ గ్రంథం అవతరించింది. హజ్రత్ ఈసా(అస్సలాం) కూడా ఇటువంటి వ్రతాన్నే నలభై రోజులు పాటించారు; అప్పుడే ఆయన వాక్కు నుండి, ఆయన హృదయం వివేక విజ్ఞతా జ్యోతులు విరజిమ్మనారంభించింది. మహాప్రవక్త ముహమ్మద్(స)

ముప్పై రోజుల వరకు హిరా కొండ గుహలో ఆరాధనలో నిమగ్నులై ఉన్నారు. దాని తరువాతనే ఆయనకు దైవ సందేశానుగ్రహం పొందే భాగ్యం కలిగింది.

సావధానంగా ఆలోచిస్తే మనకు అర్థమయ్యే విషయం ఏమిటంటే, రోజా ఉద్దేశ్యం ప్రవక్తలు ఒక నిర్ణీత కాలం వరకు పాటించిన దివ్య వ్రతాన్ని అనుకరించటమే. యూదులు ప్రవక్త మూసా (అస్సలాం)ను అవలంబిస్తూ నలభై రోజుల ఉపవాసాన్ని సరైనదిగా నలభైయ్యవ రోజు ఉపవాసాన్ని విధ్యుక్తంగా భావిస్తారు. ఇదే మాదిరిగా క్రైస్తవులు కూడా హ్రజత్ ఈసా(అలై)ను అనుసరించి ఉండవలసింది. కాని పోప్ పాల్ అనుకరణలో వారు ప్రవక్తనే మరిచిపోయారు. పాల్‌ను కూడా వారు సక్రమంగా అనుకరించలేదు. ముస్లింలు కూడా ఇదేవిధంగా తమ ప్రవక్తను అనుసరించాలని, ఆయన మాదిరిగానే రోజా ఉండాలని ఆదేశించబడ్డారు.

> **"ముస్లింలారా! ఏవిధంగానైతే మీకు పూర్వం వారు (తమ ప్రవక్తల అనుసరణలో, హితోపదేశం లభించిన దానికి కృతజ్ఞతగా) ఉప వాసం విధిగా ఉండమని ఆజ్ఞాపించబడ్డారో, మీరు కూడా తప్పని సరిగా ఉపవాసం ఉండాలని ఆజ్ఞాపించబడుతోంది."**
>
> ***(బఖర: 183)***

ఈ ఉపవాసం కేవలం ప్రవక్తల అనుకరణే కాదు, మహాప్రవక్త(స) ద్వారా అల్లాహ్ తన దాసులపై వర్షింపచేసిన ఎనలేని అపూర్వ అనుగ్రహా లకు కృతజ్ఞత, సంస్మరణ కూడా. ఖుర్ఆన్ రూపంలో అవతరించిన అల్లాహ్ అనుగ్రహం షైతాన్ వంటి మానవుణ్ణి దైవ దూతగా చేసింది.

కారుచీకటి నుంచి వెలుగుబాటపైకి తీసుకువచ్చింది. నైచ్యపు లోతుల నుండి పైకి లాగి, ఉన్నత శిఖరాలకు తీసుకెళ్ళింది. వారి పశుత్వాన్ని మానవత్వంతో ఆటవికతను నాగరికతతో, అజ్ఞాన తిమిరాన్ని జ్ఞాన దీపికతో, అవివేకాన్ని వివేకంతో పారద్రోలి వారిని సర్వతోముఖంగా తీర్చిదిద్దింది.

రోజా ముఖ్య ఉద్దేశ్యం మనిషిని భయభక్తులు (తఖ్వా) కలవాడుగా తీర్చిదిద్దటం. అతని హృదయాన్ని పవిత్రతతో, పరిశుద్ధతతో నింపటం. ఖుర్‌ఆన్‌లో **'విశ్వాసులారా! ఏ విధంగానైతే మీ ముందు తరాల వారిపై ఉపవాసం విధించబడిందో, అదేవిధంగా మీపై కూడా విధించబడింది. మీరు భయభక్తులు కలవారుగా అయ్యేందుకు' (బఖర : 183)** అని అనబడింది.

తఖ్వా (భయభక్తులు) అంటే మనిషి హృదయం పాపకార్యాల పట్ల తడబాటు ప్రదర్శిస్తూ మంచి కార్యాల వైపు అధికంగా మొగ్గే స్థితి. ఈ స్థితిని మానవుడిలో పుట్టించటమే రోజా ముఖ్యోద్దేశ్యం.

సంపన్నులకు, కడుపు నిండిన వాళ్ళకు ఆకలిదప్పుల బాధ అంటే ఏమిటో తెలిపేది ఉపవాసం మాత్రమే. ఉపవాసం ఉన్నప్పుడే వారు తమ నిరుపేద సోదరుల ఆకలి బాధను గ్రహించగలుగుతారు; వారికి కొంత అన్నం పెట్టి వారి బాధను నివారించటం ఎంత పుణ్యకార్యమో వారు అర్థం చేసుకుంటారు. ఆకలి లేని వాడికి ఆకలి బాధ అంటే ఏమిటో, దప్పిక లేనివాడికి దప్పిక బాధ అంటే ఏమిటో ఎలా తెలుస్తుంది? హాఫిజ్ ఇబ్నె ఖయ్యిం గారు అన్నట్లు, 'గుండె మంట ఏమిటో మనిషికి అర్థం కావాలంటే, మొదట అతడు దాన్ని స్వయంగా అనుభవించాలి'. ఉపవాసం

ఈ భావాన్నే, ఈ స్వానుభవాన్నే జాగృతం చేస్తుంది. అది ఇంకా మనిషిలో త్యాగం, దయ, సానుభూతి వంటి అమృత భావాలను పెంపొందిస్తుంది. రమజాన్ నెలలో మహాప్రవక్త ముహమ్మద్ (స) దాతృత్వం ధారాపాతంగా వర్షించేదని వారి ప్రత్యక్ష అనుచరులు అన్నారు.

ఒకవిధంగా చెప్పాలంటే ఉపవాసం నిర్బంధ సైనిక శిక్షణ. ప్రతి ముస్లింకూ ఈ శిక్షణ సంవత్సరంలో ఒకసారి ఇవ్వబడుతుంది. దీనివల్ల అతడు శారీరక కష్టానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉంటాడు, ప్రపంచ వ్యవహారాల్లో శ్రమకు,కృషికి, కష్టానికి, ఘర్షణకు జంకడు. కనుకనే ఖుర్‌ఆన్ ఉపవాసాన్ని 'సహనం' అని కూడా అభివర్ణించింది.

ఏ విధంగానైతే ఎక్కువ కాలం ఆకలితో ఉండటం మనిషిని బలహీనుడుగా చేస్తుందో, అంతకంటే ఎక్కువగా, అతిగా తినటం అనేది మనిషిని విభిన్న వ్యాధులకు, వివిధ రుగ్మతలకు గురిచేస్తుంది. తరచూ ఉపవాసం ఉండటం మనిషి ఆరోగ్యానికి మంచిదని అనుభవం ద్వారా, ప్రయోగాల ద్వారా నిరూపితమయింది. ఇంకా ఇది విభిన్న వ్యాధులకు చికిత్స కూడా. వారంలో ఒకరోజు భోజనం చెయ్యకుండా నాగా చెయ్యటం మంచిదని వైద్యుల సలహా. ఇస్లాం ప్రకారం ప్రతివారం ఒకసారైనా ఉపవాసం ఉండటం మంచిది, మహాప్రవక్త(స) సంప్రదాయం కూడా. దీనితోపాటు సంవత్సరానికి ఒక మాసం పూర్తిగా ఉపవాసం ఉండడం ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనకరం.

సాధారణంగా మనం తినటానికి, త్రాగటానికి ఎంతో కాలాన్ని వినియోగిస్తూ ఉంటాము. మన జీవితానికి సంబంధించిన ఎంతో విలువైన కాలాన్ని దీనికొరకు వెచ్చిస్తూ ఉంటాము– కనీసం సంవత్సరంలో

ఒక నెల రోజులయినా తినటానికి, త్రాగటానికి వ్యయమయ్యే కాలాన్ని దైవారాధనకు, మానవ సేవకు వినియోగపరిచే భాగ్యం రోజా వల్ల మనకు కలుగుతుంది.

మనిషికి మానసికంగా, ఆధ్యాత్మికంగా శాంతి లభించాలంటే రమజాన్ ఉపవాసం అత్యుత్తమంగా తోడ్పడుతుంది. అన్నం తిన్న కారణంగా కడుపులో రకరకాల వాయువులు జనిస్తాయి. ఉపవాసం ఉండటం వల్ల కడుపు ఖాళీగానే కాదు, పరిశుభ్రంగా కూడా ఉంటుంది. దీని ప్రభావం తప్పనిసరిగా హృదయంపై, మేధపై పడుతుంది.

ఉపవాసం మనిషిని ఎన్నో పాపకార్యాల నుండి కాపాడుతుంది. అందుకని ఇది ఎన్నో పాపాలకు పరిహారం కూడా. ఎవరయినా ఏదైనా ప్రమాణం చేసి దాన్ని భంగపరిస్తే, అప్పుడు దానికి పరిహారం పది మంది నిరుపేదలకు భోజనం పెట్టడం లేదా మూడురోజులు ఉపవాసం ఉండటం.

ఉపవాసం మన ఉద్రేకాలను ఆవేశాలను కొంత కాలం వరకు చల్లబరుస్తుంది. మన భావాల్లో సమతూకం, ప్రశాంతత కన్పిస్తాయి. మనం సకాలంలో లేస్తాము, సకాలంలో పనుల్ని చేస్తాము. బాధ్యతా భావన పెరుగుతుంది. దైవచింతన, మంచీ చెడుల విచక్షణ, పశ్చాత్తాపం, ఆలోచన, పరలోక చింతన మొదలైన మంచి గుణాలు అలవడుతాయి.

ఉపవాసం అంటే కేవలం బాహ్య సంబంధమైన ఆకలిదప్పులు మాత్రమే కాదు, వాస్తవానికి అది హృదయం, ఆత్మల ఆకలిదప్పుల పేరు. ఉపవాసం ఉద్దేశ్యం మనిషిలో తఖ్వా (భయభక్తులు)ను పుట్టించటం, ఈ తఖ్వా గుణం మనిషిలో జనించకపోతే, అతడు రోజా ఉన్నట్లే కాదు.

లేకపోతే శారీరక ఉపవాసమయితే అయింది గాని, ఆత్మ సంబంధమైన ఉపవాసం కాలేదు అని అనవచ్చు. ఈ విషయాన్నే మహాప్రవక్త ముహమ్మద్ (స) ఈ విధంగా వ్యాఖ్యానించారు: "ఉపవాసం ఉండి కూడా, ఏ మనిషైనా అబద్ధం చెప్పటం విడనాడకపోతే, అతని తినటం, త్రాగటాన్ని విసర్జించటంతో అల్లాహ్‌కు ఏమాత్రం నిమిత్తం లేదు'. మరొక హదీసులో మహాప్రవక్త(స) అన్నారు : "ఉపవాసం చెడుల నుండి ఆపే డాలు. కనుక ఉపవాసం ఉన్న వాడు వ్యర్థ ప్రసంగం చెయ్యకూడదు, బూతు మాటలు పలుకరాదు, కోపగించకూడదు. ఎవరైనా అతనితో కలహానికి కాలు దువ్వితే, అతన్ని తిట్లు తిట్టినప్పటికీ, అతడు, 'నేను ఉపవాసం ఉన్నాను' అని పలకాలి". మరొక హదీసులో 'ఉపవాసం డాలుగా పనిచేసేది అందులో రంధ్రం పడనంత వరకే' అని కూడా వస్తుంది. మహాప్రవక్త(స) ప్రత్యక్ష అనుచరులు 'ఈ రంధ్రం దేనివల్ల పడుతుంది' అని అడిగారు. ఆయన(స) 'అబద్ధం (పరోక్షంగా), పర దూషణల వల్ల' అని సమాధానం చెప్పారు. కొంతమంది విద్వాంసుల అభిప్రాయం ప్రకారం ఏవిధంగానైతే తినటం, త్రాగటంవల్ల ఉపవాసం భంగమవుతుందో, అదే విధంగా పాపకార్యాలు చెయ్యడం వల్ల కూడా ఉపవాస భంగం జరుగుతుంది.

ఉపవాసం ప్రత్యేకత ఏమిటంటే అది ఒక నిశ్శబ్ద ఆరాధన. సాధారణంగా అందులో ప్రదర్శనకు, పరుల మెప్పు పొందే అపవిత్ర భావనకు తావులేదు. ఉపవాసం ఉన్న వ్యక్తి ఇతరులకు తాను చెప్పేవరకు దాన్ని గురించి వారికి తెలియదు. ఈ విషయమే ఇతర ఆరాధనల నుండి ఉపవాసాన్ని వేరుపరుస్తుంది.

ఉపవాసానికున్న ఈ ప్రత్యేకత వల్లనే అల్లాహ్ 'ఉపవాసం

ఉన్నవాడు నా కొరకు తన తినటాన్ని, త్రాగటాన్ని, ఇతర సౌఖ్యాలను త్యజిం చాడు, కనుక ఉపవాసం నా కొరకు. దానికి ప్రతిఫలం నేను ఇస్తాను' అన్నాడు.

ఉపవాసం ఒక మంచి పని. దీనికి బహుమానంగా అల్లాహ్ తన దాసుల తప్పుల్ని దాస్తాడు. పాపాలను క్షమిస్తాడు; అంతేకాదు, అపూర్వ మైన బహుమానాన్నిస్తానని వాగ్దానం చేశాడు.

ఉపవాసం ఉన్న పురుషులు, ఉపవాసం ఉన్న స్త్రీలు తమ మర్మాం గాలను కాపాడుకునే పురుషులు, కాపాడుకునే స్త్రీలు, అల్లాహ్‌ను అధికంగా స్మరించే పురుషులు, స్మరించే స్త్రీలు- వారి కొరకు అల్లాహ్ క్షమా దానాన్ని. పెద్ద ప్రతిఫలాన్ని సిద్ధంగా ఉంచాడు.'

(అహ్‌జాబ్ : 35)

('గీటురాయి' వారపత్రిక : 29-6-1979)

విశ్వ మానవ సౌభ్రాతృత్వం

మతం అనగా మతిని సంస్కరించునది; మనిషికి మంచి మార్గం చూపునది, మనిషిని తన ప్రభువు, సృష్టికర్త అయిన దేవునితో కలుపునది, ప్రేమామృత ధారలను పంచునది. మతం మనిషికీ, మనిషికీ మధ్య వారధి; శాశ్వతమైన విశ్వజనీనమైన విలువలకు నిలయం, మానవ ప్రవర్తనకు పటిష్టమైన భూమిక, మతం ఒక సమగ్రమైన, సంపూర్ణమైన, ఆచరణ యోగ్యమైన జీవిత విధానం; అది సార్వజనీనం. సార్వకాలికం. మతం మనిషిలోని పశువును అదుపు చేసి మనిషిలోని మనీషిని మేల్కొలుపు తుంది. మతంపై నడిచే మనిషి మంచివాడవుతాడు, అతనిలో సానుభూతి, ఔదార్యం ఉట్టిపడతాయి. తోటి మానవుల్ని ప్రేమిస్తాడు; వారిని సోదరు లుగా భావిస్తాడు. కష్టాల్లో ఉన్నప్పుడు వారిని ఆదుకుంటాడు.

ఇస్లామ్ మతం, విభిన్న మత వర్గాల ప్రజల మధ్య సన్నిహిత సంబంధాలను, సత్సంబంధాలను పెంపొందిస్తుంది. మానవులందరూ ఒకే తల్లికి, ఒకే తండ్రికి పుట్టిన సంతానమనీ, కనుక వారు పరస్పరం సోదరులని, సమానులనీ, కాబట్టి ద్వేషించుకోరాదని, కలహించుకోరాదని, చంపుకోరాదని బోధిస్తుంది. దివ్యఖుర్‌ఆన్ గ్రంథంలో అల్లాహ్ ప్రవచనం ఇలా ఉంది:

యా అయ్యుహన్నాసు ఇన్నా ఖలఖ్‌నాకుమ్ మ్మిన్ జకరివ్వ ఉన్‌సా

వజఅల్నాకుమ్ షుఊబన్వ్వ ఖబాఇల లితఆరఫూ, ఇన్న అక్రమకుమ్ ఇందల్లాహి అత్ఖాకుమ్. ఇన్నల్లాహ అలీమున్ ఖబీర్.

(ఖుర్ఆన్ 49: 13)

"మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుండీ, ఒకే స్త్రీ నుండీ సృష్టించాము. తరువాత మీరు ఒకరికొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని జాతులుగానూ, తెగలుగానూ చేశాము. వాస్తవానికి మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవనీయుడు. నిశ్చయంగా అల్లాహ్ సర్వజ్ఞానం కలవాడు, సకల విషయాలూ తెలిసినవాడూను."

ఈ వాక్యంలో అల్లాహ్ మొత్తం మానవ జాతిని సంబోధిస్తూ హితోపదేశం చేశాడు. ప్రపంచంలో ఎల్లప్పుడూ విశ్వ సంక్షోభానికి దారితీసే వంశం, వర్ణం, దేశం, భాష, జాతీయతలకు సంబంధించిన విద్వేష భావాలను సంస్కరించాడు, అతి ముఖ్యమైన మూడు విషయాలు బోధించాడు. ఒకటి– మీరందరూ ఒకే మూలానికి చెందినవారు. మీ జాతి అంతా ఒకే పురుషుడు, ఒకే స్త్రీ నుండి ఆవిర్భవించింది. ఈనాడు ప్రపంచంలో ఉన్నటువంటి మీ జాతులన్నీ వాస్తవానికి మొట్టమొదటి వంశానికి చెందిన భిన్న శాఖలు మాత్రమే. ఆ వంశం ఒకే తండ్రి, ఒకే తల్లితో ప్రారంభమయింది. రెండు– మీ మూలం ఒకటే అయినప్పటికీ, మీరు పలు జాతులుగా, పలు తెగలుగా చీలిపోవటం అత్యంత సహజమైన విషయం. అయితే, సహజమైన ఈ విభాగాలను ఆధారంగా చేసుకుని సమాజంలో ఎక్కువ తక్కువలూ, అల్పులూ అధికులూ, ఉన్నతులూ, నీచులూ అనే అంతరాలను సృష్టించకూడదు. ఒక జాతి మరొక జాతిపై తన ఆధిపత్యాన్ని చూపకూడదు. ఒక వర్ణం వారు మరొక వర్ణం వారిని అల్పులుగా,

హీనులుగా చూడకూడదు. ఒక వంశం మరొక వంశంపై ఆధిక్యతను చూపకూడదు. విశ్వ సృష్టికర్త అయిన అల్లాహ్ మానవులను జాతులుగాను, తెగలుగాను తీర్చిదిద్దటానికి కారణం, వారి మధ్య పరస్పర సహకార, పరిచయాలకు ప్రకృతి సిద్ధమైన మార్గం ఇదొక్కటే. మూడు- మానవుల మధ్య ఔన్నత్యానికీ, ఆధిక్యతకూ పునాది ఏదైనా ఉంటే, అది కేవలం మంచితనం, నీతి నిజాయితీలు, శీలం, భయభక్తులు మాత్రమే.

ఈ వాక్యం విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని ప్రబోధిస్తోంది. మానవుల మధ్య సఖ్యతను, సోదరభావాన్ని, ప్రేమానురాగాలను పెంపొందించటానికి, కారుణ్యమూర్తి మహాప్రవక్త ముహమ్మద్(స) చేసిన ఈ క్రింది బోధలు అద్భుతంగా దోహదపడతాయి.

- జనులారా! తెలుసుకోండి. మీ అందరి దేవుడు ఒక్కడే. అరబ్బులకు అరబ్బేతరులపై గాని, అరబ్బేతరులకు అరబ్బులపై గాని, తెల్లవారికి నల్లవారిపై గాని, నల్లవారికి తెల్లవారిపై గాని ఎలాంటి ప్రాధాన్యతా లేదు. ఎవరయితే అల్లాహ్‌కు ఎక్కువగా భయపడతారో, వారే ఆయన దృష్టిలో ఎక్కువ గౌరవనీయులు.
- ప్రజలారా! మీరంతా (ఆది మానవుడైన) ఆదమ్ సంతానమే. ఆదమ్ మట్టితో సృష్టించబడ్డారు. మనుషులు తమ పూర్వీకులను గురించి గర్వపడటం మానుకోవాలి. లేకపోతే వారు అల్లాహ్ సమక్షంలో హీనమైన పురుగు కన్నా ఎక్కువగా అవమానానికి గురవుతారు. ప్రళయం నాడు దేవుడు మీ గోత్రం గురించి, మీ వంశం గురించి ప్రశ్నించడు. మీలో భయభక్తులు కలవాడే ఆదరణీయుడు.
- దేవుని సాక్షి! అతను ముస్లిమ్ కాడు. అతనిలో ఇస్లామ్ లేదు. ఎవడ

యితే కడుపు నిండా అన్నం తింటాడో మరియు అతని పొరుగు వాడు ఆకలితో బాధపడుతూ ఉంటాడో. మీ నోటి వల్లగాని, మీ చేతుల వల్ల గాని తోటి మానవులకు నష్టం కలిగితే, కష్టం కలిగితే మీరు ముస్లిమ్‌లు కారు. తన జాతి ప్రజలు దౌర్జన్యం చేస్తున్నప్పుడు దానికి తోడుగా ఉండటమే జాతి దురభిమానం. నీ తోటి సోదరు నికి కష్టం కలిగినప్పుడు, నీవు సంతోషపడకూడదు. దేవుడు అతన్ని కరుణించి, అతని కష్టాలను దూరం చేసి, నిన్ను కష్టాలలో పడ వేయవచ్చు.

- తోటి మానవుల్ని కనికరించే వారిని కరుణామయుడైన దేవుడు కనికరిస్తాడు. నేల మీద ఉండే వారిపై దయ చూపండి. నింగి మీద ఉండేవాడు మీపై దయ చూపుతాడు. ఏ వ్యక్తి అయితే దురభి మానం వైపునకు పిలుస్తాడో, దురభిమానం ఆధారంగా ఇతరులతో పోరాడతాడో, దురభిమానం కలిగి ఉన్న స్థితిలో మరణిస్తాడో, అటువంటి వ్యక్తి మాలోని వాడు కాడు.
- దివ్యఖుర్‌ఆన్‌లో కరుణామయుడయిన అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: **మేము వారికి ధరణిపై అధికారాన్ని ఇస్తే, వారు నమాజును స్థాపి స్తారు. జకాతు ఇస్తారు, మంచిని పెంచుతారు, చెడును నిరోధి స్తారు. (అల్ హజ్జ్ : 41)**
- మతం విషయంలో నిర్బంధం కాని, బలాత్కారం కాని ఎంత మాత్రం లేవు. సవ్యమైన మాటను అపసవ్యమైన మాటల నుండి వేరు చేయడం జరిగింది. హింస ద్వారా పర ధర్మాన్ని అణచటం రక్తపాతం కంటే కూడా అత్యంత తీవ్రమైనది.

కనుక మత విశ్వాసం మనుషులు కలిసి మెలిసి బ్రతకటానికి

అవరోధం కాదు, కారాదు. మనుషులను కలిపేదే మతం కాని, చీలదీసేది మతం కాదు. మానవుడి మనస్సు ఊహించలేనంత విశాలమైన విశ్వాన్ని సృష్టించిన దైవశక్తి సంకుచితంగా ఉండగలదా? అసంభవం. విభిన్న మతాలు, దృక్పథాలు, ఆలోచనా విధానాలు ఉన్నటువంటి మన దేశంలో, సహిష్ణుతా భావన, సదవగాహన జన సామాన్యంలో అంతర్వాహినిలా ప్రవహించాలి; సహనం, సంయమనం, సహజీవనం లాంటి ఉత్తమ గుణాలు ప్రజల్లో పెంపొందాలి. ప్రజలు తమ విశ్వాసాన్ని, తమ నమ్మకాన్ని, తమ తత్వాన్ని- అది వారికి ఎంత హేతుబద్ధంగా, సహజమైనదిగా గోచరించినా- ఇతరులపై బలవంతంగా రుద్దకూడదు. దానికి అంగీకరించని వారిని, వ్యతిరేకించేవారిని వక్రబుద్ధి కలవారుగా, చిత్తశుద్ధి లేనివారుగా చిత్రించకూడదు. ఈ వైఖరి వల్ల ప్రజల మధ్య దూరాలు పెరుగుతాయే గాని తరగవు.

మానవులందరూ సమానులే, పరస్పరం సోదరులే అనేది ఉదాత్తమైన భావన. ప్రజలకు సాంఘిక న్యాయం, ఆర్థిక న్యాయం లేని సమాజాన్ని సత్సమాజం అనలేము. న్యాయ సంస్థాపన జరగనిదే, ఒక ఆదర్శ ఇస్లామీయ సమాజం ఉనికిలోకి రాదు. అన్ని రకాల అన్యాయాలను ఇస్లామ్ రూపుమాపుతుంది. అన్యాయం, అసమానత్వం, దోపిడి, అణిచివేత, అక్రమాలు- ఇవి ఇతరుల హక్కులను భంగపరుస్తాయి. విధుల నిర్వహణను అటంకపరుస్తాయి. దీనిని దివ్యఖుర్‌ఆన్ గ్రంథం 'జులుమ్' అని అంటోంది. జులుమ్ అంటే దౌర్జన్యం, హింస. న్యాయ సంస్థాపన కోసమే, అన్యాయం నిర్మూలనం కోసమే దేవుడు తన ప్రవక్తలను పంపాడని ఖుర్‌ఆన్ గ్రంథం ఘోషిస్తోంది. న్యాయానికి సంబంధించిన ప్రస్తావన దివ్యఖుర్‌ఆన్‌లో నూరుసార్లు వచ్చింది. అద్ల్, ఖిస్త్, మీజాన్ అనే అరబీ

పదాలు న్యాయం కోసం వాడబడ్డాయి. అన్యాయాన్ని ఖుర్ఆన్ గ్రంథం 200 సార్లు ఖండించింది. న్యాయాన్ని ఖుర్ఆన్ భయభక్తులతో పోల్చింది. సమాజంలో న్యాయం లేకపోవటాన్ని మహాప్రవక్త ముహమ్మద్(స) 'పూర్తి అంధకారం'తో పోల్చారు. ప్రముఖ ఇస్లామ్ విద్వాంసులు ఇబ్నెతయ్‌మియా ఇలా ప్రకటించారు : "న్యాయంగా పాలించే అవిశ్వాస రాజ్యాన్ని దేవుడు సహిస్తాడు. కాని అన్యాయ పాలనం చేసే విశ్వాస రాజ్యాన్ని ఆయన సహించడు". అంటే ప్రపంచం అవిశ్వాసం ఉన్నా, న్యాయం ఉంటే మనగలుగుతుంది. కాని విశ్వాసం ఉండీ, అన్యాయం ఉంటే మనగలగ లేదు అని భావం. ఇస్లామ్‌కూ, అన్యాయానికీ మధ్య సహజీవనం అసంభవం. దివ్యఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా ఆజ్ఞాపించాడు. 'విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్ కోసం సత్యంపై స్థిరంగా ఉండండి. న్యాయానికి సాక్షులుగా నిలబడండి. ఏ వర్గం వారితోనైనా మీకు విరోధం ఉంటే, దాని కారణంగా మీరు ఆవేశానికి లోనై న్యాయాన్ని త్యజించకండి. న్యాయం చెయ్యండి. ఇది మీకూ, మీ బంధువులకూ ఎంత నష్టం కలిగించినా సరే. ఇది దైవభక్తి పరాయణత్వానికి సన్నిహితమైనది. అల్లాహ్‌కు భయపడుతూ మెలగండి, మీరు చేసేదంతా ఆయనకు పూర్తిగా తెలుసు." దైవప్రవక్త మహనీయ ముహమ్మద్(స) తమ పవిత్రమైన ఒక సూక్తిలో ఇలా సెలవిచ్చారు: "పూర్వం గతించిన జాతులు ఎందుకు నాశనమయ్యాయో మీకు తెలుసా? బలహీనులు నేరం చేస్తే, అవి వారిని చట్టం ప్రకారం శిక్షించేవి. పెద్దవారు, ధనవంతులు నేరం చేస్తే, అవి వారిని విడిచిపెట్టేవి, శిక్షించేవి కావు. ఏ దేవుని చేతుల్లోనయితే నా జీవన్మరణాలు ఉన్నాయో ఆ దేవుని సాక్షి! ఒకవేళ నా కుమార్తె ఫాతిమా (ర) దొంగతనం చేసినా, నేను ఆమె చేతుల్ని నరుకుతాను."

చట్టబద్ధమైన పాలన ఉంటేనే, న్యాయం నాలుగు పాదాల నడుస్తుంది. ప్రజలు న్యాయం కోసం, సత్యం కోసం ఎంతటి త్యాగానికైనా వెనుతీయకూడదు అనే విషయాలను ఈ సూక్తులు స్పష్టం చేస్తున్నాయి. ఇస్లామ్ ధర్మం మానవ ప్రాణానికి ఎనలేని ప్రాముఖ్యాన్ని, గౌరవాన్ని ఇస్తోంది. మానవుడు ఏ గడ్డపై పుట్టినా, ఏ జాతిలో జన్మించినా, అతను మానవుడే. కనుక ప్రతి మనిషీ తోటి మనిషి ప్రాణాన్ని గౌరవించాలి. పరిరక్షించాలి. పవిత్రమైనదిగా భావించాలి. మానవులంతా పరస్పరం సోదరులే కదా! దివ్యఖుర్‌ఆన్ గ్రంథంలో అల్లాహ్ ఇలా ప్రవచించాడు: 'అన్యాయంగా ఎవరైనా ఒక మానవుణ్ణి చంపితే, అతను మొత్తం మానవ జాతిని చంపినట్లే, ఎవరైనా ఒక మానవుని ప్రాణాన్ని కాపాడితే అతను యావత్తు మానవ జాతిని కాపాడినట్లే'. అంటే ఒక మానవుణ్ణి ఎవరైనా అన్యాయంగా చంపినట్లయితే, వారు మొత్తం ప్రపంచంలో ఉన్న మానవులందరినీ అంటే 500 కోట్ల మంది మానవుల్ని చంపినట్లు అన్నమాట; అంత ఘోరమైన మహా పాపానికి ఒడిగట్టినట్లు అన్నమాట. అదేవిధంగా ఒక మనిషిని ఎవరైనా అన్యాయంగా చంపుతున్నట్లయితే, ధైర్యం చేసి అతన్ని కాపాడితే, యావత్తు మానవజాతిని కాపాడినట్లు. పుణ్యం కూడా పెద్దదే; పాపం కూడా పెద్దదే. దురదృష్టవశాత్తు ఈనాడు లోకంలో మానవ ప్రాణానికి విలువ లేకుండాపోయింది. ఒక మనిషి ప్రాణానికి విలువ లేకుండాపోయింది. ఒక మనిషి తోటి మనిషిని తన స్వార్థం కోసం, రాజకీయ లబ్ధిని పొందటం కోసం దారుణంగా హత్య చేస్తున్నాడు. ఇస్లాం ధర్మం ఆత్మహత్యను కూడా ఖండిస్తుంది; అది మహా పాపం అంటుంది. ఆత్మహత్య చేసుకునేవాడు నరకానికి పోతాడు. ప్రాణం దైవప్రసాదితం. అది ఒక అమానతు. మనిషికి తనకు ఇష్టం కానప్పుడు దానిని తీసి పారెయ్యటానికి వీలులేదు. ఖుర్‌ఆన్ గ్రంథంలో ఇలా ఉంది: 'నిన్ను నీవు హత్య చేసుకోకూడదు'. ఇంకా; 'పేదరికం భయం వల్ల మీరు మీ

సంతానాన్ని హత్య చెయ్యకండి. మీకూ, వారికీ ఆహారాన్ని మేమే ఇస్తాము'. దైవప్రవక్త ముహమ్మద్(స) ఇలా ఉద్బోధించారు : "జనులారా! మీ ప్రాణాలు, మీ ఆస్తిపాస్తులు, మీ గౌరవాలు ఒకరికొకరికి నిషేధించ బడ్డాయి."

మనుషులు మంచివారుగా, మృదు స్వభావులుగా, సౌశీల్యవంతులుగా, ప్రేమమయులుగా మారటానికి ఈ క్రింది గుణ విశేషాలు వారిలో తప్పనిసరిగా ఉండాలి.

- దైవభక్తి, దైవభయం అనే మహత్తరమైన సుగుణాలు వారిలో జనించాలి. ప్రతి రోజూ దేవుణ్ణి ప్రార్థించాలి. ఇంటా బయటా అన్ని చోట్లా ఆయనకు భయపడాలి. మానవ జీవితానికి సంబంధించిన అన్ని రంగాల్లోనూ ఆయన్ని జ్ఞాపకముంచుకోవాలి. మసీదుల్లో, మందిరాల్లో, చర్చిలలో మాత్రమే కాదు, వాటి బయట కూడా దైవానికి భయపడాలి.
- ఈ జీవితం అశాశ్వతమనీ, ఈ లోకం నుండి ఏదో ఒక రోజున నిష్క్రమించటం తప్పదనీ, అసలు జీవితం శాశ్వతమైన జీవితం పరలోక జీవితమనే ఆధ్యాత్మిక చింతన కలిగి వుండాలి. సత్కార్యాలు చేస్తే స్వర్గానికి, దుష్కార్యాలు చేస్తే నరకానికి పోతామనే ఆలోచన ఉండాలి.
- ఎవరైనా సరే, ఏ మతానికి చెందినవారైనా సరే మంచి పనులు చేస్తూ ఉంటే, వారికి తోడ్పడాలి. చెడ్డ పనులు, దౌర్జన్యాలు చేస్తే వారికి సహకరించరాదు.
- చెడును చూస్తే, ధైర్యం ఉంటే, దాన్ని చేత్తో ఆపాలి. చేత్తో ఆపే ధైర్యం లేకపోతే, నోటితోనయినా హితబోధ చేసి ఆపాలి. ఈ ధైర్యమూ లేకపోతే చెడును చెడుగానైనా మనస్సులో భావించాలి.

చెడును చూసి మనసులో ఈ భావం కూడా కలగకపోతే, అటువంటి వారిలో దైవ విశ్వాసం లేనట్లే.

- కోపం వచ్చినప్పుడూ, సంతోషం కలిగినప్పుడూ న్యాయం పలకాలి. పేదరికంలోనూ, సిరిసంపదలు ఉన్నప్పుడూ మితంగా వ్యవహరించాలి.
- ఎవరైనా మనతో స్నేహ సంబంధాన్ని తెంచుకుంటే, మనం వారికి చేరువై దాన్ని స్థాపించుకోవాలి. మనకు ఇవ్వని వారికి మనం ఇవ్వాలి.
- మౌనంగా ఉన్నప్పుడు ఆలోచిస్తూ ఉండాలి. మన చూపులు గుణపాఠం నేర్చుకునే చూపులుగా ఉండాలి.
- ప్రజలను మంచి వైపునకు పిలవాలి. చెడు చెయ్యకుండా వారిని ఆపాలి.
- ఇతరులు పూజించే దేవుళ్లను దూషించకూడదు.
- నోటిని అదుపులో ఉంచుకోవాలి. ఆలోచించి, అర్థం చేసుకుని మరీ మాట్లాడాలి. వ్యభిచారం దరిదాపులక్కూడా పోకూడదు. అది పవిత్రతను నాశనం చేస్తుంది. దారిద్ర్యానికి సోపానం.
- పరస్పరం కుశంకలకు పాల్పడకూడదు. ఒకరి వ్యవహారం గురించి మరొకరు కూపీలు తీయకూడదు. ఈర్ష్యా అసూయలకు లోను కాకూడదు. ఒకరి మార్గంలో ఒకరు ఆటంకాలు సృష్టించకూడదు.
- మీ స్నేహమైనా, మీ శత్రుత్వమైనా కేవలం దైవం కోసమే కావాలి. ప్రాపంచిక ప్రలోభాలు వాటికి పునాదులు కాకూడదు.

(11-2-2000)

అమెరికా రష్యాల కాకిగోల

ఇస్లాం అన్నా ఇస్లామీ ఉద్యమం అన్నా అమెరికా రష్యాలు రెంటికీ గిట్టదు. అదంటే వాటికి ఎలర్జీ రోగం పుడుతుంది. వాటి సిద్ధాంతాలు పరస్పర విరుద్ధాలైనా, వాటి మధ్య శాశ్వత వైషమ్యం ఉన్నా, ఇస్లాం విషయం వస్తే మటుకు అవి రెండూ ఒకటౌతాయి. దానికి వ్యతిరేకంగా సమిష్టి పోరాటం కొనసాగిస్తాయి. ఒక ముస్లిం ఇస్లాంపై నడిచినా లేక ఒక ముస్లిమేతరుడు ఇస్లాంను స్వీకరించినా ఇవి ఓర్వలేవు. నానా రభస చేస్తాయి. ఇస్లాంపై అభాండాల వర్షం కురిపిస్తాయి. రష్యా ప్రోద్బలం కారణంగానే నాసర్ ఈజిప్టులో 'ఇస్లామీ బ్రాదర్‌హుడ్' ఉద్యమాన్ని నిర్దాక్షిణ్యంగా అణిచాడు. ఆ ఉద్యమకారుల్ని చిత్రవధ చేశాడు. ఇస్రాయీల్ జాతి వారిని తన మానస పుత్రులుగా చేసుకొని అమెరికా వారిని అరబ్బులకు వ్యతిరేకంగా పురిగొల్పి వారికి ఆయుధాలిచ్చి వారిచే దురాక్రమణలు చేయించింది. ఇదే మార్గాన్ని బ్రిటన్ కూడా తొక్కుతోంది. ఇస్లామీ ధర్మసూత్రాలను తు.చ తప్పకుండా అమలు పరిచే తిరుగులేని నిర్ణయం తీసుకున్న పాకిస్తాన్, ఈరాన్ దేశాలను చూసి ఇప్పుడు ఈ అగ్ర రాజ్యాల కళ్ళు కుడుతున్నై. కనుక అవి ఆ దేశాల ప్రభుత్వాలకు వ్యతిరేకంగా తిరుగుబాటు ఉద్యమాలను ప్రోత్సహిస్తున్నై. తమ ఒనరుల్ని గుప్పి

స్తున్నై. రకరకాల జిత్తుల్ని పన్నుతున్నై. ఇస్లాం పైకి రావటాన్ని సహించలేని కొన్ని దేశాలు, కొన్ని పార్టీలు, కొందరు వ్యక్తులు ఈ దేశాలను గుడ్డిగా అనుకరిస్తున్నయ్. ఈ వారం లోకంలో వీళ్ళంతా ఇస్లాంపై దుమ్మెత్తి పోశారు. అది ప్రాచీన యుగానికి చెందిన మతం కనుక ఆధునిక యుగానికి వర్తించదు అని దాన్ని కొట్టిపారేశారు. వారు ఎక్కువగా తప్పు పట్టిన విషయం ఇస్లాంలో స్త్రీకున్న స్థానానికి సంబంధించింది. ఇస్లాంలో స్త్రీకి పురుషునితో సమానమైన స్వాతంత్ర్యం, హక్కులు లేవని పర్దా ఆచారం మూఢాచారం అని, ఇస్లాం స్త్రీని ఇంటి నాలుగు గోడల్లోనే బంధిస్తుందని వారు విమర్శించారు. రేడియోలు, టీవీలు ఈ విషయాలను ప్రముఖంగా ప్రసారం చేశాయి. ఇంగ్లీషు దినపత్రికలు ఇండియన్ ఎక్స్‌ప్రెస్, హిందూ, ఇంగ్లీషు వారపత్రిక 'ఆర్గనైజర్' మొదలైనవి కూడా ఈ విషయాన్ని గురించి వ్యాసాలు ప్రచురించాయి. వ్యాసకర్తలకు ఇస్లాం స్త్రీకి ఏ స్థానం ఇస్తుందో సరిగ్గా తెలియదనే విషయం వారి వ్యాసాలను చదివితే తెలుస్తుంది. ఈ కారణంగా వారు వ్రాసిన విషయాల వల్ల ఇస్లాం పట్ల ప్రజల్లో అపోహలు కలిగే అవకాశం ఉంది. కనుక ఇస్లాంలో స్త్రీకున్న స్థానాన్ని గురించి ఖుర్‌ఆన్, హదీసుల వెలుగులో సంగ్రహంగా చర్చిస్తాను.

స్త్రీ జన్మత: కోమలాంగి, అబల. పురుషుడు బలిష్ఠుడు, శక్తిమంతుడు. కనుక పురుషుడు కాయకష్టం చేసి సంపాదిస్తాడు. అతని సంపాదనతో స్త్రీ ఇల్లును నడుపుతుంది. ఇంటి వ్యవహారాలను చక్కదిద్దుతుంది. **'స్త్రీ తన భర్త ఇంటికి మహారాణి. ఆమె తన బాధ్యతల నిర్వహణ విషయంలో సమాధానం చెప్పుకోవలసి వుంది.'** (అల్ బుఖారీ) అందుకని మానవ సహజమైన బలహీనతల కారణంగా **'స్త్రీ కంటే**

పురుషుడు కొద్దిగా అధికుడు' (ఖుర్ఆన్ 2:228). పురుష రంగం ఏదో, స్త్రీ రంగం ఏదో ఇస్లాం స్పష్టంగా నిర్దేశించింది. కనుక స్త్రీ పురుష రంగంలోకి వచ్చినా, పురుషుడు స్త్రీ రంగంలోకి చొరబడినా సంక్షోభం చెలరేగుతుంది. ఎవరి రంగాన్ని వారు సమర్థంగా నిర్వహించాలి.

స్త్రీ హక్కుల విషయంలో ఇస్లాం మూడు మార్గదర్శక సూత్రాలను పరిగణనలోకి తీసుకుంటుంది. ఒకటి కుటుంబ వ్యవస్థలో క్రమశిక్షణను కాపాడటానికి తనకివ్వబడిన అధికారాన్ని పురుషుడు దుర్వినియోగం చెయ్యకూడదు అని ఇస్లాం నిర్దేశిస్తుంది. రెండు : ఇస్లాం సూచించిన సాంఘిక హద్దుల్లోనే ఉంటూ ఆమె తన సహజసిద్ధమైన శక్తిసామర్థ్యాలను పెంచుకుని నాగరికత అభివృద్ధికి తన సముచితమైన పాత్రను నిర్వహించేందుకు స్త్రీకి తగిన అన్ని అవకాశాలను ఇవ్వాలి. మూడు : స్త్రీ స్త్రీగా ప్రగతి యొక్క ఉన్నత శిఖరాలను చేరుకోవటాన్ని ఇస్లాం అభిలషిస్తుంది. అందుకు అవకాశం ఇస్తుంది. కాని స్త్రీకి పురుషుడయ్యే హక్కు లేదు. పురుష రంగ ప్రవేశం చేసే శిక్షణ ఆమెకు ఇవ్వటం అనేది ఆమెకుగాని సమాజానికి గాని శ్రేయస్కరం కాదు. ఆ రంగంలో ఆమె కృతార్థురాలు కాలేదు కూడా.

ఈ మూడు సూత్రాలను దృష్టిలో ఉంచుకుని ఇస్లాం స్త్రీకి విస్తృతమైన సాంఘిక, ఆర్థిక హక్కుల్ని ఇచ్చింది, ఆమె స్థానాన్ని పెంచింది. ఆమె హక్కుల సంరక్షణకు, ఆమె స్థానాన్ని కాపాడటానికి ఆమెకు నైతికపరమైన, చట్టసంబంధమైన రక్షణలను కల్పించింది. ఈ విషయం ప్రపంచంలోని ఏ సాంఘిక వ్యవస్థలోనూ లేదు.

ఆర్థిక హక్కులు

ఒక్క ఇస్లాం తప్ప అన్ని విధానాలూ స్త్రీ ఆర్థిక స్థితిని బలహీనం

చేశాయి. ఈ ఆర్థిక అసహాయత కారణంగానే ఆమె సమాజంలో వాస్తవంగా ఒక బానిస కావలసి వచ్చింది. యూరోపియన్ దేశాలు ఆమె ఈ స్థితిని మార్చటానికి ప్రయత్నించాయి. తత్ఫలితంగా పురుషుడు మాదిరిగా ఆమె కూడా సంపాదనా పరురాలయింది. దీనివల్ల మేలుకంటే కీడే ఎక్కువగా జరిగింది. అయితే ఇస్లాం మధ్యేమార్గాన్ని అవలంబిస్తుంది. అది ఆమెకు విస్తృతమైన వారసత్వపు హక్కుల్ని ప్రసాదిస్తుంది. తత్ఫలితంగా ఆమె తన తండ్రి ఆస్తి నుండి, తన భర్త ఆస్తి నుండి, తన సంతానం ఆస్తి నుండి, తన దగ్గరి బంధువుల ఆస్తి నుండి, తన వారసత్వపు భాగాన్ని పొందగలుగుతుంది. ఇదిగాక ఆమె ఇంకా తన భర్త నుండి మెహర్ (స్త్రీ ధనం)ను కూడా తీసుకుంటుంది. ఈ విధంగా ఆమె పొందిన యావత్తు ఆస్తి ఆమె సొంత ఆస్తి అవుతుంది. ఆమెకు ఆ ఆస్తిపై సర్వాధికారాలుంటాయి. ఆమె తన ధనంతో ఏదైనా వ్యాపారం చేస్తే వచ్చే లాభాలకు ఆమె మాత్రమే యజమాని అవుతుంది. ఆమె వద్ద ఇంత పెద్ద ఆస్తి ఉన్నప్పటికీ ఆమెను ఆమె భర్తే పోషించవలసి ఉంటుంది. భార్య ఎంత పెద్ద ధనవంతురాలయినా భర్త మాత్రం ఆమెను పోషించే బాధ్యత నుండి తప్పించుకోలేడు. ఈ విధంగా స్త్రీ ఆర్థిక స్థితి ఇస్లాంలో సురక్షితంగా ఉంటుంది.

సాంఘిక హక్కులు

తన భర్తను తాను ఎన్నుకునే పూర్తి స్వేచ్ఛను ఇస్లాం స్త్రీకి ఇస్తుంది. ఆమె అంగీకారం లేకుండా ఆమె వివాహం చేసే హక్కు ఎవరికీ లేదు. క్రూరుడు, నపుంసకుడు లేక ఆమె ఇష్టపడని భర్త నుండి వేర్పాటు పొందే విస్తృతమైన చట్టపరమైన హక్కులు ఆమెకు ఇవ్వబడినై.

తనకు తన భార్యపై ఇవ్వబడిన అధికారాన్ని ఆలోచనతో, విశాల హృదయంతో, ఔదార్యంతో వినియోగించాలని భర్తను ఆదేశించటం జరిగింది.

ఖుర్‌ఆన్ అంటుంది– "మీరు మీ స్త్రీలతో దయాదాక్షిణ్యాలతో ప్రవర్తించండి. మీ పరస్పర వ్యవహారాలలో ఔదార్యాన్ని మరిచిపోకండి".

మహాప్రవక్త (స) ఒక హదీసులో, "తమ భార్యలతో చక్కగా ప్రవర్తించేవారే, తమ ప్రజల్ని దయతో చూసేవారే మీలో ఉత్తములు" అన్నారు.

భర్త గనక తన అధికారాన్ని దుర్వినియోగపరిస్తే భార్యకు కోర్టుకు పోయ్యే హక్కు ఉంది.

వితంతువులకు, విడాకులు ఇవ్వబడిన స్త్రీలకు, ఏ స్త్రీల వివాహమైతే చెల్లదని కోర్టు తీర్పు ఇచ్చిందో ఆ స్త్రీలకు మళ్ళీ పెళ్ళి చేసుకునే హక్కును ఇస్లాం ఇస్తుంది. మాజీ భర్తకు లేక బంధువుకు ఆమెపై ఏవిధమైన హక్కు లేదు. సివిల్ చట్టాలు, శిక్షాస్మృతికి సంబంధించిన విషయాలలో స్త్రీ పురుషులు ఉభయులూ సమానులే. ధన మాన ప్రాణాల సంరక్షణ విషయంలో స్త్రీ పురుషుల మధ్య ఇస్లామీ చట్టం భేదభావం చూపదు. స్త్రీ విద్యకు ఇస్లాం గొప్ప ప్రాధాన్యం ఇస్తుంది. మత సంబంధమయిన విద్యను, ప్రాపంచిక విద్యను నేర్చుకునే హక్కు ఆమెకు ఉంది. మహాప్రవక్త (స) సతీమణి హజ్రత్ ఆయెషా (ర.అ) కేవలం స్త్రీలకే కాదు పురుషులకు కూడా విద్యాబోధ చేసేవారు.

స్త్రీని ఎవరు ఎంత హీనంగా చూశారో, ఎంతగా అవమానపరిచారో మానవ చరిత్ర చదివితే తెలుస్తుంది. స్త్రీ అసలు మానవ జాతికి చెందుతుందా, ఆమెకు దైవం ఆత్మను ప్రసాదించాడా అనే విషయాలను గురించి గొప్ప గొప్ప పండితులే సుదీర్ఘ చర్చలు జరిపారు. హిందూ మతం ప్రకారం స్త్రీలు వేదాలను నేర్చుకోకూడదు. బౌద్ధ మతం ప్రకారం స్త్రీతో

సంభోగిస్తే ముక్తి లభించదు. మానవుడు చేసే చెడులకు స్త్రీ మూలకారణం అని క్రిస్టియన్ మతం, జూడా మతం తెలుపుతాయి. గ్రీస్ దేశంలో వివాహ మైన స్త్రీలకు విద్యను, సాంస్కృతిక శిక్షణను పొందే హక్కు లేదు. వారికసలు సాంఘిక హక్కులంటూ ఉండేవి కావు. ఈ హక్కులు ఒక వ్యభిచార స్త్రీకయితే ఇవ్వబడేవి.

ఒక్క ఇస్లాం మాత్రమే స్త్రీకి సముచితమైన స్థానాన్ని ఇచ్చింది, ఆమె స్థానాన్ని విప్లవాత్మకంగా తీర్చిదిద్దింది.

('గీటురాయి' వారపత్రిక 30-3-1979)

సామాజికం

మదీనా వీధుల్లో మద్యం ప్రవహించింది

"అల్లాహ్ సారాయిని నిషేధించాడు. మీరు మీ వద్ద ఉన్న సారాయిని ఇక త్రాగనూ లేరు, అమ్మనూ లేరు. కనుక దాన్ని పార బొయ్యండి" అని మహాప్రవక్త ముహమ్మద్(స) ప్రకటించగానే ముస్లిం లంతా తమ వద్ద ఉన్న సారాయి కుండల్ని పగలగొట్టారు. అప్పుడు మదీనా పట్టణ వీధుల్లో సారాయి సెలయేరులాగా ప్రవహించింది.

ఈ చారిత్రక సంఘటన – నాకు ప్రముఖ ఇంగ్లీషు దినపత్రిక 'హిందూ' ప్రచురించిన ఒక వార్తను చూసి జ్ఞాపక మొచ్చింది. 'ఈరాన్ విప్లవం రోజురోజుకు ఇస్లామీ రంగును పులుముకుంటూ పోతూంది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలనుంచి ఈరాన్‌కు దిగుమతి అయ్యే మాంసం నిషేధించబడింది. పంది మాంసమైతే అసలే లేదు. మద్యపాన నిషేధం కూడా త్వరలోనే అధికారికంగా అమలులోకి వస్తుందని ప్రజలు భావిస్తున్నారు. కొంతమంది ముస్లింలు తమకు తామే ప్రతి రోజు వేల గ్యాలన్ల సారాయిని సైడు కాల్వల్లో పారబోస్తున్నారు అని ఆ పత్రిక వ్రాసింది. ఇస్లామీ ధర్మం మద్యపానాన్ని, ఇతర మత్తు పదార్థాలను నిషేధిస్తుంది.

మద్యపానం ఒక సాంఘిక దురాచారం, కుటుంబ సంక్షేమానికి, నైతిక ప్రమాణాల ప్రగతికి అది గొడ్డలిపెట్టు. మద్యపానం వల్ల లక్షలాది కుటుంబాలు ఆర్థికంగా, ఇంకా ఎన్నో విధాలుగాను చితికిపోతున్నై. మద్యంపై సుంకం ద్వారా ప్రభుత్వానికి సాలీనా 100 కోట్ల రూపాయల అదాయం లభిస్తూ ఉంటే కల్లు, సారాయిలపై ఈ వ్యసనానికి దాస్యం చేస్తున్న సామాన్య ప్రజలు ఇంకా ఎంత ఎక్కువగా డబ్బు వృధా చేస్తున్నారో ఆలోచిస్తే గగుర్పాటు కలుగుతుంది. పెక్కు బీద కుటుంబాలు మితిమీరిన రుణభారంతో కృంగిపోవటానికి మద్యపానమే కారణం. మద్యం సేవించే వారి సంఖ్య జనాభాలో 15శాతం ఉంటుంది. యూనివర్సిటీల్లో కాలేజీల్లో విద్యార్థులు, విద్యార్థినులు కూడా ఈ వ్యసనానికి బానిసలవుతున్నారు.

సంపూర్ణ మద్యనిషేధం గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యానికి నాంది. మద్యనిషేధం మన రాజ్యాంగంలోని నిర్దేశిక సూత్రాల్లో ఒకటి. దానిని అమలుపరుస్తానని జనతా పార్టీ ఎన్నికలప్పుడు వాగ్దానం చేసింది. 30 సంవత్సరాలు ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలిన కాంగ్రెస్ మద్యాన్ని నిషేధించకపోగా దాని తయారీని, అమ్మకాన్ని ద్విగుణీకృతం చేసింది. ఈ కారణంగా ఎక్కడ చూసినా సారాయి దుకాణాలే. జనతా పార్టీ కూడా ఈ దశలో అనుకున్నంత ప్రగతిని సాధించకపోవటం శోచనీయం. మన రాష్ట్ర మంత్రిగారైతే 'మద్యనిషేధాన్ని అమలు చేస్తే వచ్చే 100 కోట్ల ఆర్థిక నష్టాన్ని కేంద్రం భర్తీ చేసే పక్షంలోను, జనతా పార్టీ ప్రభుత్వాలు ఉన్న వివిధ రాష్ట్రాల్లో మద్యనిషేధం విధిస్తేను, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా మద్య నిషేధాన్ని అమలు చేస్తుంది అని తప్పించుకుంటున్నారు. పోలీస్ కమిషన్ చైర్మన్ శ్రీ ధర్మవీర గారు, 'సంపూర్ణ మద్యనిషేధం అమలుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల వల్ల అవినీతి, నేరాలు పెరిగిపోతాయి' అని

అంటున్నారు. ఈ విషయాలను గమనిస్తే ప్రజల నైతిక ప్రమాణాలను పెంచే ఆలోచన ప్రభుత్వానికి నాయకులకు ఉన్నట్లు కన్పించదు.

ఈ మధ్య అమెరికాకు, ఇతర యూరపు దేశాలకు ఏవో పనుల మీద వెళ్ళే మన దేశం వాళ్ళు ఆయా దేశాల్లోని మంచికి బదులుగా చెడునే వెంటబెట్టుకు వస్తున్నారు. మన పట్టణాల్లో నగరాల్లో విద్యాధికులు ముఖ్యంగా యువతీ యువకులు మత్తు పదార్థాలను ఎక్కువగా సేవిస్తు న్నారు. 'వెలది, పానంబు, జూదంబు' అంటూ మన పెద్దలు చెప్పిన సప్త వ్యసనాల్లో పై మూడు వ్యసనాలకు నేటి క్లబ్బులు నిలయాలయ్యాయి. ఉన్నత తరగతి వారి సాంస్కృతిక, వినోద కేంద్రాలుగా చెప్పబడుతున్న ఈ క్లబ్బులు 'కల్చర్' పేరుతో వివిధ వ్యసనాలకు ఆలవాలమయ్యాయి. పెద్దపెద్ద క్లబ్బుల్లో, మూడు నాలుగు చుక్కల హొటళ్ళల్లో చుక్కేసుకున్నా, చక్కని చుక్కను అక్కున చేర్చుకున్నా ఏ చిక్కూ లేదు. కాని మామూలు మడత మంచాల లాడ్జీల మీద, చౌక సారాయి దుకాణాల మీద, సందుల్లో గొందుల్లో సాగే జూదం మీద పోలీసులు మీసాలు మెలి వేసి విజృంభిస్తు న్నారు.

కనుక తగిన చర్యలు తీసుకోకుండా మద్యనిషేధాన్ని ప్రవేశపెడితే అది హొరు గాలిలో పెట్టిన దీపంగానే ఉండిపోతుంది.

('గీటురాయి' వారపత్రిక 16-3-1979)

మద్యపానం

తాగుబోతును చూడగానే మనకు జ్ఞాపకం వచ్చేది కళ్ళెంలేని గుర్రం, భయం లేని పోలీసు. త్రాగుబోతు తన ఇష్టం వచ్చినట్లు ప్రేల్తాడు. తన ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తాడు. తల్లీ, తండ్రీ, మంచీ, చెడూ, న్యాయం, అన్యాయం అనే విచక్షణ అతనికి ఉండదు. త్రాగుబోతును అందరూ అసహ్యించుకుంటారు, చీదరించుకుంటారు. సమాజానికి చీడపురుగుగా భావిస్తారు. నాగా లేకుండా దేశంలో ప్రతి వారం జరిగే మతకలహాలకు, ప్రతిరోజూ జరిగే హింసా దౌర్జన్యకాండకు, కుటుంబ కలహాలకు, ఆత్మహత్యలకు ఈ త్రాగుబోతులే ప్రబల కారణం అంటే అందులో ఎంతమాత్రం సందేహం లేదు. వయస్సుతో సంబంధం లేకుండా చిన్నా పెద్దా, ఆడా మగా అనే తారతమ్యం లేకుండా అందరూ ఈ త్రాగుడుకు బానిసలవుతున్నారు. నీతి బాహ్య, ఘోర దురాచారం అయిన ఈ మద్యపానం వల్ల ఇల్లూ గుల్లవుతుంది, ఒళ్ళూ గుల్ల అవుతుంది.

సాంఘికంగా, నైతికంగా, ఆర్థికంగా మనిషిని సర్వనాశనం చేసే ఈ మద్యం వ్యాపారం వల్ల ఒక్క మన రాష్ట్ర ప్రభుత్వానికే సాలీనా 700 కోట్ల రూపాయల ఆదాయం వస్తోంది; మరొక 700 కోట్ల రూపాయలు సారాయి కాంట్రాక్టర్ల జేబుల్లోకి పోతున్నాయి. ఈ విధంగా మనం ప్రతి సంవత్సరం 1400 కోట్ల రూపాయల ధనాన్ని కేవలం సారాయి, బ్రాందీల కొరకే ఖర్చు చేస్తున్నామన్నమాట. స్వయంగా ప్రభుత్వమే ఈ అప్రాచ్యపు,

ముదనష్టపు వర్తకానికి పాల్పడుతూ ఉంటే, ఇక దేశం ఎలా బాగుపడు తుంది? సమాజ సంస్కరణ, సత్సమాజ సంస్థాపనం ఎలా సాధ్యమవు తుంది? రాష్ట్రం మొత్తంలో దాదాపు 17542 సారాయి దుకాణాలు, 11375 కల్లు దుకాణాలు, 9230 బ్రాందీ దుకాణాలు రేయిం బవళ్ళు పనిచేస్తున్నాయి. మద్యాన్ని పంపిణీ చేస్తున్నాయి.

ప్రపంచ ఆరోగ్య సంస్థ వారు జరిపిన సర్వే ప్రకారం, ప్రపంచంలో మద్యం ఉత్పత్తి విపరీతంగా పెరిగిపోయిందని, ఒక్క భారత దేశంలోనే ప్రతిరోజు 22 కోట్ల మంది ప్రజలు మద్యాన్ని సేవిస్తున్నారని తేలింది. మన దేశంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరగటానికి కారణం డ్రైవర్లు తప్ప తాగి వాహనాలను నడపటమేనని Central Road Research Institute వారు నిర్ధారించారు. రాత్రి సమయాల్లో రాజధాని ఢిల్లీలో 64 శాతం, మద్రాసులో 20 శాతం, బొంబాయి, కలకత్తాల్లో 60శాతం మంది డ్రైవర్లు త్రాగిన మైకంలో ఉంటారట.

మద్యపానం వల్ల నరాలు దెబ్బతింటాయి. కడుపు ఎర్రగా కందిపోతుంది. ఆకలి ఉండదు. వేళ్ళు, చేతులు వణుకుతాయి. తూలుడు వస్తుంది. పటుత్వం పోతుంది. కొందరికి నపుంసకత్వం కూడా వస్తుంది. ఆలోచనా శక్తి నశిస్తుంది. అనుమానాలు అపోహలు చోటు చేసుకుంటాయి.

మద్యపానం వల్ల కలిగే నష్టాలు అసంఖ్యాకం. మద్యపానం వల్ల మెదడు పూర్తిగా బలహీనపడి పోతుంది. మెదడులోని జీవకణాలు చెడిపోవటమే కాకుండా నాడీ మండలంలోని నరాలన్నీ చెడిపోతాయి. ఆకలి బాగా ఎక్కువై అమితంగా తినటంతో కొవ్వు పెరిగి ఊబ శరీరం రావటం గుండె జబ్బులకు దారి తియ్యటం కూడా జరుగుతుంది.

శరీరంలో వాత ప్రవృత్తి అధికమై రక్తంలో గ్లూకోజు మట్టం బాగా పడిపోయి, మనిషి హఠాత్తుగా మరణించవచ్చు. కాలేయం పూర్తిగా దెబ్బతింటుంది. కడుపులో వికారంగా ఉండి డోకు వచ్చినట్లుంటుంది. కడుపులో మంట, నొప్పి కలుగుతాయి. తిన్న తిండి జీర్ణం కాక పుల్లటి తేపులొస్తాయి. ఈ బాధను మరిచిపోవటానికి ఇంకా త్రాగాలనిపిస్తుంది. ఈథైల్ ఆల్కహాలు గుండె, కండరాలపై నొప్పించే ప్రభావాన్ని చూపుతుంది. హృదయ స్పందనలు క్రమరహితంగా ఉంటాయి.

మద్యపానం వల్ల డిలీరియమ్ ట్రెమెన్స్ పోలీన్యూరోపతి అనే వ్యాధులు వస్తాయి. దీనివల్ల నిద్రలేమి, విశ్రాంతి లేకపోవటం, చెమట ఎక్కువగా పట్టటం, మనస్సు భయంతోను, గాబరాగాను ఉండటం జరుగుతుంది. రానురాను మతిభ్రమణం, నేత్ర, శ్రవణ లోపం కలిగి శరీరపు ప్రతి అవయవం వణకటం, ఉష్ణోగ్రత పెరగటం జరుగుతుంది. ఒళ్ళంతా నొప్పులు, తిమ్మిరి, ఒళ్ళు జలదరింపులతోపాటు మానసిక వ్యాకులత కలుగుతుంది. చికాకు, ఎదుటివారిని పోల్చుకునే జ్ఞానం నశించటం, జ్ఞాపక శక్తి సన్నగిల్లటంతోపాటు మూర్ఛ రోగం కూడా వస్తుంది.

మద్యం సేవించే గర్భిణీ స్త్రీల గర్భంలో ఉన్న శిశువులకు కూడా గ్లూకోజు తగ్గి పెరుగుదల మందగిస్తుంది. వీరిలో గర్భస్రావాలు సర్వ సాధారణం. పోషకాహార లోపం వల్ల నెలలు పూర్తిగా నిండకుండానే ప్రసవిస్తారు. పిల్లలు చాలా తక్కువ బరువుతో పుట్టి వారి పొడవుకూ, బరువుకూ ఉండవలసిన నిష్పత్తి ఉండదు. పుట్టిన పిల్లల్లో ఎన్నో అవలక్ష ణాలు కనిపిస్తాయి. ఈ మద్యం వంశపారంపర్యంగా కొన్ని తరాల వరకు తన చెడు ప్రభావాన్ని కనబరుస్తుందని ప్రయోగాల ద్వారా నిరూపిత మయింది.

కల్లు, సారా, విప్ప పువ్వు సారా, బ్రాందీ, విస్కీ, కోగ్ వాక్, షెర్రి, కేంఫయిన్, ఫోర్టు, రమ్, జిన్– వీటిలో ఏవి తీసుకున్నా ఫలితం ఒక్కటే. వ్యక్తి ఆరోగ్యాన్ని, సమాజం ఆరోగ్యాన్ని సర్వనాశనం చేసే,సకల చెడులకు మూల కారణం అయిన ఈ మద్యపాన పిశాచం నుండి ప్రజల్ని కాపాడటం సాధ్యం కాదా? మద్యపానం ఒక భయంకరమైన చెడు అనే చైతన్యాన్ని ప్రజలకు కలుగజేసి, దాన్ని రూపుమాపుదామని అమెరికా మాజీ అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ మహాశయుడు ప్రబల ప్రయత్నం చేశాడు; మద్యపానాన్ని నిషేధించాడు. మద్యం తయారుచేసేవారి పట్ల కఠినంగా వ్యవహరించాడు; మద్యపానం వల్ల కలిగే నష్టాలను గురించి కరపత్రాల ద్వారా, నాటకాల ద్వారా ఉధృతంగా ప్రచారం చేయించాడు; కోట్ల రూపాయలు ఖర్చు చేశాడు; అయినా ప్రజలు దొంగతనంగా మద్యాన్ని సేవించసాగారు. చివరకు మద్యపాన నిషేధాన్ని ఎత్తివేశాడు. గాంధీజీ ఒకసారి, 'ఒక గంట సేపు నేను భారతదేశపు నియంతను కాగలిగితే అన్ని కల్లు, సారాయి దుకాణాలను నష్టపరిహారం లేకుండానే మూయించి వేస్తాను. దేశంలోని తాటిచెట్లనన్నింటినీ నరికించి వేస్తాను' అని కోపంతో అన్నారు.

ప్రజలు మద్యపానానికి దాసులు కాకుండా ఉండాలంటే, వారిలో దైవభక్తి అనే మహత్తరమైన సుగుణాలు కలగాలి. దేవుడు ఉన్నాడని, ఆయన సృష్టికర్త అనీ, అన్నీ చూస్తాడు, అన్నీ వింటాడని, మానవుడు చేసేది, చెప్పేది అంతా వ్రాయబడుతోందని; మరణానంతరం మళ్ళీ బ్రతికి లేవవలసి ఉన్నదని; అప్పుడు దైవానికి సమాధానం చెప్పుకోవలసి ఉన్నదని, దేవుడు మద్యపానాన్ని నిషేధించాడని, మద్యం సేవిస్తే శిక్షిస్తాడని, అసలు జీవితం, శాశ్వతంగా ఉండే జీవితం పరలోక జీవితమని, ఈ జీవితం

తాత్కాలికమని మనిషి నమ్మాలి, విశ్వసించాలి. ఈ భయమే, ఈ బాధ్యతా భావమే మనిషిని మద్యపానంతో పాటు ఇతర చెడుల నుంచి, పాపాల నుండి కాపాడగలుగుతుంది.

దివ్యగ్రంథంలో దేవుడు 'విశ్వసించిన ఓ ప్రజలారా! సారాయి, జూదం అసహ్యకరమైన షైతానీ పనులు. వాటిని విసర్జించండి, మీకు సాఫల్య భాగ్యం కలిగే అవకాశముంది అని సెలవిచ్చాడు. ఈ దైవాజ్ఞ అవతరించగానే మహాప్రవక్త ముహమ్మద్ (స) ఎవరి వద్దనైతే సారాయి ఉందో వారు దాన్ని త్రాగటానికి వీల్లేదు, అమ్మటానికి వీల్లేదు. దాన్ని పారవేయండి అని ప్రకటించారు. అప్పుడు ముస్లింలు తమ వద్ద ఉన్న సారాయి కుండల్ని పగులగొట్టారు. మక్కా వీధుల్లో మద్యం ఏరులై పారింది. దైవభయం అనే మహత్తరమైన గుణం ఒక్కటే మనిషిని సౌశీల్య వంతుడుగా బాధ్యతాయుతమైన వ్యక్తిగా తీర్చిదిద్ద గలుగుతుంది.

('గీటురాయి' వారపత్రిక 20-11-1987)

"మాకు వ్యభిచారం చేసే హక్కు కావాలి"

- నవభారత వనితరా వాణి

మొన్నీ మధ్య రాష్ట్ర రాజధానిలో ఒక రాష్ట్ర స్థాయి మహిళా సదస్సు రెండు రోజులపాటు సుగంధ పరిమళభరిత, సుహృద్భావ పూరిత వాతావరణంలో జరిగింది మరియు ముగిసింది. అందులో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి జనార్ధన్‌రెడ్డి, రాష్ట్ర సంక్షేమ మంత్రిణి రొడామిస్త్రీ, వివిధ రంగాల్లో నిష్ణాతులైన అతివలు, వివాహితులు, అవివాహితులు, యువకులు, ముదుసలి మగువలు ఎంతోమంది పాల్గొన్నారు. రెండు రోజుల సుదీర్ఘ సమాలోచనల అనంతరం ఈ మహిళావాణి ముక్తకంఠం తో మిన్ను ముట్టేవిధంగా కొన్ని నినాదాలు చేసింది. వాటిలో ప్రముఖ మైనది, చర్చనీయాంశం కాదగ్గది, 'వ్యభిచారాన్ని చట్టబద్ధం చెయ్యాలి' అనేది. మహిళా సదస్సు వారి ఈ నినాదంలో, ఈ సిఫారసులో ఉద్రేకం పాలు ఎంత, వివేకం పాలు ఎంత, ఇది ఆచరణ యోగ్యమైనదేనా, ఇది స్త్రీ జనాభ్యుదయానికి దోహదం చేస్తుందా, దీనివల్ల మానవ సమాజంపై మానవ సంబంధాలపై ఎటువంటి ప్రభావం పడుతుంది అనే విషయాలను గురించి ఆలోచిద్దాం.

వ్యభిచారం అంటే, ధర్మసమ్మతమైన వైవాహిక సంబంధం లేకుండా ఒక స్త్రీ, ఒక పురుషుడు పరస్పరం సంభోగించటం లేక లైంగిక సంబంధాలు కలిగి ఉండటం అని అర్థం. ఆది నుండి నేటి వరకు మానవ

సమాజాలన్నీ దాన్ని ఒక చెడుగా, ఒక పాపంగా, ఒక తప్పుగా ఒక అభ్యం తరకరమైన చేష్టగా పరిగణిస్తూ వచ్చాయి. ఎవరో కొద్దిమంది విశృంఖల భోగలాలసులు తప్ప, అన్ని మతాల వారు, అన్ని వర్గాల వారు ఈ భావంతో ఏకీభవించరు. స్వయంగా మానవ ప్రకృతే దీన్ని ఒప్పుకోదు, భరించదు. ప్రతి మానవుడు దాన్ని ఖండిస్తాడు, అదంటే అసహ్యించు కుంటాడు. ఒకసారి ఒక యువకుడు మహాప్రవక్త ముహమ్మద్(స) వద్దకు వచ్చి వ్యభిచారం చెయ్యటానికి అనుమతిని కోరాడు. అతని ఈ అసభ్య ప్రసంగానికి ప్రవక్త ప్రత్యక్ష సహచరులు మండిపడ్డారు. కాని ప్రవక్త అతన్ని తమ దగ్గరకు పిలిచి కొన్ని ప్రశ్నలు వేశారు.

ప్రవక్త : నిన్ను కన్న తల్లి వ్యభిచారానికి పాల్పడితే నువ్వు దాన్ని భరించగలవా?

యువకుడు: లేదు, ప్రవక్తా లేదు.

ప్రవక్త : నీలాగే ఇతరులు కూడా తమ తల్లులు వ్యభిచారం చెయ్యటాన్ని భరించలేరు.

ప్రవక్త : నీ కుమార్తె వ్యభిచారం చెయ్యటం నీకు ఇష్టమేనా?

యువకుడు : లేదు, ప్రియమైన ప్రవక్తా లేదు.

ప్రవక్త : నీ మాదిరిగానే ఇతరులు కూడా తమ కుమార్తెలు వ్యభిచరించటాన్ని సహించరు.

ప్రవక్త : నీ చెల్లెలు వ్యభిచారం చేస్తే నువ్వు సహించగలవా?

యువకుడు : లేదు ప్రవక్తా లేదు, నేను సహించలేను.

ప్రవక్త : అదే మాదిరిగా, ఇతరులు కూడా తమ చెల్లెళ్ళ విషయంలో వ్యభిచారాన్ని సహించలేరు.

ప్రవక్త : ఈ దుష్టకార్యాన్ని నీ ఆంటీ చెయ్యటం నీకిష్టమేనా?

యువకుడు : లేదు, ప్రవక్తా లేదు

ప్రవక్త : ఇతరులు కూడా తమ ఆంటీ ఈ దౌష్ట్యానికి పాల్పడటాన్ని సహించలేరు.

తరువాత మహాప్రవక్త (సఅసం) ఆ యువకుని కొరకు ప్రార్థించారు. *(తఫ్సీర్ ఇబ్నె కసీర్, వాల్యూమ్-3, పేజీ- 38)*

జన్మత: మానవుడు వ్యభిచారాన్ని సహించడు అనే విషయం మనకు ఈ హదీస్ ద్వారా అర్థమవుతున్నది. మానవుడి మనసు పవిత్రత వైపునకే, సక్రమ లైంగిక సంబంధాల వైపుకే ఎక్కువగా మొగ్గుతుంది. కాని పరిస్థితులు పరిసరాలు అతన్ని భ్రష్టుడుగా, దుష్టుడుగా చేస్తయ్. ఈ సందర్భంలో స్త్రీ పురుషులు స్వేచ్ఛగా తిరగటం సినిమాలు, సంగీత, నృత్య ప్రదర్శనలు, మత్తుపానీయాలు, స్త్రీల అర్థనగ్న వస్త్రధారణ, అశ్లీల సాహిత్యం, స్త్రీ పురుషులు కలిసి చదువుకోవటం, క్లబ్బులు, ఎక్కువ సంపద వంటి విషయాలను ప్రత్యేకంగా పేర్కొనాలి.

మానవ జాతి మనుగడకు, సభ్య మానవ సమాజ సంస్థాపనానికి, వ్యభిచారం తీవ్ర విఘాతం. కేవలం కామవాంఛల్ని తీర్చుకునే, తాత్కాలిక సుఖాన్ని జుర్రుకునే నియమ నిబంధనా రహిత స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు స్త్రీ పురుషులకు ఉంటే, వివాహమనే పవిత్ర, ఉన్నత బంధం లేకపోతే 'పుట్టే పిల్లల తండ్రులెవరు, వారిని ఎవరు సాకాలి, ఎవరు పోషించాలి, వారి భావి జీవితాలను తీర్చిదిద్దే బాధ్యత ఎవరిది" అనే సమస్యలు ఉత్పన్నమై సమాజంలో సంక్షోభం చెలరేగుతుంది, 'సంకర మానవ జాతి' ఉనికిలోకి వస్తుంది. 'నా భార్య, నా పిల్లలు, నా గృహం' అనే మానవ సహజమైన సున్నిత పవిత్ర భావం నశిస్తుంది, మానవులు దానవులవుతారు, అడవి మనుషులుగా మారిపోతారు, కనుకనే ఖుర్ఆన్ వ్యభిచారాన్ని, 'వాస్తవంగా అది ఒక నైచ్యం, ఒక దుష్టమార్గం' అని వర్ణిస్తుంది. ఒక హదీసులో మహా

ప్రవక్త(స) 'వ్యభిచారం చేసేటప్పుడు ముస్లిం నుండి విశ్వాసం (ఈమాన్) వేరు చేయబడుతుంది' అని అన్నారు. మరొక హదీసులో ఆయన "రక రకాల పాపాలకు రకరకాల శిక్షలు ఆకాశం నుండి అవతరిస్తయ్. ప్లేగు వ్యాధి (Black Death) వ్యభిచారం మూలంగానే అవతరించింది" అని అన్నారు. ఒక మహానుభావుడు ఇలా అన్నారు: 'వ్యభిచారం చేసే మనిషి వయస్సు క్షీణిస్తుంది, సంపాదన తగ్గుతుంది. ముఖవర్చస్సు పోతుంది. వ్యభిచారం వల్ల సిఫ్లీన్, గనేరియా, బాన్క్రాయిడ్, గర్భస్రావం లాంటి వ్యాధులు వస్తాయి. ఈ వ్యాధులు వారసులకు సంక్రమిస్తయ్, వంశ నాశనానికి నాందీ వాచకం పాడ్తయ్, కనుకనే ఇస్లామీ ధర్మశాస్త్రం వ్యభిచార నేరానికి కఠినమైన శిక్ష విధిస్తుంది, వివాహితులు వ్యభిచారం చేస్తే, వారి నేరం నిరూపించబడితే వారిని బహిరంగంగా నడిబజారులో రాళ్ళతో కొట్టి చంపటం జరుగుతుంది. అవివాహితులు వ్యభిచారానికి పాల్పడితే వారి నేరం నిరూపించబడితే వారికి నూరు కొరడా దెబ్బల శిక్ష విధించబడుతుంది.

ప్రస్తుత నవ నాగరిక ప్రపంచంలో ప్రజలు వ్యభిచారాన్ని చాలా తేలిగ్గా తీసుకుంటున్నారు. దాన్ని ఒక తప్పుగా భావించటంలేదు. స్త్రీ పురుషులు కళ్ళెం లేని గుర్రాల మాదిరిగా స్వైర విహారం చేస్తున్నారు. నీతి నియమాలను పాటించటంలేదు. తుచ్ఛ కామతృష్ణకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. విద్యావంతులైన స్త్రీలే వ్యభిచారాన్ని చట్టబద్ధం చెయ్యమంటు న్నారంటే, పరిస్థితులు ఎంత విషమించాయో విజ్ఞులు గమనించాలి. ఒక కమ్యూనిస్టు దేశంలోనైతే వివాహానికి ముందే యువతీ యువకుల్ని మూడు నెలల వరకు ఒకే గదిలో ఉంచుతారు. వారిద్దరి అభిరుచులు కలిస్తేనే వివాహం, లేకపోతే వివాహం లేదు గివాహం లేదు. అంతే సంగతులు.

క్యాపిటలిస్టు దేశంలోనైతే వివాహితులు, అవివాహితులు అయిన స్త్రీ పురుషులు ఒకచోట సమావేశమై నడిరేయి పోయే వరకు తాగి తందనా లాడి, తరువాత కరెంటు దీపాలన్నీ ఆర్పేసి, చీకట్లో వావివరుసలు లేకుండా అక్రమంగా వ్యభిచరిస్తారు. ఎన్నో పాశ్చాత్య దేశాల్లో వ్యభిచారం చట్టబద్ధం చెయ్యబడింది. ఏ ఒక్క పత్రికా ఇంతవరకూ మహిళా సదస్సు వారు చేసిన ఈ సిఫారసును ఖండించలేదు అంటే పత్రికలు నైతికంగా ఎంత దివాలా తీశాయో అర్థం చేసుకోవచ్చు.

బొంబాయి, ఢిల్లీ, కలకత్తా, మద్రాసు నగరాల్లో ఉన్న విశ్వవిద్యాలయాల్లో జరిగిన సర్వేలో నలభై నుండి అరవై శాతం విద్యార్థులు, విద్యార్థినులు వ్యభిచారం చేసేవారని తేలింది. సమాజం నైతికంగా ఆధ్యాత్మికంగా ఇంతగా కుళ్ళిపోతూ ఉంటే, రాజకీయ నాయకులు అధికారం కోసం పరస్పరం కొట్టుకు చస్తున్నారు. అలనాడు సీతారాముడు సీతాదేవి మాన సంరక్షణార్థం రావణాసురునితో యుద్ధం చేశాడు. పంచభర్తృక పాంచాలి వలువల్ని నిండు కొలువులో దుశ్శాసనుడు వలిచాడని కురుక్షేత్ర సంగ్రామం జరిగింది. అయితే నవభారత వనితలు మేము 'మా మానాన్ని అమ్ముకుంటాం, మా వలువల్ని వలిపించుకుంటాం' అంటున్నారు. సదస్సులో పాల్గొన్న మంత్రి గారు, మంత్రిణి గారు సదస్సు చేసిన ఈ సిఫారసుకు వ్యతిరేకంగా ఒక్కమాట కూడా పలక్కపోవటం కడు శోచనీయం. *('గీటురాయి' వారపత్రిక: 9-3-1979)*

ముస్లిం సమాజ లక్షణాలు

మొన్నీ మధ్య నేను ఆంధ్రప్రదేశ్‌లోని ఓ పట్టణానికి వెళ్ళాను సొంత పనిపై. నాలుగు లక్షల జనాభాతో, ఇరవై వేల మంది కాలేజీ విద్యార్థులతో, ఆసుపత్రులతో, ఒక పెద్ద బస్సు స్టాండ్‌తో కిటకిటలాడే ఆ నగరానికి ఒక మహా పట్టణానికుండవలసిన లక్షణాలన్నీ ఉన్నయ్. కాంపోజిట్ మద్రాస్ రాష్ట్రం నుండి ఆంధ్ర ప్రాంతం చీలినప్పుడే అది అప్పటి ఆంధ్ర రాష్ట్రానికి రాజధాని అయి ఉంటే, ఒక అపురూపమైన పట్టణంగా రూపొంది ఉండేది.

పనులన్నీ పూర్తయ్యేటప్పటికీ సూర్యుడస్తమించాడు. మగ్రిబ్ నమాజుకు టైమ్ అయింది. పక్కవీధిలో ఉన్న మసీదుకు పరుగెత్తాను. మౌజన్ మధురంగా అజాన్ ఇస్తూ నమాజ్‌కు రమ్మని, సాఫల్యం వైపుకు రమ్మని ఆహ్వానిస్తున్నాడు. మసీదు పక్కనే ఉన్న ఒక ఇంటి ముందు పందిరి కింద ఒక కుర్చీపై కూర్చున్న ఒక స్త్రీ అజాన్ వింటూ తన చీరెకొంగును ఎంతో భక్తి ప్రపత్తులతో తలపై వేసుకుంది. బేరంలో మునిగివున్న ఆ స్త్రీకి ఇస్లాం మతం అంటే ఎంత అభిమానం, ఎంత ప్రేమ అని సంబరపడ్డాను. నమాజును ముగించుకుని బయటికి వచ్చిన తరువాత చూద్దును కదా! ఆ ఇంటి ముందు తాగుబోతులు తెగ వాగుతున్నారు. ఆరా తీస్తే తెలిసిందేమిటంటే, భక్తిభావంతో తన చీరె కొంగును తలపై కప్పుకున్న వనిత సారాయి దుకాణం నడిపే ముస్లిం స్త్రీ. మసీదు పక్కన సారాయి దుకాణం, ఆ సారాయి దుకాణాన్ని నడిపేవాళ్ళు ముస్లిములు. సారాయి పోసే వాళ్ళు ముస్లిం మగువలు. నేను బిత్తరపోయాను. నా పాదాల క్రింద భూమి

కంపించింది. అయినా ఒక ఆశాకిరణం మెరిసింది. పాపం చేస్తున్నా,సరే, ఆ స్త్రీకి అజాన్ అంటే, నమాజ్ అంటే ఎంత గౌరవం, ఎంత భక్తి! ఆమె హృదయంలో దైవభక్తి, దైవ భయం ఉన్నయ్. అయితే సంపాదన కొరకు ఆమె అవలంబించిన మార్గం పాపం అని, అల్లాహ్ దాన్ని నిషేధించాడని ఆమెకు తెలుసో తెలియదో; ఎవరైనా ఆమెను కలుసుకుని హితోపదేశం చేస్తే ఎంత బాగుండును. ఈ మసీదు ఎక్కడ ఏ వీధిలో ఉంది అనే విషయం అంత ముఖ్యం కాదు. ఈ చెడు ఎక్కడున్నా దాన్ని మనం రూపు మాపాలి.

ముఖ్యంగా ఆంధ్ర ప్రాంతంలోని ముస్లింలు తమ విద్యా విషయాలలో ఎంతో వెనుకబడి ఉన్నారు. పాపం వారికి ఇస్లాం అంటే ఏమిటో, ముస్లిం అంటే ఎవరో, హరామ్ హలాల్‌లు, జాయజ్ నాజాయజ్ (ధర్మ సమ్మతమ యినవి, నిషిద్ధమయినవీ) విషయాలు ఏమిటో స్పష్టంగా తెలియవు. అసలు వాళ్ళకు ఇస్లాం గుర్తుకొచ్చేది వివాహ మహోత్సవ శుభ సందర్భాన మరియు మనిషి ఈ ప్రపంచాన్ని విడిచిపోయే అశుభ సమయాన, అది ఏ ఊరు నుంచో ఖాజీ గారో లేక సాయెబ్ గారో, ముఅజ్జన్ గారో వచ్చి ఈ తతంగాన్ని నిర్వహించి వెళ్ళిపోతారు. మళ్ళీ షరా మామూలే, అవే ఇస్లాం విరుద్ధమైన ఆచారాలు, వ్యవహారాలూను. తిరుపతి వెంకటేశ్వర విగ్రహాన్ని మొక్కే ముస్లింలు, వెంట్రుకలు ఇచ్చి రావటానికి తిరుపతికి వెళ్లే ముస్లింలు, పాము పుట్టలో పాలుపోసే ముస్లింలు ఉన్నారంటే ఆశ్చర్యపడవలసిన పనిలేదు. ఎందుకంటే పాపం వారికి సరైన ఇస్లామీ ధర్మజ్ఞానం లేదు. తెలియక పాపం చేస్తే కరుణామయుడైన అల్లాహ్ క్షమిస్తాడు. ధర్మజ్ఞానం పొందే భాగ్యాన్ని కలుగజేస్తాడు. తెలిసీ, బుద్ధి పూర్వకంగా దైవాజ్ఞోలంఘనానికి పాల్పడితే దైవం శిక్షిస్తాడు.

ఆంధ్ర ప్రాంతంలో ముస్లింలు ఉండే మసీదులు లేని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. ఈ గ్రామాలలో ఉండే ముస్లింలకు అసలు ఇస్లాం అంటే ఏమిటో తెలియదు. వారి వేషభాషలు, ఆచార వ్యవహారాలు, అలవాట్లు

చూస్తే వారు తమ పేరు చెబితేగాని మనకు వారు ముస్లింలని తెలిసిరాదు. వారి స్త్రీలు పరదా పద్ధతిని పాటించరు. దుప్పటి కప్పుకోకుండానే ప్రయాణం చేస్తారు. పొలాలకు కూలి పనికి పోతారు. వారి ఇళ్ళల్లోకి బంధువులు కాని, ముస్లింలు గాని, ముస్లిమేతరులు గాని, అనుమతి లేకుండానే యథేచ్ఛగా వస్తూ పోతూ ఉంటారు. వారి ఇళ్ళల్లో పేదరికం తాండవిస్తూ ఉంటుంది. వారికంటే వెనుకపడ్డవారు భారతదేశంలో మరొకరు లేరు. మొహర్రం మాసంలో పీర్ల పండుగ చెయ్యటం, పీర్లు పట్టుకుని ఎగరటం, మొక్కుబళ్ళు మొక్కుకోవటం, సంవత్సరానికొకసారి ఉరుసుల్లో పాల్గొనటానికి దర్గాలకు పోవటం, తిరనాలలో పాల్గొనటం, శుభకార్యాలు ప్రారంభించే ముందు కొబ్బరికాయలు పగులగొట్టటం, గృహ నిర్మాణ విషయాలలో సిద్ధాంతి గారిని సంప్రదించటం, ప్రయాణం చేసే ముందు వర్జాన్ని, నక్షత్రాన్ని చూడటం, వితంతువు, పిల్లి ఎదురొస్తే ప్రయాణం మానుకోవటం, తుమ్మినా దగ్గినా సందేహించటం, శంకలకు గురికావటం, సరిసంఖ్యల్ని గౌరవించి బేసి సంఖ్యల్ని విసర్జించటం, కట్నాలను, కానుకలను, ఇతర లాంఛనాలను పాటించటం, త్రాగుడు, జూదం, వ్యభిచారం, దొంగ సాక్ష్యం వంటి చెడులకు దాసులు కావటం, వడ్డీని, వడ్డీ వ్యాపారాన్ని పాపంగా భావించకపోవడం, పినతండ్రి కూతుర్ని వివాహం చేసుకోవటం పాపమనుకోవటం – ఇవి ఇంకా ఇటువంటి ఎన్నో చెడులు, దురాచారాలు పాపాలు వారిలో చోటుచేసుకున్నాయి. ఇతర ప్రాంతాలలో ఉన్న ముస్లింలలో ఇవి లేవని కాదు. ఉన్నాయి. ఎక్కువ తక్కువల భేదమే. ఇస్లామీ ధర్మ ప్రచారం చేసే వారికి ఇదొక సవాలు. ఈ ముస్లిం సోదరుల కొరకు వారు ఎనలేని త్యాగాలు చేయవలసి ఉంది. వారిని నిజమైన ముస్లింలుగా తీర్చిదిద్దటం, ఇస్లామీ ధర్మజ్ఞానం పొందే అవకాశాలను వారికి కల్పించటం, ఇది నిజంగానే మహత్తరమైన పుణ్యకార్యం. ఉదాహరణకు, గుంటూరు జిల్లాలో ఉన్న 728 గ్రామాల్లోని 690 గ్రామాలలో ముస్లింలు ఉన్నారు. కాని మసీదులు లేని గ్రామాలు

ఎన్నో ఉన్నాయి. మసీదులున్నా ఐదు పూటలు నమాజు చెయ్యబడని, రెండు పూటల నమాజులు మాత్రమే చెయ్యబడే కేవలం శుక్రవారం నమాజు మాత్రమే జరిగే మసీదులు ఉన్నాయంటే అందులో అతిశయోక్తి ఎంతమాత్రం లేదు.

ముఖ్యంగా గ్రామాలలో ఉండే ముస్లింలలో ఐకమత్యం లేదు. దాదాపు అన్ని గ్రామాలలో ముఠాలున్నాయి. ఒక గ్రామంలోనైతే నాలుగు ముఠాలున్నాయి. ఆ గ్రామంలో ఉంది నూటపాతిక ఇళ్ళు మాత్రమే. పండుగలకు వేర్వేరుగా పోతారు. రైట్ కమ్యూనిస్టు పార్టీలో కొందరుంటే, లెఫ్ట్ కమ్యూనిస్ట్ పార్టీలో కొందరు, జాతీయ కాంగ్రెస్‌ను కొందరు బల పరిస్తే, ఇందిరా కాంగ్రెస్‌ను కొందరు, జనతాలో కొందరుంటే, మతతత్వ పార్టీలలో కొందరు - ఈ విధంగా ముస్లిం సమాజం ఛిన్నాభిన్నమై పోయింది. అస్తవ్యస్తంగా ఉంది. వారు ఖుర్ఆన్‌ను చదవరు, చదివినా దానిపై నడవరు. అల్లాహ్ అందులో హెచ్చరిక చేశాడు : 'విశ్వాసులారా! అల్లాహ్ త్రాటిని ధర్మాన్ని గట్టిగా పట్టుకోండి. విభేదాల్లో పడకండి.' అల్లాహ్ గ్రంథం ప్రకారం నడిస్తేనే ముస్లిం సమాజంలో ఐకమత్యం వర్ధిల్లుతుంది. ఐకమత్యం ఉంటేనే దానికి ఉజ్వలమైన భవిష్యత్తు.

హైదరాబాద్‌లో ఒకరోజు రిక్షాలో ఒక సినిమా హాలు ప్రక్కగా పోతూ నేను చూసిన ఒక దృశ్యం నన్ను దిగ్భ్రమలో ముంచెత్తింది. సినిమా టికెట్ల కోసం క్యూలో నిలబడి ఉన్న, బురఖాల్లో ఉన్న స్త్రీల సంఖ్య దాదాపు యాభై ఐదు. ఈ విధంగా, ఇంత విచ్చలవిడిగా ముస్లిం స్త్రీలు దాదాపు అన్ని ప్రాంతాలలో సినిమాలకు పోతున్నారు. ఇది ముస్లిం సమాజానికి అంత శుభ సూచకం కాదు. కొంతకాలం తరువాత బురఖాలూ పోతై. బురఖాల్లో ఉన్న బూబమ్మలూ పారిపోతారు. అల్లాహ్ రక్షించుగాక! ఆయన కారుణ్య వర్షం ముస్లిం సమాజాన్ని పునీతం చేయుగాక!

('గీటురాయి' వారపత్రిక : 11-5-1979)

స్త్రీకి ఉన్నతమైన స్థానాన్ని ప్రసాదించే మతం

'వార్త' దినపత్రికలో గత నెల 16వ తేదీన వచ్చిన వ్యాసాన్ని చూస్తే, కొట్టొచ్చినట్లు కనిపించే విషయం ఏమిటంటే– సజల నయనాలతో అత్యంత దీనావస్థలో ఉన్న భీతహరిణలాంటి ఒక ముస్లిం మహిళ ఫోటో, తరువాత ఒక పంజరం, ఆ పంజరంలో ఒక చిలుక, ఆ తరువాత ఆ పంజరం కఠినుడుగా క్రూరుడుగా కనిపించే గడ్డం వున్న ఒక ముస్లిం పురుషుని చూపుడు వ్రేలుపై ఉండటం. అంటే ముస్లిం స్త్రీలు ముస్లిం పురుషుల చేతుల్లో బందీలుగా ఉన్నారని, వారిని తక్షణం రక్షించటం అత్యంతావశ్యకమనీ రచయిత జయగోపాల్ గారి ఉద్దేశ్యం.

ఇస్లాంలో, ముస్లిం సమాజంలో స్త్రీలకు అసలు ఏమాత్రం గౌరవం లేదనీ, వారిని రాళ్ళుగా, రప్పలుగా విలాస వస్తువులుగా మాత్రమే చూస్తారనీ, వారికి స్వేచ్ఛ లేదనీ పఠితలు భావించే రీతిలో ఆ వ్యాసం సాగిపోతుంది. ఇంకా రచయిత ఇస్లాంను, ముస్లింలను కించపరుస్తూ సత్య దూరమైన ఎన్నో విషయాలను వ్రాశారు; ఎన్నో వక్రీకరణలకు పాల్పడ్డారు. ఈ వ్యాసంలోని విషయాల ప్రామాణికతను గురించి ముస్లిం పండితులెవరినీ సంప్రదించకుండానే పత్రికలో ప్రచురించటం వల్ల లక్షలాది మంది ముస్లిం స్త్రీపురుషుల మనోభావాలు దెబ్బతిన్నాయి; వారు తీవ్రమైన ఆవేదనకు, ఆందోళనకు గురి అయ్యారు, తమ మత విశ్వాసాలను హేళన

చేసినట్లు, తూలనాడినట్లు భావించారు. నిస్సందేహంగా ఈ వ్యాసం మతోద్రేకాలను రెచ్చగొట్టింది.

ఇస్లామ్ ధర్మానికి మూలాధారాలు దివ్యఖుర్‌ఆన్ గ్రంథం, మహా ప్రవక్త ముహమ్మద్(స) గారి హితోపదేశాలు. దైవానుగ్రహం వల్ల ఇవి ఎటువంటి మార్పులకూ చేర్పులకూ గురికాకుండా సురక్షితంగా వున్నాయి. వాటి అనువాదాలు దాదాపు అన్ని జాతీయ భాషల్లో లభిస్తున్నాయి. ఇస్లామ్‌ను గురించి ఏదైనా వ్యాసం వ్రాయదలిస్తే, ఏదైనా సమీక్ష చేయదలిస్తే ఈ గ్రంథాలను అధ్యయనం చెయ్యాలి; అర్థం చేసుకోవాలి. అవసరమయితే ముస్లిం విద్వాంసులను సంప్రదించాలి. మొత్తం వ్యాసంలో దివ్య ఖుర్‌ఆన్ గురించి ఒకే ఒకచోట రచయిత ప్రస్తావించారు. అదీ తప్పుడు అనువాదం చేశారు, విశృంఖలంగా చేశారు. ఆ అర్థం కల వాక్యం గ్రంథంలో ఎక్కడా లేదు. ఖురాన్ జ్ఞాన శూన్యుడైన రచయిత ఎంతటి దుస్సాహసానికి పాల్పడ్డారు!

'ఇస్లాం స్త్రీకి సమానత్వం ప్రసాదించలేదు. ఆమెకు ఆర్థిక స్వాతంత్ర్యం లేదు. ఆమె పీడనకు గురి అవుతోంది' అని రచయిత వాపోయారు. ఈ విషయం వ్రాసే ముందు కనీసం ఒక్క ముస్లిం మహిళనైనా కలిసి మాట్లాడితే బాగుండేది. లేదా ఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది అని ఒక్క ఖుర్‌ఆన్ వాక్యాన్ని ఉటంకించినా బాగుండేది. ఇలా చెయ్యకుండా కేవలం ఊహాగానాలు చేశారు; అభాండాలు వేశారు. స్త్రీలను గురించి దివ్య ఖుర్‌ఆన్‌లో దేవుడు, మహనీయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు.

1. పురుషులకు మహిళలపై ఉన్నటువంటి హక్కులే ధర్మం ప్రకారం మహిళలకు కూడా పురుషులపై వున్నాయి. (బఖరా : 228)

2. స్త్రీలు మీకు దుస్తుల వంటివారు; మీరు స్త్రీలకు దుస్తుల వంటి వారు. (బఖరా : 187)

3. దానధర్మాలు చేసేవారూ, ఉపవాసం ఉండేవారూ, తమ మర్మాంగాలను కాపాడుకునేవారు, అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించేవారూ అయిన స్త్రీ పురుషుల కోసం అల్లాహ్ క్షమాభిక్షనూ, గొప్ప ప్రతిఫలాన్నీ సిద్ధపరచి ఉంచాడు. (అహ్‌జాబ్ : 35)

4. తల్లిదండ్రులు, దగ్గరి బంధువులు విడిచి వెళ్ళిన ఆస్తిలో పురుషులకు భాగం వుంది. అదేవిధంగా తల్లిదండ్రులు, దగ్గరి బంధువులు విడిచి వెళ్ళిన ఆస్తిలో స్త్రీలకు కూడా భాగం వుంది. అది తక్కువైనా సరే, ఎక్కువైనా సరే. ఈ భాగాన్ని అల్లాహ్ నిర్ణయించాడు. (అన్నిసా : 7)

ముహమ్మద్(స) ప్రవచనాలలో–

1. తల్లి పాదాల క్రింద స్వర్గం ఉంది.
2. ముస్లిం స్త్రీ పురుషులు ఉభయులూ తప్పనిసరిగా జ్ఞానం సముపార్జించుకోవాలి.
3. స్త్రీలను గౌరవ భావంతో చూడమనీ, వారిని ఆదరించమనీ అల్లాహ్ ఆజ్ఞాపించాడు. ఎందుకంటే వారు మనకు తల్లులు, కూతుళ్ళు, పిన్నమ్మలు.
4. ఈ ప్రపంచమూ, ఈ ప్రపంచంలోని అన్ని వస్తువులూ ఎంతో విలువైనవి, అమూల్యమైనవి. కాని ప్రపంచంలో సౌశీల్యవంతురాలైన స్త్రీ అన్నిటికంటే విలువైనది, అమూల్యమైనది.

5. అందరికంటే ఎక్కువ సత్ప్రవర్తన గలవారే పరిపూర్ణులైన విశ్వాసులు. తమ భార్యల దృష్టిలో ఎవరైతే ఎక్కువ మంచివారో, వారే మీలో అందరికంటే మంచివారు.

6. స్త్రీల విషయంలో అల్లాహ్‌కు భయపడండి.

7. స్త్రీ గృహ సామ్రాజ్యానికి మహారాణి.

8. ఒంటెలపై ప్రయాణం చేసే స్త్రీలను గురించి ఆయన(స) ఇలా అన్నారు: 'ఒంటెలను తొందర తొందరగా పరుగెత్తించకండి. వాటిమీద నాజూకైన గాజు బొమ్మలు వున్నాయి. అవి పగిలి పోతాయి.'

ఖలీఫా హజ్రత్ ఉమర్(ర) ఇలా అన్నారు: "మేము మా స్త్రీలను హీనంగా చూసేవారము. ఖుర్‌ఆన్ వచ్చిన తరువాతనే మేము వారిని మనుషులుగా చూడటం ప్రారంభించాము."

దివ్యఖుర్‌ఆన్‌లోని పై వాక్యాలను, ముహమ్మద్ ప్రవక్త(స) పవిత్ర ప్రవచనాలను చూస్తే, ఇస్లాం మహిళలకు ఎంత గౌరవాన్ని ఇచ్చిందో, ఎంత ప్రాముఖ్యాన్ని ఇచ్చిందో మనకు అర్థమవుతుంది.

ఇస్లాం ధర్మం ప్రకారం స్త్రీకి తండ్రి ఆస్తిలో, తల్లి ఆస్తిలో, భర్త ఆస్తిలో, కుమారుల ఆస్తిలో, అన్నాతమ్ముళ్ళు, అక్కా చెల్లెళ్ళ ఆస్తిలో భాగం వుంది. ఇది ఆమె జన్మహక్కు. ఆమె వ్యాపారం చెయ్యవచ్చు. సొంత ఆస్తిని కలిగి వుండవచ్చు. స్త్రీ అంగీకారం లేనిదే ఆమె వివాహం కాదు. తనకు భర్త కాబోయే వ్యక్తిని ఆమె తన వివాహానికి ముందే చూడవచ్చు.

'ఇస్లాం ధర్మ సూత్రాలన్నీ ప్రాచీన యూదుల ధర్మసూత్రాలపై ఆధార

పడ్డవే' అని కూడా శ్రీ జయగోపాల్ సెలవిచ్చారు. దీన్నిబట్టి రచయితకు ఇస్లామ్ ధర్మసూత్రాలూ తెలియవు. యూదు ధర్మసూత్రాలూ తెలియవని బోధపడుతుంది. ప్రవక్త కాలం నాటి యూదులకూ కలగని అభ్యంతరం రచయితకు కలగటం ఆశ్చర్యకరం కదూ?!

ఇస్లాం ధర్మం కొత్త ధర్మమూ కాదు, ముహమ్మద్(స) ప్రవక్తతో మాత్రమే ప్రారంభమూ కాలేదు. ఇస్లాం ఆది మానవులైన ఆదమ్ హవ్వాలు ఏనాడయితే ఈ భూమండలంపై తమ పవిత్రమయిన పాదాలను మోపారో, ఆనాటి నుంచే అది ప్రారంభమయింది. కనుక ఆది మానవుడైన ఆదమ్(అ) మొట్టమొదటి దైవప్రవక్త. ఒక లక్షా 80వేల మంది దైవప్రవక్తలను దేవుడు మానవుల మార్గదర్శకత్వం కోసం అన్ని కాలాలలో అన్ని ప్రాంతాలకూ పంపాడు. అలా వచ్చిన దైవప్రవక్తలలో ముహమ్మద్(స) చిట్టచివరి వారు. ఆయన గారిపై అవతరించిన చివరి దైవగ్రంథం దివ్య ఖుర్ఆన్. ఇక దైవప్రవక్తలూ రారు, దైవగ్రంథాలూ రావు. దివ్యఖుర్ఆన్ 23 సంవత్సరాల కాలంలో ఇస్లాం ధర్మోద్యమ అవసరాలకు అనుగుణంగా ముహమ్మద్(స) ప్రవక్తపై అవతరించింది. పూర్వపు గ్రంథాలన్నీ అంతరించాయి. పైగా అవి సురక్షితంగానూ లేవు. అవి రద్దు చేయబడ్డాయి. దివ్య ఖుర్ఆన్ దైవప్రోక్తమైన గ్రంథం (Revealed Book). ముహమ్మద్ (స) ప్రవక్త అటునుంచి కొన్ని సూత్రాలు, ఇటు నుంచి కొన్ని సూత్రాలు తెచ్చి తయారు చేసిన గ్రంథం కాదు- దివ్యఖుర్ఆన్. అది ముహమ్మద్ (స) రచన కాదు, దేవుని రచన.

పరదా పద్ధతిని రచయిత దురాచారమని అభివర్ణించారు. ఇది విశ్వప్రభువైన దేవుడు దయతో స్త్రీలకు ప్రసాదించిన ఒక మహత్తరమైన

కానుక. అది స్త్రీల గౌరవాన్ని, సౌకుమార్యాన్ని రక్షిస్తుంది. వారి సౌంద ర్యాన్ని ఇతరుల కంట పడకుండా కాపాడుతుంది. ఆమె సిగ్గును, బిడియాన్ని రక్షిస్తుంది. దుష్ట మనస్కులైన పురుష రాక్షసులను దూరంగా ఉంచుతుంది. స్త్రీ అందచందాలు ఆమె భర్తకే పరిమితం కావాలి. వాటిని ఆమె ఇతరుల ముందు ప్రదర్శించకూడదు. అర్ధనగ్నంగా అలంకరించు కుని రోడ్డు మీద నడిచే స్త్రీలు ఎన్ని అగచాట్ల పాలవుతున్నారో మనం చూస్తున్నాము. స్త్రీలకు కూడా పురుషులతోపాటు సమానమయిన స్వాతంత్ర్యం కావాలని ఎలుగెత్తి అరిచే పురుషులు నిజమైన స్త్రీ శ్రేయోభిలాషులు కారు. ఏదో ఒకవిధంగా ఆమెను ఇంటి నుంచి బయ టకు లాగి ఆమె అందచందాలను జుర్రుకోవాలని వారు చూస్తున్నారు. అమాయకురాలైన స్త్రీ ఇటువంటి నినాదాలకు మోసపోతోంది. స్త్రీలు గనక పరాయి పురుషులతో స్వేచ్ఛగా తిరిగే మాటైతే, పవిత్రత నశిస్తుంది. అశ్లీలత పెరుగుతుంది. కనుకనే ఇస్లాం స్త్రీల కార్యరంగాన్ని పురుషుల కార్యరంగంతో కలుపలేదు. ఆ రెంటిని వేర్వేరుగా ఉంచింది. దీనివల్ల గృహం, సంఘం రెండూ కలుషితం కావు. దైవప్రవక్త ముహమ్మద్(స) ప్రియ సతీమణి హజ్రత్ ఆయెషా(ర) పరదా నియమాన్ని పాటిస్తూనే ఒంటెపై ఎక్కి 'జమల్' యుద్ధంలో పాల్గొన్నారు. పరదాలో ఉంటూనే ఆ కాలంలో స్త్రీలు యుద్ధ మైదానంలో నర్సింగ్ కార్యక్రమాలను నిర్విఘ్నంగా నిర్వహించారు. ప్రస్తుతం దేశంలో కొన్ని పట్టణాలలో పరదాలో ఉంటూనే ముస్లిం స్త్రీలు డాక్టర్లుగాను, నర్సులుగాను, లెక్చరర్లుగాను పనిచేస్తున్నారు. మొత్తానికి భారతీయ సమాజంలోనే విద్యా శాతం తక్కువ. అందునా స్త్రీలలో విద్యావంతులు మరీ తక్కువ. ముస్లిం సమాజం తత్కారణంగా

భారతీయ సమాజాన్నే ప్రతిబింబిస్తుంది. ముస్లిం స్త్రీలలో విద్య చాలా తక్కువ. దీనికి కారణం పరదా కాదు, ముస్లిం సమాజం ఆర్థికంగా చితికిపోవటం, వారికి విద్యావకాశాలు లేకపోవటం, ప్రభుత్వం తీసుకో వలసినంత శ్రద్ధ తీసుకోకపోవటం; విద్య ఒక వ్యాపారంగా మారటం, డొనేషన్లు రాజ్యమేలుతుండటం, సిరిసంపదలు కల ముస్లింలకు చైతన్యం లేకపోవటం. అంతేకాని పరదా ప్రగతికి ఎంతమాత్రం ప్రతిబంధకం కాదు. అది స్త్రీ స్థానాన్ని సమున్నతం చేస్తుంది. అరాచకపు, అశ్లీలపు ద్వారా లను శాశ్వతంగా మూసివేస్తుంది. వ్యక్తిలో, కుటుంబంలో, సమాజంలో క్రమశిక్షణను పెంచుతుంది.

తరువాత రచయిత 'నలుగురు భార్యలనే కాకుండా ఎందరినైనా ఉంపుడు గత్తెలను ఉంచుకునే హక్కు ముస్లిం మగవారికి శాసనబద్ధంగా దక్కింది' అని వ్రాశారు. "ఉంపుడు గత్తెలను ఉంచుకోవచ్చు" అనే సిగ్గు విడిచిన మాటల్ని రచయిత ఎక్కణ్ణుంచి తీసుకున్నారో తెలియదుగాని, అది మాత్రం పవిత్ర ఖుర్ఆన్‌లోనూ లేదు, ప్రవక్త(స) సూక్తులలోనూ లేదు. అలా చూస్తే ఏ మత గ్రంథంలోనూ ఈ మాట లేదు. పదాలు కూడా అశ్లీలమైన పదాలే, భావం కూడా అశ్లీలమైన భావమే. రచయితకు సిగ్గు, బిడియం లాంటి విలువలు తెలియవులా ఉంది. మరి పనీపాటా ఏమీ లేనట్లే కనిపిస్తోంది. లేకపోతే అనవసరపు విషయాల జోలికి, తనకు ఏమాత్రం తెలియని విషయాల జోలికి ఎందుకు పోయినట్లు? ఇది దురుద్దేశపూరితమయినదే కాని మరొకటేమీ కాదు. దివ్యఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు, 'వ్యభిచారం దరిదాపులకు కూడా పోకండి. అది అతి దుష్ట కార్యం, బహు చెడ్డ మార్గం."(బనీ ఇస్రాయీల్ : 32)

మహాప్రవక్త ముహమ్మద్ (స) ఒక సూక్తిలో, "నేను వివాహాన్ని సులభతరం చెయ్యటానికి, వ్యభిచారాన్ని కష్టతరం చెయ్యటానికి వచ్చాను" అని సెలవిచ్చారు.

ఇక నలుగురు భార్యల విషయం: దివ్యఖుర్ఆన్‌లో ఇలా ఉంది: "అనాధలకు న్యాయం చెయ్యలేమనే భయం మీకు కలిగితే, మీకు నచ్చిన స్త్రీలను ఇద్దరేసి గాని, ముగ్గురేసి గాని, నలుగురేసి గాని వివాహం చేసుకోండి. అయితే వారితో న్యాయంగా వ్యవహరించలేమనే భయం మీకు ఉంటే, అప్పుడు ఒక్క స్త్రీని మాత్రమే వివాహం చేసుకోండి." (నిసా : 3)

ఈ వాక్యం అవతరణకు పూర్వం అరేబియా సమాజంలో పురుషులు చాలా మంది స్త్రీలను వివాహం చేసుకునేవారు. ఈ వాక్యం బహు భార్యత్వాన్ని పరిమితం చేస్తుంది. ఒకే సమయంలో నలుగురి కంటే ఎక్కువ మంది భార్యలను కలిగి ఉండటాన్ని నిషేధిస్తుంది. ఇంకా అందరికీ న్యాయం చెయ్యాలనే షరతుతో బహు భార్యత్వపు అనుమతిని బంధిస్తుంది. నలుగురు భార్యలను తప్పకుండా చేసుకోవాలి అని ఖుర్ఆన్ ఆజ్ఞాపించటం లేదు. ఇది కేవలం ఒక అనుమతి మాత్రమే. అనివార్యమైన పరిస్థితులలో ఒకరికంటే ఎక్కువ మంది స్త్రీలను వివాహం చేసుకోవచ్చు. అదీ కేవలం నలుగురిని మాత్రమే. స్వతహాగా బహు భార్యాత్వం ఒక చెడు అని అనటమే అసలు ఒప్పుకోతగ్గ విషయం కాదు. ఎందుకంటే కొన్ని పరిస్థితులలో ఇది ఒక సాంఘిక, నైతిక ఆవశ్యకత అవుతుంది. యుద్ధంలో అమరగతులైన సైనికుల భార్యలు వితంతువులైనప్పుడు, భర్త కోరికలు తీర్చలేనంతగా భార్య ఆరోగ్యం చెడిపోయినప్పుడు, భార్యకు వంధ్యత్వం వచ్చినప్పుడు, మత కలహాలు, కుల ఘర్షణలు జరిగి భారీ ఎత్తున పురుషులు

మరణించి వారి భార్యలు వితంతువులైనప్పుడు- పురుషులు ఒకరికంటే ఎక్కువ మందిని వివాహం చేసుకోవటం అత్యవసరమవుతుంది. తద్వారా వితంతువులైన స్త్రీలకు గౌరవప్రదమైన దాంపత్య జీవితం లభిస్తుంది. ఇస్లాంలోని వివాహ చట్టం యొక్క ఉద్దేశ్యం సమాజంలో నీతిని, శీలాన్ని, పరిశుద్ధతను కాపాడటం. ఇస్లాం అక్రమ సంబంధాలను చట్టవ్యతిరేక చర్యలుగా గర్హిస్తుంది.

"విడాకుల విషయంలో పురుషులపై షరీఅత్ ప్రకారమో, ఖురాన్ ప్రకారమో ఎలాంటి నిబంధనలూ విధించబడలేదు. మూడు రాళ్ళు విసిరినా, బొటనవ్రేలు, చూపుడు వ్రేలు, నడిమి వ్రేలు కలిపి చూపినా విడాకులకు సూచన"- ఈ విషయాలు దివ్యఖుర్ఆన్‌లోనూ లేవు. మహా ప్రవక్త(స) సూక్తులలోనూ లేవు. ఒక మంచి మతంపై, ఆచరణ యోగ్యమైన ఒక చక్కని జీవన వ్యవస్థపై అభాండాలు మోపారు రచయిత.

భార్యాభర్తలు అన్యోన్యానురాగాలతో దాంపత్య జీవితం గడపాలనీ, వారు ఉభయులూ ఒకరికొకరు వస్త్రాల వంటి వారనీ దివ్యఖుర్ఆన్ బోధిస్తోంది. కానీ భార్యాభర్తల మధ్య సంబంధాలు ఎల్లప్పుడూ ఒకేవిధంగా ఉండవు. అవి చెడిపోతాయి. సంస్కరణకు వీలుకానంత అధ్వాన్నంగా సంబంధాలు దెబ్బ తిన్నప్పుడు, కలిసిమెలిసి దాంపత్య జీవితం గడపటం అసాధ్యమైనప్పుడు, గృహం నరకతుల్యమైపోయినప్పుడు స్త్రీ పురుషులు భార్య భర్తలుగా ఉండటం సమంజసమా?

విడాకులనేది ప్రతి కుటుంబ చట్టం (Family Law)లోనూ ఉంది. అనాదిగానూ ఉన్నది- అది దైవ శాసనమైనా సరే, మానవుడు చేసిన చట్ట మైనా సరే. కాకపోతే విడాకుల పద్ధతులలో భేదం ఉండవచ్చు. ఇస్లాం

ధర్మంలో వివాహం ఒక సాంఘిక ఒప్పందం (Social Contract). ఉభయ పక్షాలకు ఇష్టమున్నంత కాలం అది కొనసాగుతుంది. వారిలో ఏ ఒక్కరికి ఇష్టం లేకపోయినా అది రద్దవుతుంది.

ప్రేమానురాగాలు లేని వైవాహిక బంధం ఒక శవం లాంటిది. దాన్ని పూడ్చివేయకపోతే కుళ్ళిపోతుంది. వాతావరణాన్ని కాలుష్యంతో నింపుతుంది. కనుక విడిపోవటం తప్ప, వైవాహిక బంధాన్ని తెంచటం తప్ప మరొక మార్గం లేదు. వేధింపులు, హింసలు, హత్యలు, ఆత్మహత్యల వరకు సాగదీయటంకంటే, విడిపోవటం, విడాకులిచ్చుకోవటం శ్రేయస్కరం. విడాకుల హక్కు భార్యాభర్తలు ఉభయులకూ ఉంది. అది భర్త తరఫునుంచి అయితే 'తలాఖ్' అనబడుతుంది. భార్య తరఫు నుంచి అయితే 'ఖులా' అనబడుతుంది.

ఇస్లాం ధర్మశాస్త్రం ప్రకారం కుటుంబాన్ని పోషించే బాధ్యత భర్త భుజస్కంధాలపై ఉంది. చట్టరీత్యా భార్యపై కుటుంబ పోషణ బాధ్యత ఎంత మాత్రం లేదు; ఆమె ఎంత ధనవంతురాలైనా సరే, ఎంత సంపాదిస్తున్నా సరే. ఈ నేపథ్యంలో భర్తకు భార్యపై ఆధిక్యత ఉంది. అంటే బాధ్యతలను బట్టి హక్కులు ఉన్నాయన్నమాట.

ఇస్లాం ధర్మం ప్రకారం విడాకుల కోసం కోర్టులకు వెళ్ళే అవసరం లేదు. అసలు విడాకులనేది భార్యాభర్తల వ్యక్తిగత విషయం. అది గౌరవప్రదంగా, గంభీరమైన రీతిలో, శాంతియుత వాతావరణంలో, కుటుంబ ప్రతిష్టను కాపాడే విధంగా జరగాలి. విడాకుల హక్కు, స్వేచ్ఛ, స్త్రీ పురుషులు ఉభయులకూ ఉన్నా, అది వివాహం అంత తేలిక ఏమీకాదు. జాగ్రత్తగా ఆలోచించి, బాధ్యతాయుతంగా చేయవలసిన పని. జీవిత

భాగస్వామిని శాశ్వతంగా కోల్పోయే నిర్ణయం- బాగా ఆలోచించిన తరువాతనే జరగాలి. కనుక విడాకుల పద్ధతి ఇస్లాం ధర్మం ప్రకారం చాలా జాగ్రత్తతో, బాధ్యతతో కూడుకున్న విషయం. స్వల్ప విషయాలకు విడాకులివ్వటం, తొందరపాటుతో విడాకులివ్వటం, ఉద్రేకంలో విడాకులివ్వటం, మైకంలో, మత్తులో విడాకులివ్వటం, నిద్రావస్థలో విడాకులివ్వటం, మతిభ్రమించిన స్థితిలో విడాకులివ్వటం ధర్మశాస్త్రానికి పూర్తిగా వ్యతిరేకమైనవి. భార్యాభర్తల మధ్య రాజీ కుదర్చటానికి గట్టి ప్రయత్నాలు జరగాలి. ఉభయుల పెద్దలను ఒకచోట సమావేశపరిచి దివ్యఖుర్ఆన్ ప్రకారం సమస్యను సామరస్య పూర్వకంగా పరిష్కరించాలి. ఈ ప్రయత్నాలు ఫలించకపోతే చివరి మార్గంగానే విడాకులను ఆశ్రయించాలి. అల్లాహ్ దృష్టిలో అనుమతించబడిన అన్ని విషయాలలోకెల్లా విడాకులే ఎంతో అప్రియమైనది. ధర్మశాస్త్రం ప్రకారం విడాకులనేది మూడుసార్లు ఇవ్వాలి, వేర్వేరు సమయాలలో ఇవ్వాలి. స్త్రీ బహిష్టు కాలంలో ఇవ్వకూడదు. ఆమె తలంటి స్నానం చేసిన తరువాత, పరిశుద్ధావస్థలో ఉన్నప్పుడు మాత్రమే ఇవ్వాలి; గౌరవనీయులైన ఇద్దరు సాక్షుల సమక్షంలో ఇవ్వాలి. అంటే మూడు 'తుహుర్ల'లో అంటే మూడు పరిశుద్ధా వస్థలలో, మూడు మాసాల కాలంలో ఒక్కొక్కసారి ఇవ్వాలి. ఈ మూడు దశలలో భర్త తన భార్యను మళ్ళీ చేరదీసుకునే అవకాశం ఉంది, ఆలోచించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఎందుకంటే చివరిసారి అంటే మూడవసారి విడాకులిచ్చేవరకు భార్యాభర్తలు ఒకే ఇంట్లో ఉంటారు. ఈ విధానమే శాస్త్ర సమ్మతమైన విధానం.

ఇకపోతే ఏక కాలంలో మూడు సార్లు విడాకులివ్వటమనే

విషయం. ఈ విధంగా ఎవరైనా తమ భార్యలకు విడాకులిస్తే అది పాప కార్యం. కాని వారు శాశ్వతంగా వేరైపోతారు, భార్యాభర్తలుగా ఉండరు. దైవప్రవక్త ముహమ్మద్(స)ను ఒకసారి హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ అడిగారు : "నేను నా భార్యకు ఒకేసారి మూడు విడాకులిస్తే, ఆమెను నేను మళ్ళీ తిరిగి భార్యగా చేసుకోగలనా?" అప్పుడు ప్రవక్త(స) ఇలా అన్నారు: 'లేదు. మీరు అలా వాపసు తీసుకోలేరు. ఆమె మీకు దూరమవుతుంది. ఇది పాపం" మరొక హదీసులో ప్రవక్త(స) ఇలా అన్నారు. "ఒకవేళ నీవు అలా చేస్తే, నీవు నీ ప్రభువు పట్ల అవిధేయత చూపే వాడవవుతావు. నీ భార్య నీ నుండి వేరవుతుంది."

ఏక కాలంలో మూడు సార్లు విడాకులిచ్చే మనిషి ఆలోచించి విడాకులివ్వడు. విడాకులనేది గంభీరంగా, ఒకటికి రెండుసార్లు ఆలోచించి చేయవలసిన పని. అనాలోచితంగా ఎవరైనా విడాకులిస్తే వారి భార్యలు వారికి శాశ్వతంగా దూరమైపోతారు. తరువాత పశ్చాత్తాపపడినా ప్రయోజనం ఉండదు. కనుక దివ్యఖుర్ఆన్‌లో దేవుడు చూపిన పద్ధతి అంటే- మూడు 'తుహర్'లలో విడాకులివ్వటం- సముచితమైనది, సమంజసమైనది.

'మరొక విడాకుల పద్ధతి – భార్యకు గాని, భార్యలకు గాని వీపు చూపటం. మొగుడు తన పెళ్ళానికో, పెళ్ళాలకో విడాకులివ్వదలిచితే వారితో 'నీవు, మీరు నా తల్లి వీపు (వెన్ను) లాంటి వారు" అంటే చెల్లు తుంది. దీన్ని అరబీలో 'జిహార్' అంటారు అని రచయిత వ్రాశారు. ముహ మ్మద్ ప్రవక్త(స) వారి ఆగమనానికి పూర్వం ఈ దురాచారం అరేబియా సమాజంలో చెలామణిలో ఉండేది. దివ్యఖుర్ఆన్ దానిని ఖండించింది,

నిషేధించింది. ఖుర్ఆన్‌లో ఇలా ఉంది: 'అల్లాహ్ ఏ వ్యక్తి శరీరంలోనూ రెండు హృదయాలను పెట్టలేదు. మీరు జిహార్ చేసే మీ భార్యలను ఆయన మీకు తల్లులుగా చేయలేదు" (అహ్‌జాబ్ -4). రచయిత దివ్యఖుర్ఆన్‌లో లేని విషయాలు ఉన్నట్లు, ఉన్న విషయాలు లేనట్లు వ్రాశారు. అనవస రంగా ఆయన పాపకార్యాలకు ఒడిగట్టుతున్నారు.

'మహర్ అంటే బాడుగ. స్త్రీ తన శీలాన్ని పెళ్ళి మూలంగా మగ వానికి అర్పిస్తున్నందుకు ఆమెకు చెల్లింపబడే కూలి లేక బాడుగ మాత్రమే. భార్యలు తాము అర్పించుకున్న శీలానికి బదులుగానే మెహర్‌ను పుచ్చుకుం టున్నారు' అని కూడా వ్రాశారు. వివాహం జరిగే శుభ సమయంలో వరుడు తన ఆర్థిక స్థోమతకు అనుగుణంగా వధువుకు ప్రేమ పూర్వకంగా ఇచ్చే పవిత్రమైన కానుక 'మహర్'. ఇది స్త్రీ యొక్క స్థిరాస్థి అవుతుంది. అంతేగాని ఆ పదానికి పెడార్థాలు తొడగటం నిజాయితీ కాదు.

ఇక స్త్రీ బహిష్ఠ కావటం, పిల్లల్ని కనటం, ఇంటి వ్యవహారాలను చక్కదిద్దటం అనేవి స్త్రీ బలహీనతలు కావు. అవి ఆమెకు సహజమైన ప్రకృతి ధర్మాలు. అవి లేకపోతే మానవ సమాజం అంతరించిపోతుంది.

మన దేశం సెక్యులర్ దేశం. మన రాజ్యాంగం అన్ని మతాలకు సమానమైనటువంటి ప్రాముఖ్యాన్ని కల్పిస్తోంది. ప్రజలు శాంతియుత సహ జీవనం గడుపుతున్నారు. ఎవరి మతాల ఆచారాలను వారు పాటిస్తున్నారు. ఈ సమగ్రతను, ఈ సామరస్యాన్ని, ఈ సహజీవనాన్ని ఛిన్నాభిన్నం చేసే హక్కు ఎవరికీ లేదు. ఎవరన్నా అలా చేస్తే దేశద్రోహం అవుతుంది.

('గీటురాయి' వారపత్రిక 28-11-1997)

కమ్యూనిస్టులు, దొంగ దేశభక్తుల దుష్ప్రచారం నుండి దేశాన్ని కాపాడండి!

రవి అస్తమించని బ్రిటీషు సామ్రాజ్యానికి భారతదేశంలో శాశ్వత సమాధి కట్టిన తరువాత అంటే దేశం స్వతంత్రం అయిన తరువాత, పేపర్లలో పడిన వార్తలు, ప్రభుత్వ ప్రకటనల ప్రకారం ఇంతవరకు వారానికి కనీసం మూడు చొప్పున హిందూ ముస్లిం కలహాలు జరిగాయి. నిష్పాక్షిక దృష్టితో ఈ కలహాలను విశ్లేషిస్తే, కొన్ని విషయాలు మనకు కొట్టవచ్చినట్టు కన్పిస్తాయి. వేల సంఖ్యలో ముస్లింలు హత్య చెయ్యబడ్డారు. కోట్ల రూపాయల ఆస్తిని వారు కోల్పోయారు, లక్షల సంఖ్యలో నిరాశ్రయులయ్యారు. వారి వ్యాపారాలు విపరీతంగా దెబ్బతిన్నాయి, మానసికంగా వారు కృంగిపోయారు. ఇవి వాస్తవాలు. వీటిలో ఏమాత్రం సందేహంలేదు. కనుక అధికంగా అన్నివిధాలా నష్టపోయిన అల్పసంఖ్యాకులే కయ్యానికి కాలు దువ్వుతారనీ, కలహాన్ని ప్రారంభిస్తారు అని అనటం అన్యాయం, అతిశయోక్తి, అభూత కల్పన. నష్టాన్ని, కష్టాన్ని ఎవడు,ఎందుకు ఆహ్వానిస్తాడు?

మత కలహాల ప్రజ్వలనకు మతమే ప్రబల కారణం, కనుక మనిషి మతాన్ని ఎంత త్వరగా విసర్జిస్తే అంత మంచిది అని మతం అంటే ఏమిటో ఓనమాలు కూడా తెలియని భోగలాలసులైన నాస్తికులు, నాస్తిక కమ్యూ

నిస్టులు (అస్తిక కమ్యూనిస్టులు కూడా ఉన్నారులెండి) ఎలుగెత్తి అరుస్తు న్నారు. ప్రజలు మతంపైన నడుస్తున్నారు కనుక మత కలహాలు విజృం భిస్తున్నాయి అనటం అసమంజసం, అవాస్తవికం. ఎందుకంటే ఏ మతమూ హింసా దౌర్జన్యాలను, విద్వేష వైషమ్యాలను బోధించదు. ముఖ్యంగా ఇస్లాం ధర్మంపై నడిచే మనిషి మృదు హృదయుడు, మితభాషి, శాంత స్వభావుడు, సౌశీల్యవంతుడు అవుతాడు. ఖుర్ఆన్, బైబిల్, వేదాలలో ఉన్న విషయాల కారణంగా ఘర్షణలు రేగినట్లు ఆధారాలు లేవు. అంటే మతం, దాని మార్గదర్శక సూత్రాలు ప్రజల్ని ఎన్నడూ కార్పణ్యానికి, కలహానికి పురికొల్పలేదు. మతంపై నడవని కారణంగా, మతాన్ని తృణీకరించటం వల్ల, మత కలహాలు చెలరేగాయి అంటే అది పూర్తిగా నిజం, ఎందుకంటే మతంలో నమ్మకంలేని మనిషి స్వార్థపరుడుగా, సంకుచిత స్వభావుడుగా రూపొందుతాడు. అధికారం కోసం, ఐశ్వర్యం కోసం అన్ని మార్గాలను అవలంబిస్తాడు. చివరకు ఆధునిక, ప్రగతిశీల ప్రపంచానికి పనికిరావని శాశ్వత మానవ, నైతిక విలువల్ని సైతం మారుస్తాడు. కనుక ప్రజలు తమ తమ మతాలను అవలంబిస్తున్నారు కనుక మతకలహాలు జరుగుతున్నాయి అనే సిద్ధాంతం లోపభూయిష్టం.

మొన్న ఉత్తర భారతంలో చెలరేగిన మత కలహాల వెనుక విదేశీ హస్తం ఉన్నదని ప్రధానమంత్రి శ్రీమతి గాంధీ ఆరోపించారు. ఈ కలహా లకు అరబ్బు దేశాలే కారణం అని ఆర్ఎస్ఎస్ నాయకులు శ్రీ బాలా సాహెబ్ దేవరస్ అభియోగం. శ్రీమతి గాంధీ ప్రభుత్వాన్ని కూలదొయ్యా లనే దురుద్దేశ్యంతో కొన్ని రాజకీయ పార్టీలే ఈ మత కలహాలను రెచ్చగొడుతున్నాయి అని హోంశాఖ సహాయమంత్రి శ్రీ మక్వానా ఉవాచ. ఈ మత కలహాలను అసలు రెచ్చగొట్టింది హిందూమతతత్వ సంస్థ ఆర్ఎస్ఎస్ అనటానికి ఎన్నో ఆధారాలున్నాయి అని కొందరు ముస్లిం,

కాంగ్రెస్ నాయకుల ప్రకటన. ఈ మత కలహాల విజృంభణకు ముస్లిం మితవాద సంస్థ అయిన జమాఅతె ఇస్లామీ హింద్‌యే కారణం అని ఎల్లప్పుడూ ఇస్లాంను తూలనాడే 'ఈనాడు', విశాల దృష్టిని కోల్పోతున్న 'విశాలాంధ్ర' దినపత్రికలు. 'పాకిస్తాన్ భక్తులు' కొందరు ఈ కల్లోలాలను రేపారు అని కొన్ని పత్రికలు అంటే, మురాదాబాద్ ఈద్గాహ్ ప్రాంగణంలో పిట్టల్ని చంపినట్లు నిరాయుధులు, నిస్సహాయులు అమాయకులు అయిన మానవుల్ని చంపిన పాశవిక పోలీసు బలగంలో అధికులు ఆర్‌ఎస్‌ఎస్ మనుషులు అని కొన్ని వ్రాశాయి. ఇవన్నీ నిర్దిష్టమైన ఆరోపణలూ కాదు, ఆధారాలున్న అభియోగాలూ కాదు. పైగా కొన్ని విద్వేష, వైషమ్యపూరితాలైతే కొన్ని అసూయా జనితాలు, కొన్నిట్లో బాధ్యతా రాహిత్యం ఉంటే, మరికొన్నిట్లో స్వార్థప్రయోజనం, అవకాశవాదం, కొన్ని 'నాన్‌సెన్స్'ను విరజిమ్మితే, మరికొన్ని 'ఇగ్నొరెన్స్'ను ప్రదర్శిస్తాయి. దేశ క్షేమాన్ని, మత సామరస్యాన్ని, జాతీయ సమైక్యతను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రకటనలు చేసినట్లు కన్పించదు. ఎందుకంటే వీటివల్ల పరిస్థితులు మెరుగుపడవు, సమస్యలు పరిష్కారం కావు. కాలిన గుండెలు కుదుట పడవు, చితికిన సంసారాలు కోలుకోవు. మన దేశంలో ఎన్నో మతాలు, ఎన్నో సిద్ధాంతాలు, ఎన్నో వర్గాలు ఉన్నాయి. వాటి మధ్య సఖ్యత, సామరస్యం ఉండటం చాలా అవసరం. ఇవి లేకపోతే దేశానికి ఉజ్వలమైన భవిష్యత్తు లేదు. 'నేనే గొప్పవాణ్ణి, ఇదే నా దేశం, నేనూ నా సిద్ధాంతం, నా మతం, నా పార్టీ తప్ప ఈ దేశంలో ఎవరూ, ఏ సిద్ధాంతం, ఏ మతం, ఏ పార్టీ ఉండటానికి వీల్లేదు' అనే నినాదాలు, ధోరణులు దేశానికి తీరని ద్రోహం చేశాయి. ఇవి ఉంటే దేశంలో సమైక్యతా భావన వర్ధిల్లదు. సామరస్యం పెంపొందదు. వీటిని విడనాడి కలిసిమెలిసి 'అందరూ మానవులమే' అనే సూత్రం ఆధారంగా జీవించటం నేర్చుకోవాలి. ఈ భావాన్నీ ఎక్కువగా అందరూ

ప్రచారం చెయ్యాలి. అందరూ పరస్పరం సన్నిహితులు కావాలి. ఒకరి నొకరు అవగాహన చేసుకోవటానికి ప్రయత్నం చెయ్యాలి. అప్పుడే పరస్పర ప్రేమానురాగాలు సాధ్యమవుతాయి.

'మతతత్వం' అంటే ఏమిటో భారత రాజ్యాంగంలో నిర్వచించటం జరగలేదు. భారత రాజ్యాంగం నిర్దేశించిన హద్దుల్లో ఉండి ప్రతి పౌరుడూ ప్రతి సంస్థ తన మతాన్ని ప్రచారం చేసుకోవచ్చు. ఒక కమ్యూనిస్టుకు కమ్యూనిజాన్ని ప్రచారం చేసుకునే హక్కు ఎంతైతే ఉందో, అంతే హక్కు ఒక హిందువుకు తన హిందూ ధర్మాన్ని, ఒక ముస్లింకు తన ఇస్లామీ ధర్మాన్ని ప్రచారం చేసుకునే హక్కు ఉంది. కనుక ఇదమిద్ధంగా, ఫలానా సంస్థ మతతత్వ పూరితమైనది అని చెప్పలేము.

ముఖ్యంగా దేశానికి స్వాతంత్ర్యం లభించిన తరువాత, దేశంలో జాతీయ సమైక్యతా భావాన్ని పెంపొందింపజేయటానికి, విభిన్న మతాల వారి మధ్య సామరస్య వారధిని నిర్మించటానికి, జమాఅతె ఇస్లామీ హింద్ ఎంత కృషి చేసిందో, తన అమూల్యమైన ఎంత కాలాన్ని, శక్తి సంపదలను వెచ్చించిందో, కళ్ళూ చెవులూ ఉన్న ప్రతి వారికీ తెలుసు. ఈద్ మిలాప్ సమావేశాలు, జాతీయ సమైక్యతపై గోష్ఠులు, సమైక్యతా, సామరస్య వారో త్సవాలు, కరపత్రాల ప్రచురణ, హిందూ ముస్లిం సోదరుల్ని ఒకే వేదికపైకి తీసుకురావటం, హిందూ ముస్లిం సోదరులున్న సంక్షేమ సంఘాల స్థాపన, ప్రభుత్వాధికారులతో కలిసి మతోద్రేకాలను రెచ్చగొట్టే పాఠ్యాంశాలను తొలగించమని విజ్ఞప్తి చెయ్యటం – ఈ మార్గాల ద్వారా జమాఅత్ మత సామరస్యాన్ని పెంపొందించటానికి ప్రయత్నం చేసిన, చేస్తూ ఉన్న విషయం, ప్రభుత్వానికి రాజకీయ నాయకులకు తెలియదా? ఇంత భారీ ఎత్తున దేశంలో సమైక్యత కొరకు, సామరస్యం కొరకు పాటుపడిన సంస్థ గానీ పార్టీ గాని మరొకటేదైనా ఉందా? ఇది మతతత్వమా? అయితే

దురదృష్టవశాత్తు పత్రికలు, రేడియో జమాఅత్‌కు తోడ్పడలేదు. స్వయంగా కమ్యూనిస్టు నాయకులు ఎంతమంది జమాఅత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చెయ్యబడిన గోష్టుల్లో, సభల్లో పాల్గొనలేదు? వారి పత్రికలు కూడా ఈ వార్తల్ని ప్రచురించాయిగా? ఇంతకుముందు ఏ సంస్థవారైనా మానవ సౌభ్రాతృత్వం పెంపొందించే ఉద్దేశ్యం కొరకు వారి ఇళ్ళకు, ఆఫీసులకు ఇంత తరచుగా వచ్చారా? ఇదేవిధంగా ఇతర రాజకీయపార్టీల నాయకుల వద్దకు, హిందూ, సిక్, క్రైస్తవ మతగురువుల వద్దకు, చివరకు నాస్తికుల వద్దకు కూడా జమాఅత్ నాయకులు పోయారు. మతతత్వం ఉన్నవారి ప్రవర్తన ఇలాగే ఉంటుందా?

ఇంతవరకు జరిగిన మత ఘర్షణల్లో ముస్లింలకే ఎక్కువ నష్టం జరిగిందనే విషయం నిర్వివాదాంశం. అసలు భారతదేశంలో ఏమి జరుగుతూ వచ్చిందంటే, మొదటేమో సాయుధులైన గూండాలు అధికసంఖ్యలో అకస్మాత్తుగా ముస్లిం వీధులపై దాడిచేసి, గృహ దహనాలకు, దోపిడీకి పాల్పడతారు, ప్రతిఘటించిన వారిని హతమారుస్తారు. ఇంకా ఎన్నో అత్యాచారాలు చేస్తారు. ఇదంతా నిమిషాల్లో జరిగిపోతుంది. ముస్లింలు తేరుకుని ఆత్మరక్షణకు సిద్ధపడుతూ ఉండగా, పోలీసొళ్ళస్తారు, నిర్దాక్షిణ్యంగా కొడతారు, అరెస్ట్ చేస్తారు. ఈ విధంగా రెండు విధాలా నష్టపోయేది ముస్లింలే. ఇది ఒక పథకం ప్రకారం జరుగుతుంది.

నిరాశ్రయులు, నిస్సహాయులు అయిన అమాయక ప్రజలను ఎవరు ఆదుకున్నారు? భారీఎత్తున పునరావాస కార్యక్రమాలను ఎవరు చేపట్టారు? వారిని ఓదార్చింది, వారికి ధైర్యం చెప్పింది ఎవరు? కమ్యూనిస్టులా లేక కాంగ్రెస్ వాళ్ళా? లేక ఆ పార్టీల్లోని సోకాల్డ్ ముస్లిం నాయకులా? లేక జమాఅతె ఇస్లామీ కార్యకర్తలా? ఆపదలో ఉన్న వాళ్ళను ఆదుకోవటం మతతత్వమా? అన్యాయానికి గురి అయిన వారికి సహాయ సహ

కారాలు అందివ్వటం మతతత్వం ఎంతమాత్రం కాదు.

ఇంత జరిగినా ముస్లింలు తమ మనోధైర్యాన్ని, వ్యక్తిత్వాన్ని కోల్పో లేదంటే, నిరాశా నిస్పృహలకు గురై కృంగి, కృశించి, నశించిపోలేదంటే, వారిలో వ్యతిరేక ధోరణులు చోటుచేసుకోలేదంటే, వారు దౌర్జన్యపరులుగా మారలేదంటే ఇది అనంత కరుణామయుడైన అల్లాహ్ అనుగ్రహం తప్ప మరొకటి కాదు. పన్నెండు కోట్ల సంఖ్యలో ఉన్న ముస్లింలు మానసికంగా, నైతికంగా ఎంత బలపడితే అంతే దేశానికి కూడా బలం. భారతదేశ ఉజ్వల భవిష్యత్తుకు, దాని అంతర్జాతీయ ఖ్యాతికి వారు ఎంతో చేశారు, చేస్తున్నారు.

ఇక్కడ ఒక విషయం జ్ఞాపకం ఉంచుకోవాలి. ముస్లింలు దాదాపు ప్రపంచంలోని అన్ని దేశాల్లో ఉన్నారు. వారంతా ఇస్లాం ధర్మావలంబీకులే. కనుక వారి మధ్య ఒక విధమైన అవ్యాజానురాగం, అవినాభావ సంబంధం ఉంటుంది. ఇతర దేశాల్లో ఉన్న ముస్లింలకు ఏదన్నా కష్టం కలిగితే, ఇక్కడి ముస్లింలు బాధపడతారు. ఇది సహజం,సమంజసం. అయితే వారిని సౌదీ అరేబియా భక్తులుగానో లేక ఈజిప్టు భక్తులుగానో అభివర్ణించటం భావ్యం కాదు. రష్యా జిందాబాద్, చైనా జిందాబాద్ అని కమ్యూనిస్టులు నినదించి నట్లుగా ముస్లింలు నినదించరుగా! భారతదేశ విభజనను బ్రిటీషు వారు తప్ప ఎవరూ హర్షించలేదు. విభజన జరిగినంత మాత్రాన ముస్లింల పట్ల అపోహలను కలిగి ఉండటం, వారి దేశభక్తిని శంకించటం వారిని కించ పరచటమే.

జమాఅతె ఇస్లామీ హింద్ నిస్సందేహంగా ఒక ధార్మిక సంస్థే. అయితే అది మతతత్వ సంస్థ ఎంతమాత్రం కాదు. అది ఇస్లాం ధర్మాన్ని తన సిద్ధాంతంగా స్వీకరించింది. ఎందుకంటే ఇస్లాం కేవలం ఒక మతం మాత్రమే కాదు, అది ఒక సమగ్రమైన జీవిత విధానం కూడా. అందరికీ

సమానంగా జీవితానికి సంబంధించిన అన్నిరంగాల్లో సంతృప్తికరంగా పనికొచ్చే సిద్ధాంతం ఇస్లాం అని జమాఅత్ విశ్వాసం. తన సిద్ధాంతాన్ని జమాఅత్ దేశంలో రాజ్యాంగ సమ్మతమైన, శాంతియుత పద్ధతుల ద్వారా ప్రచారం చేస్తోంది. తన సభ్యుల్ని, సానుభూతిపరుల్ని మంచివారుగా, బాధ్యతాయుతులైన పౌరులుగా, సద్గుణ సంపన్నులుగా తీర్చిదిద్దుతోంది. తోటి మానవుల్ని మంచివైపునకు, నిజమైన దైవదాస్యం వైపునకు ఆహ్వాని స్తోంది. ఈ ఉన్నత కార్యాన్ని జమాఅత్ చేపట్టిన కారణంగా, దాని కార్య క్రమాల వల్ల దేశంలో ఎన్నడూ ఎక్కడా ఘర్షణ చెలరేగలేదు. మతకలహా లను జమాఅత్ ప్రేరేపించనూ లేదు. ప్రేరేపించినట్లు ఏ సాక్ష్యమూ లేదు. అసలు జమాఅత్ సందేశం శాంతిపూరిత వాతావరణంలోనే ప్రాచుర్యం పొందగలుగుతుంది. హింసా దౌర్జన్యాలు ఇస్లాం స్వరూప స్వభావాలకు పూర్తిగా వ్యతిరేకం.

ఇస్లాం పట్ల, ఇస్లామీ ఉద్యమం పట్ల, ముస్లింల పట్ల ముస్లిమేత రుల్లో వ్యాపించి ఉన్న అపార్థాలను తొలగించటానికి జమాఅత్ కృషి చేసింది, చేస్తోంది. దైవాన్ని, దైవ ధర్మాన్ని తిరస్కరించినందువల్ల మానవ సమాజంలో సంక్షోభం చెలరేగుతుందని, మానవుడు దానవుడవుతాడని, కరుడుకట్టిన స్వార్థపరుడవుతాడని హెచ్చరిస్తోంది. దేశంలో కరువు కాటకాలు సంభవించినప్పుడు, తుఫాను ఉప్పెనలు వచ్చినప్పుడు, అంటు వ్యాధులు వ్యాపించినప్పుడు జమాఅత్ కుల, మత, వర్గ, పక్ష భేదాలు లేకుండా కష్టంలో ఉన్న ప్రతి వారినీ ఆదుకుంది. తగువిధంగా సహాయ పడింది. వికలాంగులకు, నిరుపేదలకు, అనాధలకు, వితంతువులకు, వ్యాధిగ్రస్తులకు సహాయపడుతోంది. సత్యం వైపునకు, సత్యధర్మం వైపునకు, న్యాయం వైపునకు, మంచితనం వైపునకు మానవుల్ని ఆహ్వానించే సంస్థ మతతత్వ సంస్థ కాగలుగుతుందా? మంచి వైపునకు పిలిచేవారి, చెడు

నుండి ఆపేవారి గొంతు నులమటం ఆత్మహత్యా సదృశం, దేశ, జాతుల హత్యా సదృశం.

వర్గపోరాటం ఉంటేనే కమ్యూనిజం, కమ్యూనిస్టు పార్టీ మనగలుగుతాయి. హింస ద్వారానే మార్పు, తుపాకి ద్వారానే అధికారం రాగలుగుతాయని నమ్మకం ఉన్న కమ్యూనిస్టు పార్టీ జమాఅతె ఇస్లామీని నిషేధించమని ప్రభుత్వానికి సలహా ఇవ్వటం హాస్యాస్పదం. ఈ పార్టీ చరిత్రను, ఈ పార్టీ కార్యకర్తల్ని ఎరుగనివారు లేరు. వివరాల్లోకి పోవటం అనవసరం. ఈ సలహాను స్వీకరించి ధార్మిక సంస్థలపై ఆంక్షలు విధిస్తున్నామని పాట్నాలో హోంశాఖ సహాయ మంత్రి శ్రీ మక్వాన ప్రకటించటం మరీ హాస్యాస్పదం.

జమాఅతె ఇస్లామీ కశ్మీర్‌లో ఉంది. పాకిస్తాన్‌లో ఉంది. ఇంకా ఎన్నో దేశాల్లో ఇటువంటి సంస్థలు ఉన్నాయి. ఇవన్నీ ఇస్లాం కొరకు పనిచేస్తాయి. కాని వాటికి భారతదేశ జమాఅత్‌తో ఏ సంబంధమూ లేదు. అవి రాజకీయ పార్టీలు, ఎన్నికల్లో పాల్గొంటాయి. కాని జమాఅతె ఇస్లామీ హింద్ రాజకీయపార్టీ కాదు. ఎన్నికల్లో పాల్గొనదు. అది ఒక ధార్మిక సంస్థ మాత్రమే. దుష్ప్రచారానికి ఒడిగట్టే దుర్మార్గుల్ని మరియు తమ నిజమైన శ్రేయోభిలాషుల్ని ప్రజలు ఆలస్యంగానైనా తప్పకుండా గుర్తిస్తారు.

(‘గీటురాయి’ వారపత్రిక : 5-9-1980)